ఆర్టీసీ కార్మికుల రణభేరి!

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- 40 అంశాలపై నేడు ప్రభుత్వానికి మెమోరాండం
- సర్కార్ నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ: జేఏసీ



హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికులు రణభేరి మోగించారు. యాజమాన్య నిర్లక్ష్య ధోరణిపై ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై 40 అంశాలను ప్రభుత్వం ముందుంచాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నిర్ణయించింది. సర్కారు నిర్ణయం మేరకు కార్యాచరణ ఉంటుందని జేఏసీ నేతలు ప్రకటించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని రగలిపోతున్న కార్మికులు పోరుబాటకే సిద్ధమయ్యారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుంచి డ్రైవర్లు, కండక్టర్లపై పనిభారం పెరిగిందని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బాండ్ల బకాయిలు రూ.200 కోట్లు, 2 పీఆర్సీ బకాయిలు, డీఏలు ఇప్పటివరకు పరిష్కారం కాకపోవడం కార్మికుల్లో అసహనం పెరిగిందని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించి, కార్మిక సంఘాలకు గుర్తింపు ఇస్తామనే మాటను పట్టించుకోకపోవడంపై ఆర్టీసీ జేఏసీ మండిపడుతున్నది. ఈ నేపథ్యంలో శనివారం ఆర్టీసీ జేఏసీ తరఫున 40 అంశాలతో కూడిన మెమోరాండాన్ని రవాణా మంత్రి, ఎండీ, రవాణాశాఖ కమిషనర్‌ను కలిసి వారి ముందు పెట్టనున్నట్టు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. కార్మికుల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటించనున్నట్టు వెల్లడించారు.

ఎన్నికలు నిర్వహించాలి: థామస్‌రెడ్డి, వెంకన్న

కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు థామస్‌రెడ్డి, వెంకన్న ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తేనే కార్మికులకు న్యా యం జరుగుతుందని వారు తేల్చి చెప్పా రు. ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంట లు మాత్రమే డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 11 గంటలు, డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు.

ఇండ్ల వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు

- 300 కోట్ల ఆదాయమే లక్ష్యం
- మరింతగా లాజిస్టిక్ నెట్‌వర్క్ విస్తరణ
- హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తరించేందుకు యాజమాన్యం ఏర్పాటు చేస్తున్నది. వినియోగదారుల ఇండ్ల వద్దే 'పికప్ టు డెలివరీ'కి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. ఈ సేవలను మరింత విస్తరించి ఏటా అదనంగా రూ.300కోట్ల ఆదాయం సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రస్తుతం అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో కార్గో బుకింగ్ కోసం ఆర్టీసీలో ప్రత్యేక వ్యవస్థ ఉన్నది. పెద్ద మొత్తంలో బుకింగ్ ఉన్నప్పుడు వారి నుంచి నేరుగా సరుకులు తీసుకొని రవాణా చేస్తున్నది. డెలివరీ మాత్రం హైదరాబాద్‌లాంటి మహా నగరంలో జేబీఎస్, సీబీఎస్, ఉప్పల్ ప్రాంతాల్లో మాత్రమే ఉన్నది. మిగతా పట్టణాల్లో కేవలం బస్టాండ్లలో మాత్రమే డెలివరీ తీసుకోవాలి. దీని వల్ల చాలామంది కస్టమర్లు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై దృష్టిసారించిన ఆర్టీసీ వినియోగదారుల చెంతకే వస్తువులను డెలివరీ చేయాలని ప్రణాళికలు వేసింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటి నుంచే పికప్ చేసుకోవాలని ఆలోచిస్తున్నది. మొదట హైదరాబాద్‌లో వెయ్యిచోట్ల ఈ సేవలను ప్రారంభించి, వాటి ఫలితాల ఆధారంగా ఇతర ప్రాంతాల్లో ప్రారంభించాలనే యోచనలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గాడిలో పెట్టాలంటే ప్రత్యామ్నాయ ఆదాయమే మార్గమని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో రూపొందించిన ఈ కార్గో సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి.

ఆత్మహత్యల్లో 60% యువతే

- డ్రగ్స్‌తో దారితప్పుతున్న 18-35 ఏండ్ల వయస్కులు
- తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ అధ్యయనం
- కౌన్సెలింగ్ లేకపోవడంతోనే ప్రమాదకర ఆలోచనలు
- ప్రతి పాఠశాలలో సైకాలజిస్టులను నియమించాలని సూచనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో జరుగుతున్న ఆత్మహత్యల్లో 60 శాతంపైగా యువత ఉండటం ఆందోళనకర విషయమని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ వెల్లడించింది. ఇందులో చాలావరకు మాదకద్రవ్యాల బారినపడి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నది. ఈ మేరకు అసోసియేషన్ బృందం 18-35 మధ్య వ్యక్తుల మానసిక పరిస్థితిపై అధ్యయనం చేసినట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. మాదకద్రవ్యాలకు ఆకర్షితులైన వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని వెల్లడించారు. డ్రగ్స్‌కు ముందు, తీసుకున్న తర్వాత వారి శరీరంలో వచ్చిన మార్పులను విశ్లేషించినట్టు వివరించారు. బాధితుల కుటుంబసభ్యుల నుంచి వివరాలు, సైకియాట్రిస్టుల అభిప్రాయాలను సేకరించామని చెప్పారు. డ్రగ్స్ తీసుకొనేవారి కేంద్ర నాడీవ్యవస్థ సరిగా పనిచేయక వారేం చేస్తున్నారో కూడా తెలియని సైకో ప్రపంచంలోకి వెళ్తారని తెలిపారు. డ్రగ్స్ అలవాటు ఉన్న వారిని వెంటనే గుర్తించి సరైన సమయంలో కౌన్సెలింగ్, చికిత్స అందిస్తే మామూలు మనుషులుగా మార్చే అవకాశం ఉన్నదని తెలంగాణ కౌన్సెలింగ్ అసోసియేషన్ పేర్కొన్నది.

ప్రతి పాఠశాలలో సైకాలజిస్టుల సేవలు అవసరం



డ్రగ్స్ భూతం దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నది. తెలంగాణలో ఈ ఏడాది 938 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద 78,331 కేసులు నమోదయ్యాయి. డ్రగ్స్ బాధితులకు కౌన్సెలింగ్ సేవలందించటం ముఖ్యం. ప్రతి పాఠశాలల్లో సైకాలజిస్టులను నియమిస్తే విద్యార్థులు చెడుదారుల్లో నడవకుండా సన్మార్గంలో నడిచేలా ప్రేరణ కల్పిస్తారు. డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మేమూ సిద్ధం. 9533660938 నంబర్‌ను సంప్రదిస్తే కౌన్సెలింగ్ ఇస్తాం.

- డాక్టర్ మోత్కూరి రామచంద్రం, ప్రెసిడెంట్, తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్

లక్షణాలు:

కండ్లు ఎర్రగా మారటం, ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం, నిద్రలేకుండా ఉండటం, చేతులు, కాళ్లలో వణుకు, చెమటలు పట్టడం, పల్స్‌రేట్ పెరగటం, శరీరం పట్ల శ్రద్ధ లేకపోవటం, తరుచూ పనులు వాయిదా వేయటం తదితర లక్షణాలు డ్రగ్స్ అలవాటు పడినవారిలో కనిపిస్తాయని సైకియాట్రిస్టులు చెప్పారు. తల్లిదండ్రులు వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. యాంటి క్రేవింగ్ ట్రీట్‌మెంట్ ఇప్పించడం అతి ముఖ్యమని తెలిపారు.

వైద్యసిబ్బందికి భద్రత పెంచండి

మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో సేవలందిస్తున్న డాక్టర్లు, నర్సులు, వైద్యసిబ్బందికి భద్రత కల్పించాలని సంబంధిత ఉన్నతాధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఆదేశించారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా డాక్టర్లు, నర్సులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. నిందితుడిపై కఠినచర్యలు తీసుకోవాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి కఠిన శిక్షపడేలా చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో భద్రత అంశాలను పొందుపరిచిందని చెప్పారు.



ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాద్రి ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

భద్రాద్రి ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలు

- అడ్డుకున్న ఆలయ ఈవో, సిబ్బందిపై కర్రలతో దాడి
- ఈ భూములన్నీ ఏపీ పరిధిలోనే..
- అక్కడి అధికారులు చెప్పినా ఖాతరుచేయని ఆక్రమణదారులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 16: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన ఆలయ భూముల్లో ఆక్రమణలు ఆగడం లేదు. సరిహద్దున ఆంధ్రాలోని పురుషోత్తపట్నంలో ఉన్న ఆలయ భూముల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను ఆలయ ఈవో, అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. వీరిపై ఆక్రమణదారులు కర్రలతో దాడులు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రామాలయ భూములకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ అక్రమ కట్టడాలను మాత్రం ఆక్రమణదారులు ఆపడంలేదు. 1970 నుంచి 2022 వరకు ఏపీ హైకోర్టుతోపాటు స్థానిక, జిల్లా, ఎండోమెంట్ ట్రైబల్ సెటిల్‌మెంట్ కోర్టులు, తెలంగాణ హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగానే ఉత్తర్వులు ఇచ్చాయని ఆలయ ఈవో తెలిపారు. అయినప్పటికీ ఈ ఆక్రమణలు మాత్రం రోజురోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. గతంలో 250 వరకు, తాజాగా 46 వరకు కేసులు ఆక్రమణదారులపై ఉన్నాయి. కానీ అవేవీ పరిష్కారం కాలేదు. అక్రమ కట్టడాల వల్ల దేవస్థానానికి వచ్చే కూరగాయలు, ఇతరత్రా ఆదాయం కోల్పోవాల్సి వస్తున్నదని ఈవో పేర్కొన్నారు. సదరు భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని రెండు నెలల క్రితమే ఏపీ రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు సూచించారు. అయినప్పటికీ 50 శాతం నిర్మాణాలు పూర్తిచేశారు. తహసీల్దార్ ఆదేశాలను సైతం ఆక్రమణదారులు ఖాతరు చేయడం లేదు. దీంతో ఇటు భద్రాద్రి ఆలయ బాధ్యులు, అటు ఏపీ అధికారులు మండిపడుతున్నారు.

నేడు డాక్టర్ల 'స్టెత్ డౌన్'

- కోల్‌కతా ఘటనకు నిరసనగా నర్సులు సహా సమ్మె
- ఒక్కరోజు విధుల బహిష్కరణకు ఐఎంఏ పిలుపు
- ఇందిరాపార్క్ వద్ద అన్నిసంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- గంటసేపు ఓపీ సేవలకు టీజీజీడీఏ, నర్సులు దూరం
- ఓపీని నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన ప్రైవేట్ దవాఖానలు



నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు వైద్యసేవలను నిలిపివేసి 'స్టెత్ డౌన్' నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద అన్ని వైద్యసంఘాలు కలిసి ధర్నా చేయాలని నిర్ణయించాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఒకరోజు ఓపీ సేవలు నిలిపివేయాలని ఐఎంఏ పిలుపునిచ్చింది. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 వరకు ఓపీకి దూరంగా ఉండాలని కోరింది. ఈ మేరకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఐఎంఏ పిలుపు మేరకు అనేక ప్రైవేట్ దవాఖానలు శనివారం ఓపీని నిలిపివేస్తున్నట్టు ప్రకటించాయి. ఐఎంఏ, జూనియర్ డాక్టర్ల సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) తెలిపింది. ప్రభుత్వ వైద్యులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని విజ్ఞప్తిచేసింది. ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేద రోగులకు ఇబ్బందులు కలగకుండా ఉదయం 9 నుంచి 10 వరకు గంటపాటు ఓపీ సేవలు నిలిపివేయాలని పిలుపునిచ్చింది. జూనియర్ డాక్టర్లు సమ్మెలో ఉన్న కారణంగా అవసరమైతే గంట ఎక్కువగా పనిచేసి ఓపీ సేవలకు ఆటంకం కలుగకుండా చూడాలని కోరింది. కోల్‌కతా ఘటన వెనుక ఉన్న కుట్రకోణాన్ని వెలికితీసి, దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టీపీహెచ్‌డీఏ) డిమాండ్ చేసింది. శనివారం వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా వైద్యులు, వైద్యసిబ్బందికి పటిష్ఠమైన భద్రత కల్పించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు శనివారం జరిగే ధర్నాలో పాల్గొననున్నట్టు వెల్లడించింది. ధర్నాలో పాల్గొంటామని తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఒకరోజు సమ్మెకు మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ తెలిపింది. సీపీఐ కూడా మద్దతు పలికింది.

నర్సులపై దాడులకు నిరసన

కోల్‌కతాలో ఘటనతోపాటు రాష్ట్రంలోని షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై దాడి, ఉత్తరాఖండ్‌లో ఓ నర్సుపై హత్యాచార ఘటనపై తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ (టీఎన్ఏ) తీవ్రంగా స్పందించింది. శనివారం ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని కోరింది. పేద రోగులకు ఇబ్బందులు కలగకుండా 9 నుంచి గంటసేపు నిరసన ప్రదర్శన చేయాలని తెలిపింది.



ఢిల్లీలో ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

త్వరలో హైదరాబాద్‌ను సందర్శిస్తా

సీఎంకు ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ హామీ

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): త్వరలోనే హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ పరికరాల దిగ్గజం ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ హామీ ఇచ్చారు. శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేందుకు ఫ్యూచర్ సిటీ పేరిట ఫోర్త్ సిటీకి రూపకల్పన చేస్తున్నామని సీఎం వివరించారు. విద్య, వైద్యం, క్రీడలు, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి బహుముఖ అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఫోర్త్‌సిటీలో ఫాక్స్‌కాన్ సంస్థ పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. అనుమతులతో పాటు అవసరమైన మద్దతు అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యాంగ్ లియూ మాట్లాడుతూ.. ఫోర్త్‌సిటీ ప్రతిపాదన బాగున్నదని, త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తానని చెప్పారు. ముందుగా చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, భారతదేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయేశ్‌రంజన్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీ2పీ లెండింగ్ కఠినం

- నిబంధనల్ని సవరించిన ఆర్బీఐ

ముంబై, ఆగస్టు 16: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ-పీర్ టు పీర్ లెండింగ్ ప్లాట్‌ఫామ్స్ (ఎన్‌బీఎఫ్‌సీ-పీ2పీ రుణ వేదికలు)ల్లో పారదర్శకతను పెంచడం కోసం ఆర్బీఐ శుక్రవారం నిబంధనల్ని కఠినతరం చేసింది. సవరించిన మాస్టర్ డైరెక్షన్ ప్రకారం పీర్ టు పీర్ లెండింగ్‌ను టెన్యూర్ లింక్డ్ అష్యూర్డ్ మినిమం రిటర్న్స్, లిక్విడిటీ ఆప్షన్స్ వంటి ఫీచర్లతో ఓ పెట్టుబడి ప్రాడక్ట్‌గా పీ2పీ ప్లాట్‌ఫామ్స్ చూపకూడదు. అలాగే రుణ పెంపు, రుణ భరోసాలకు వీలున్న ఏదైనా ఇన్సూరెన్స్ ప్రాడక్ట్ క్రాస్-సెల్లింగ్‌కూ వీల్లేదు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలనూ మంజూరు చేయకూడదు. ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆర్బీఐ స్పష్టం చేసింది. కొన్ని సంస్థలు నిబంధనలను ఉల్లంఘిస్తున్న నేపథ్యంలోనే ఈ సవరణలు చేసింది.

అరబిందో ఫార్మాకు యూఎస్ఎఫ్‌డీఏ షాక్


హైదరాబాద్, ఆగస్టు 16: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మాకు అమెరికా నియంత్రణ మండలి షాకిచ్చింది. అరబిందోకు చెందిన సబ్సిడరీ సంస్థయైన యుగియా ఫార్మా స్పెషలిస్ట్ లిమిటెడ్‌కు రాష్ట్రంలోవున్న యూనిట్‌కు అధికారిక చర్యను కొనసాగిస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి హెచ్చరిక లేఖ జారీ చేసినట్లు అరబిందో ఫార్మా బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ హెచ్చరిక లేఖ ఎందుకు జారీ చేసింది మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ లేఖతో అమెరికా మార్కెట్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపదని పేర్కొంది. హైదరాబాద్‌కు సమీపంలోని పాశమైలారం వద్ద ఉన్న యూనిట్‌ను జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు యూఎస్ఎఫ్‌డీఏ ఉన్నతాధికారులు తనిఖీ చేశారు.

భద్రతా దళాలకు ఎల్ఐసీ హౌజింగ్ ఆఫర్

ముంబై, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశీయ భద్రత దళాలకు ఎల్ఐసీ హౌజింగ్.. గృహ రక్షక్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.2 కోట్ల లోపు గృహ రుణం తీసుకునేవారికి 8.40 శాతం వడ్డీకే రుణాలు అందిస్తున్నది. సిబిల్ స్కోర్ 750కి పైగా ఉన్నవారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. ప్రాసెసింగ్ ఫీజును పూర్తిగా ఎత్తివేసిన బ్యాంక్..ఈ ప్రత్యేక స్కీం సెప్టెంబర్ చివరి వరకు అందుబాటులో ఉండనున్నదని పేర్కొంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కోస్ట్ గార్డ్ విభాగాల్లో పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన భద్రత దళాలు అర్హులని తెలిపింది.

వాణిజ్య

జోరుగా వడ్డింపులు



- రుణాలపై పెరుగుతూపోతున్న వడ్డీరేట్లు
- ఈ నెలలో ఎంసీఎల్ఆర్‌ను సవరించిన 8 బ్యాంకులు
- గృహ, ఆటో, వ్యక్తిగతసహా అన్ని లోన్లు ప్రియం
- రుణగ్రహీతలకు భారంగా మారుతున్న ఈఎంఐలు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: బ్యాంకులు వరుస పెట్టి వడ్డీరేట్లను పెంచేస్తున్నాయి. ఈ నెల మొదలు ఇప్పటిదాకా ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి చెందిన 8 బ్యాంకులు తమ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 నుంచి 10 బేసిస్ పాయింట్ల మేర పెంచేశాయి. వీటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), కెనరా, యూకో, ఐడీబీఐ, యెస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లున్నాయి. ఓవర్‌నైట్, నెల, త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక కాలపరిమితి ఎంసీఎల్ఆర్‌లను ఇవి సవరించాయి. కొన్నైతే రెండేండ్లు, మూడేండ్ల ఎంసీఎల్ఆర్‌లనూ పెంచాయి. ఇలా వడ్డీరేట్లను పెంచడం ఎస్బీఐకి వరుసగా ఇది మూడో నెల కావడం గమనార్హం. కాగా, గృహ, వాహన, వ్యక్తిగత తదితర అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్ల నిర్ణయానికి ఎంసీఎల్ఆరే బ్యాంకులకు ప్రామాణికం. దీన్ని పెంచిన ప్రతిసారీ రుణగ్రహీతలు తమ నెలవారీ కిస్తీ (ఈఎంఐ)లను ఇంకా ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నది. లేదంటే రుణ కాలపరిమితైనా (టెన్యూర్) పెరుగుతున్నది. నిజానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను ఏడాదిన్నరగా యథాతథంగానే ఉంచుతున్నది. ప్రస్తుతం రెపో రేటు 6.50 శాతం వద్ద ఉన్నది. ద్రవ్యోల్బణం అదుపు సాకుతో వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ద్వైమాసిక ద్రవ్య సమీక్షల్ని సెంట్రల్ బ్యాంక్ ముగించేస్తున్నది. అయినప్పటికీ బ్యాంకులు మాత్రం రుణాలపై వడ్డీరేట్లను పెంచుతూనే ఉన్నాయి. దీంతో అటు వ్యాపార, పారిశ్రామిక రంగాలపై.. ఇటు రుణగ్రహీతలపై మోయలేనంత భారం పడుతున్నది. ప్రధానంగా రుణ లభ్యత ఖరీదై ఆటో, నిర్మాణ, దాని అనుబంధ రంగాలు దెబ్బ తింటున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నెల 1 నుంచీ..

ఈ నెల 1న పీఎన్‌బీ, యెస్ బ్యాంక్‌లు తమ ఎంసీఎల్ఆర్‌లను పెంచాయి. అన్ని కాలపరిమితులపై 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్టు పీఎన్‌బీ ప్రకటించింది. ఇందులో కనిష్ఠం 8.30 శాతం, గరిష్ఠం 9.20 శాతంగా ఉన్నది. మార్పులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయా బ్యాంకులు పేర్కొన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ ఆగస్టు 8న కొత్త ఎంసీఎల్ఆర్‌లను అమల్లోకి తెచ్చింది. 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ఈ బ్యాంక్‌లో కనిష్ఠ ఎంసీఎల్ఆర్ 9.10 శాతం, గరిష్ఠం 9.45 శాతం. అలాగే ఈనెల 10న యూకో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ పెరిగింది. ఆయా టెన్యూర్స్‌పై 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.20 శాతంగా, ఏడాదిది 8.95 శాతంగా ఉన్నది. బీవోబీ, కెనరా బ్యాంక్‌లు సైతం అన్ని టెన్యూర్స్ ఎంసీఎల్ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లదాకా పెంచాయి. ఆగస్టు 12 నుంచే కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. బీవోబీ ఎంసీఎల్ఆర్ కనిష్ఠం 8.15 శాతంగా ఉన్నది. కెనరా బ్యాంక్‌లో కనిష్ఠం 8.25 శాతం, గరిష్ఠం 9.40 శాతం. ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ కూడా ఈ నెల 12 నుంచే పెరిగింది. కనిష్ఠం 8.40 శాతంగా, గరిష్ఠం 10.10 శాతంగా ఉన్నది. ఇక ఈ నెల 15న దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ఎంసీఎల్ఆర్ 10 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఓవర్‌నైట్ నుంచి మూడేండ్లదాకా ఉన్న అన్ని కాలపరిమితులకూ ఈ పెంపు వర్తించింది. కనిష్ఠ ఎంసీఎల్ఆర్ 8.20 శాతంగా ఉంటే, గరిష్ఠం 9.10 శాతంగా ఉన్నది.

ఈ నెల మొదలు ఆయా బ్యాంకుల్లో మారిన ఎంసీఎల్ఆర్ (శాతాల్లో)

కాలపరిమితి	ఎస్బీఐ	బీవోబీ	హెచ్‌డీఎఫ్‌సీ	యెస్	కెనరా	పీఎన్‌బీ	యూకో	ఐడీబీఐ
ఓవర్‌నైట్	8.20	8.15	9.10	9.10	8.25	8.30	8.20	8.40
నెల	8.45	8.35	9.15	9.45	8.35	8.35	8.35	8.55
3 నెలలు	8.50	8.50	9.25	10.10	8.45	8.55	8.50	8.85
6 నెలలు	8.85	8.75	9.40	10.35	8.80	8.75	8.80	9.10
ఏడాది	8.95	8.95	9.45	10.50	9.00	8.90	8.95	9.15
రెండేండ్లు	9.05	—-	9.45	—-	9.30	—-	—-	9.70
మూడేండ్లు	9.10	—-	9.45	—-	9.40	9.20	—-	10.10

ద్రవ్యోల్బణం తగ్గితే..

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇటీవలి గణాంకాల్లో జూలై నెలకుగానూ టోకు, చిల్లర ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు, సెప్టెంబర్‌లోనూ ఇదే ట్రెండ్ కొనసాగితే అక్టోబర్ ద్రవ్య సమీక్షలో వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ తగ్గిస్తుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటిదాకా వ్యాపార, పారిశ్రామిక రంగాల నుంచి ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా ద్రవ్యోల్బణం కట్టడికే కట్టుబడి ఉన్న ఆర్బీఐ.. నిరుడు ఏప్రిల్ నుంచి రెపో రేటును తగ్గించనేలేదు. అయితే గత నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఐదేండ్ల కనిష్టాన్ని తాకుతూ 3.54 శాతానికి దిగొచ్చింది. ఇదే సమయంలో హోల్‌సేల్ ద్రవ్యోల్బణం కూడా 3 నెలల కనిష్టాన్ని సూచిస్తూ 2.04 శాతంగా నమోదైంది. దీంతో మున్ముందు ఇవి మరింత తగ్గితే రాబోయే ద్రవ్య సమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లకు కోత పెట్టడం ఖాయమన్న అభిప్రాయాలున్నాయి.

ఫారెక్స్ రిజర్వులు డౌన్

ముంబై, ఆగస్టు 16: రికార్డు స్థాయికి చేరుకున్న విదేశీ మారకం నిల్వలు భారీగా పతనం చెందాయి. ఈ నెల 9తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 4.8 బిలియన్ డాలర్లు తగ్గి 670.119 బిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 7.533 బిలియన్ డాలర్లు పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయి 674.919 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడం ఇందుకు కారణమని తెలిపింది. అలాగే గోల్డ్ రిజర్వులు కూడా 860 మిలియన్ డాలర్లు తగ్గి 59.239 బిలియన్ డాలర్లకు తగ్గినప్పటికీ, ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 121 మిలియన్ డాలర్లు పెరిగి 18.282 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు తెలిపింది.

7 లక్షల కోట్లు పెరిగిన సంపద

సెన్సెక్స్ 1,330, నిఫ్టీ 397 పాయింట్ల లాభం

ముంబై, ఆగస్టు 16: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు పోటెత్తాయి. ఒక దశలో 1,400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 1,330.96 పాయిం ట్లు లేదా 1.68 శాతం లాభపడి 80,436.84 వద్ద ముగిసింది. గడిచిన రెండు నెలల్లో ఒక్కరోజు ఈ స్థాయిలో లాభపడటం ఇదే తొలిసారి. మరో సూచీ నిఫ్టీ సైతం 397.40 పాయింట్లు లేదా 1.65 శాతం అందుకొని 24,531.15 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగరడంతో మదుపరుల సంపద దూసుకుపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.7,30,389.86 కోట్లు పెరిగి రూ.4,51,59,833.55 కోట్లు (5.38 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది.

బ్యాంకింగ్, ఐటీ షేర్లలో జోష్

ఐటీ రంగ షేర్లతోపాటు బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 2.17 శాతం లాభపడింది. దీంతోపాటు ఇండస్ఇండ్ బ్యాంక్, కెనరా బ్యాంక్, కొటక్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ



బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ, యెస్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. వీటితోపాటు టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్‌లు అత్యధికంగా లాభపడిన షేర్లలో ఉన్నాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ ఇండెక్స్ అత్యధికంగా 2.72 శాతం లాభపడగా, రియల్టీ 2.45 శాతం, టెక్ 2.23 శాతం, ఆటో 1.90 శాతం, కమోడటీస్ 1.89 శాతం, పవర్ 1.80 శాతం, ఆర్థిక సేవలు 1.77 శాతం పెరిగాయి.

పుంజుకోవడానికి కారణాలు

- ఆర్థిక మాంద్యం భయాలు చుట్టుముట్టిన అమెరికా ఆర్థిక వ్యవస్థ తిరిగి కోలుకుంటుండటం.
- వచ్చే నెల సమీక్షలోనే అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరుల్లో జోష్ పెంచింది.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నిర్భయ రాజ్యం సాధించారా?

పశ్చిమ బెంగాల్‌లో ఒక డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరగడంతో ఆందోళనతో ఆ రాష్ట్రం అట్టుడుకుతున్నది. వైద్య విద్యార్థులు ప్రారంభించిన ఆందోళన కాస్త బీజేపీ శ్రేణుల రంగప్రవేశంతో రాజకీయ ఉద్యమంగా మారిపోయింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగంలో పరోక్షంగా బెంగాల్ అత్యాచార ఘటనను ప్రస్తావించారు. దేశంలో మహిళలపై జరుగుతున్న లైంగికదాడుల పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమపై లైంగికదాడులు జరుగుతున్నాయని అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన, ఒలింపిక్స్‌లో సత్తాచాటిన మన క్రీడాకారిణులు ఢిల్లీలో నడిరోడ్డుపైకి వచ్చి నెలల తరబడి ఆందోళన చేసినా చలించని ప్రధాని నరేంద్ర మోదీ.. పశ్చిమబెంగాల్ ఘటనపై స్పందించడం గమనార్హం.



బుద్దా మురళి

సొంత పార్టీ బీజేపీ ఎంపీ సాగించిన అకృత్యాలను మహిళా క్రీడాకారిణులు బయటపెట్టినప్పుడు ప్రధాని అసలు స్పందించకపోవడం ఏ రకంగా రాజధర్మం అవుతుందో? మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి రోడ్డు మీద ఊరేగించడం దేశ గౌరవాన్ని పెంచడం అవుతుందా? మన దేశమే కాదు, అనేక దేశాలు స్పందించినా ప్రధాని మాత్రం మౌనంగానే ఉన్నారు. ఈశాన్య రాష్ర్టాల ప్రజలను దేశంలోని చాలామంది 'చైనీయులు' అని అనుకుంటారు. అక్కడివారు సైతం తాము భారతీయులం కాదన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. దేశం నివ్వెరపోయే విధంగా మణిపూర్‌లో అత్యాచారాలు జరిగినా, హింసాకాండలో వందలాది మంది మరణించినా ప్రధాని మౌనంగా ఉండటమంటే.. 'మేం ఈ దేశం వాళ్లం కాదు' అనే అభిప్రాయాన్ని వారిలో మరింత బలంగా నాటుకుపోయేలా చేయడమే. ఇలాంటి సందర్భంలోనే యావత్ దేశం వారికి అండగా ఉందని చెప్పడం ద్వారా వారికి మరింత దగ్గరయ్యే అవకాశం ఉంది. కానీ, మతం, కులం ఆధారంగా ఓట్ల లెక్కలు చూసుకొని పాలకులు స్పందిస్తున్నారు. నిర్భయ ఘటన గుర్తుందా? 2012 డిసెంబర్ 16న ఢిల్లీలో ఒక బస్సులో వైద్య విద్యార్థినిని ఆరుగురు ఇనుప కడ్డీతో దారుణంగా కొట్టి అత్యాచారం చేశారు. 13 రోజుల చికిత్స తర్వాత ఆమె మరణించారు. ఈ ఘటనను నిరసిస్తూ దేశ ప్రజలంతా స్వచ్ఛందంగా ఉద్యమించారు. తర్వాత ఈ ఉద్యమంలోకి బీజేపీ అనుబంధ సంస్థలు ప్రవేశించాయి. 2012లో జరిగిన ఈ ఉద్యమంతో పాటు అన్నా హజారే జరిపిన అవినీతి వ్యతిరేక ఉద్యమం ఢిల్లీలో కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేశాయి. ఈ ఉద్యమాల కారణంగానే బీజేపీ అధికారంలోకి వచ్చింది. మోదీ ప్రధాని అయ్యారు. కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవడంతో ఢిల్లీ పీఠంపై కేజ్రీవాల్ పాగా వేశారు.



ఢిల్లీ నిర్భయ ఉదంతంపై దేశవ్యాప్తంగా ఉద్యమించి అధికారంలోకి వచ్చిన బీజేపీ అత్యాచారాల నివారణకు ఏమైనా చర్యలు తీసుకుందా? అంటే అలాంటిదేమీ లేదనే సమాధానమే వినిపిస్తుంది. గతంలో కంటే ప్రస్తుతం అత్యాచారాలు మరింతగా పెరిగిపోయాయని స్వయంగా ప్రధాని మోదీ తన ఉపన్యాసంలోనే చెప్పుకొచ్చారు. ప్రధాని చెప్పినట్టుగానే 2012 ఢిల్లీ ఉదంతం తర్వాత అత్యాచారాలు పెరిగాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలు కూడా సూచిస్తున్నాయి. 2021 వార్షిక నివేదికలో 31,677 కేసులు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 86 అత్యాచారాలు జరిగాయి. 2020లో 28,046, 2019లో 32,033 కేసులు నమోదయ్యాయి.

రోజూ జరుగుతున్న వందల అత్యాచార ఘటనల్లో బెంగాల్ ఒకటి. దేశవ్యాప్తంగా ఎన్నో ఘోరాలు జరుగుతున్నా స్పందించని మోదీ దీనిపై స్పందిస్తారు. ఆ రాష్ట్ర గవర్నర్ హుటాహుటిన అత్యాచారం జరిగిన మెడికల్ కాలేజీకి వెళ్తారు. బీజేపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడుతుంది. అత్యాచారాలకు వ్యతిరేకంగా వారిలో ఈ స్పందన కనిపిస్తే అభినందించాలి. కానీ, సమస్యపై సానుభూతి కన్నా రాజకీయ ఆయుధం దొరికిందనే ఉత్సాహమే వారిలో కనిపిస్తున్నది. నిర్భయ ఉదంతం ద్వారా దేశంలో బీజేపీకి రాజకీయంగా ఎంతో కలిసొచ్చిందనేది వాస్తవం. ఇప్పుడు కూడా తన రాజకీయ ప్రత్యర్థి అధికారంలో ఉన్న బెంగాల్‌లో జరిగిన ఘటనను బీజేపీ ఆ కోణంలో నుంచే చూస్తున్నది. నిర్భయ ఉదంతంపై జరిగిన ఉద్యమమే బీజేపీ అధికారం చేపట్టడానికి సహకరించింది. కనీసం అందుకు కృతజ్ఞతగానైనా అత్యాచారాల నివారణకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించాల్సింది. పదేండ్ల పాలన తర్వాత కూడా అత్యాచారాల గురించి ప్రధాని ఆవేదన చెందుతున్నారంటే మరి ఈ పదేండ్లు ఆయన ఏం చేసినట్టు?

తన రాజకీయ ప్రత్యర్థి అధికారంలో ఉన్న బెంగాల్‌లో జరిగిన ఘటనను బీజేపీ ఆ కోణంలో నుంచే చూస్తున్నది. నిర్భయ ఉదంతంపై జరిగిన ఉద్యమమే బీజేపీ అధికారం చేపట్టడానికి సహకరించింది. కనీసం అందుకు కృతజ్ఞతగానైనా అత్యాచారాల నివారణకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించాల్సింది. పదేండ్ల పాలన తర్వాత కూడా అత్యాచారాల గురించి ప్రధాని ఆవేదన చెందుతున్నారంటే మరి ఈ పదేండ్లు ఆయన ఏం చేసినట్టు?

ఉమ్మడి రాష్ట్రంలో ఆయేషా మీరాపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను రాజకీయం లబ్ధి కోసం వాడుకున్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం అప్పటి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆయేషా మీరా తల్లితో తెలంగాణలోని పలు నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రచారం చేయించారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ ఆ తల్లి టీడీపీ తరపున ప్రచారం చేశారు.

తెలంగాణలో ఉప ఎన్నికలకు, ఆయేషా మీరా తల్లికి సంబంధం ఏమిటని చంద్రబాబుపై అప్పటి సీఎం వైఎస్ మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం ఏమిటని అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబును కడిగిపారేశారు. అత్యాచారాల ఘటనలను సైతం రాజకీయ పక్షాలు ఎలా వాడుకుంటాయో చెప్పడానికి ఈ ఉదంతం ఒక మచ్చుతునక.

రాష్ర్టాల్లో సైతం మహిళలకు సంబంధించిన అంశాలను చాలామంది రాజకీయ నాయకులు ఆయుధాలుగానే చూస్తున్నారు. అసలు మహిళల సమస్యలను తీర్చాలనే చిత్తశుద్ధి వారిలో లేనే లేదు. మహిళా కమిషన్లు ఒక రాజకీయ పార్టీ మరో రాజకీయ పార్టీపై చేసే విమర్శలపై అత్యుత్సాహం చూపించడానికి బదులు మహిళల కోసం ఏమైనా సూచనలు చేయగలమా? అనే కోణంలో ఆలోచించాలి. పార్టీ కోసం ఆలోచించేవారు పార్టీల్లో లక్షలాది మంది ఉంటారు. లక్షల్లో వీరూ ఒకరిగా ఉండాల్సిన అవసరంలేదు. మహిళలపై జరిగే అత్యాచారాల నివారణకు ఏమైనా చేయగలమా? అని ఆలోచించాలి.

రుణమాఫీపై క్షమాపణ చెప్పాలె

అబద్ధపు హామీలు, జూటా మాటలతో రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి దగా చేసింది. పంద్రాగస్టు నాటికి రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుమారు 11 లక్షల మంది రైతుల నోట్లో మట్టికొట్టారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ఊరికెళ్తే ఆ ఊర్లోని దేవుడి మీద ఒట్టేసి 'రుణమాఫీ చేస్తా'నని చెప్పిన సీఎం రేవంత్ ఆఖరికి దేవుళ్లను సైతం మోసం చేశారు. ఒకేసారి రుణమాఫీ అని కోట్లు ఖర్చుచేసి పత్రికలకు ప్రకటనలు ఇచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూడు దఫాల్లోనైనా ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో రైతు రుణమాఫీని పూర్తి చేయలేకపోయింది. మూడో దఫాలోనైనా తమ రుణం మాఫీ అవుతుందని ఆశగా ఎదురుచూసిన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. రుణమాఫీ తీసుకున్న రైతుల్లో దాదాపు 35 శాతం మందికి ఇంకా రుణమాఫీ కాకపోవడం శోచనీయం. ఇదిలా ఉంటే రుణమాఫీ ప్రక్రియ మొత్తం పూర్తయిందంటూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిస్సిగ్గుగా ప్రకటించుకోవడం వారి మోసపూరిత విధానానికి, దగాకోరుతనానికి నిదర్శనం.



డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9 కూడా వచ్చిపోయింది. కానీ, రైతు రుణమాఫీ మాత్రం కాలేదు. పైగా రోజులు గడిచేకొద్దీ ఆ తేదీ మారుతూ వచ్చింది. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న రైతు రుణమాఫీ, 6 గ్యారంటీల హామీలను చూసే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారనే విషయం తెలియనిది కాదు. కానీ, రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ సర్కార్ మాత్రం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తూ వస్తున్నది. డిసెంబర్ 9నే రైతు రుణమాఫీ అవుతుందని ఎదురుచూసిన రైతులు దానికోసం సుమారు 8 నెలలు ఆగాల్సి వచ్చింది. ఆలస్యమైనా ఫర్వాలేదు, రుణమాఫీ అయితే చాలని భావించిన రైతులు ఇప్పుడు నెత్తీనోరు బాదుకుంటున్నారు. రుణమాఫీకి నోచుకోని 11 లక్షల మంది రైతులు తల్లడిల్లుతున్నారు.



అయితే, 'మార్పు' పేరిట ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాయమాటలతో మరోసారి గారడి చేస్తున్నారు. రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్‌ఎస్ నాయకులపై అవాకులు, చెవాకులు పేలుతున్నారు. బ్యాంకు రుణం మాఫీ కాని సుమారు 11 లక్షల మంది రైతులు 'రుణమాఫీ'పై ఇక ఆశలు వదులుకోవాల్సిందేనని కాంగ్రెస్ నాయకుల మాయమాటలు చెప్పకనే చెప్తున్నాయి. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న మరో మోసం ఏమంటే.. ఆరు గ్యారంటీల అంశాన్ని పక్కదారి పట్టించడం. అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ పార్టీ 'మహిళలకు ఉచిత బస్సు' పథకాన్ని ప్రారంభించింది. అరకొర వసతుల మధ్య సాగుతున్న ఈ పథకం మహిళలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నది. బస్సుల కొరత, సమయానికి రాని బస్సులే అందుకు కారణం. ప్రయాణికులకు సరిపడా బస్సులను పెంచాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం 'పల్లె వెలుగు' బస్సులకే 'డీలక్స్ బోర్డు'లు పెట్టి రాష్ట్రంలో తిప్పుతున్నది. డీలక్స్ బస్సుల్లో మహిళలకు ఆధార్ కార్డు మీద జీరో టికెట్లు జారీ చేయకపోవడంతో మహిళలు అటు గమ్యాన్ని చేరుకోలేక, ఇటు ఇంటికి చేరుకోలేక రోడ్లపైనే నానా అవస్థలు పడుతున్నారు. అయితే, ఈ 'ఉచిత బస్సు' పథకాన్ని గొప్పగా ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ నాయకులు సుమారు 8 నెలల పాటు కాలాన్ని వెళ్లదీశారు. ఇన్నాళ్లకు కాంగ్రెస్ నేతలకు మరికొంత కాలం పాటు కాలాన్ని వెళ్లదీసే అవకాశం మళ్లీ 'రుణమాఫీ' పథకంతో లభించింది.

అవును మరి, మొదటి దఫా రుణమాఫీ చేయకముందే 'ఒకేసారి రుణమాఫీ చేస్తున్నాం' అని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకున్న కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు అంతకుమించిన ప్రచారాన్ని చేసుకోదనే గ్యారంటీ ఏమున్నది? అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాని ఒక ముఖ్య విషయాన్ని గుర్తుంచుకోవాలి. అదేమిటంటే.. ఎన్నికలకు ముందు మీ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం మొత్తం 32.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామన్న మీరు 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారు. పూర్తిస్థాయిలో, ఇంకా సుమారు 11 లక్షల మందికి రుణమాఫీ చేయడంలో మీరు విఫలమయ్యారు. అందుకే 'రుణమాఫీ చేయడంలో మా ప్రభుత్వం విఫలమైంద'ని ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పితీరాలి. అంతేకాదు, ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలుచేస్తామని ప్రగల్భాలు పలికిన మీరు అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైంది. అయినా ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు. కాబట్టి ఆరు గ్యారంటీల అమలుపై దృష్టిసారించాలి.

అయితే ఇక్కడ ఇంకో విషయం ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఊరూరు తిరిగిన రేవంత్‌రెడ్డి 'మేం అధికారంలోకి వస్తే... డిసెంబర్ 9న రూ.40 వేల కోట్లు రుణమాఫీ చేస్తా'మని చెప్పిన మాట అందరికీ తెలియనిది కాదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఒక దశలో రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నట్టు మాట మార్చారు. ఆపై 2024-25 బడ్జెట్‌లో రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లను మాత్రమే కేటాయించారు. తీరా అసలు సమయానికి రూ.17,869 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఏ విధంగా మోసం చేసుకుంటూ, ఏమార్చుకుంటూ వచ్చారో దీన్నిబట్టి స్పష్టంగా అర్థమవుతున్నది.

కాంగ్రెస్ నాయకులకు అంతిమంగా చెప్పేదేమంటే.. ఇకనైనా మీ మాటల గారడికి చరమగీతం పాడండి. అభివృద్ధి పథంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణను ఆగం చేయకండి. రాష్ట్ర ప్రగతికి అడ్డుపడకండి. 'లేదు, మేమింతే! తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా మారుస్తా'మంటే మాత్రం ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ, తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు.

(వ్యాసకర్త: తెలంగాణ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్)

పౌర, లౌకిక దేశం కావాలె!



గత 75 ఏండ్లుగా మనం మతపరమైన పౌరస్మృతితో జీవిస్తున్నామని, అది వివక్షను ప్రోత్సహిస్తున్నదని, అందువల్ల మన దేశంలో లౌకిక పౌరస్మృతి అవసరమని స్వాతంత్య్ర దినోత్సవ ఉపన్యాసంలో ప్రధాని మోదీ చెప్పారు. అయితే నేను చెప్పేదేమిటంటే.. పౌర, లౌకిక దేశం కావాలి. గత పదేండ్లుగా బీజేపీ సర్కార్ అటు లౌకిక ప్రభుత్వంగా గాని, ఇటు పౌర ప్రభుత్వంగా గాని వ్యవహరించడం లేదు.

- కపిల్ సిబల్, రాజ్యసభ సభ్యుడు

హామీలు గమ్యం అభివృద్ధి గాయం



హామీలు గమ్యం
అభివృద్ధి గాయం
నలిగిపోతున్న తెలంగాణకు
నాయకుడు కావాలి
సంక్షేమ పథకాలు సావు వార్త
మరణించిన సంక్షేమానికి
ప్రాణం పోసే ప్రజా నాయకుడు
కావాలి
నీళ్ల కోసం నిధుల కోసం
నియామకాల కోసం
తెలంగాణ స్వరాష్ట్ర
వనరుల కోసం
భగ్గుమన్న తెలంగాణ భూగోళం
నిధులు నియామకాలు నీళ్లు
అధికారం అంతా డొల్ల
ప్రగతి పడకేసింది
బాధపడుతున్న జనానికి
బతుకునిచ్చే ప్రజాప్రతినిధి కావాలి
రాష్ర్టాన్ని కాపాడే రక్షకుడు కావాలి



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవుల్లారా అయిదా రేడుల పాపల్లారా! మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే అవి మీకే అని ఆనందించే కూనల్లారా! మీదే, మీదే సమస్త విశ్వం! మీరే లోకపు భాగ్యవిధాతలు! ఉడుతల్లారా! బుడుతల్లారా! ఇది నా గీతం వింటారా?' అంటూ కల్మషమెరుగని బాల్యానికి అక్షరాల ఆకారం ఇచ్చాడు మహాకవి శ్రీశ్రీ. ప్రతీ మనిషి జీవితంలో రంగుల కలబోత బాల్యమే. మలినం లేని చలనం వారి సొంతం. బుడి బుడి అడుగులు, బోసి నవ్వులు ఎంతటి పాషాణ హృదయులనైనా ఇట్టే కరిగిస్తాయి.



రెక్కలు తెగిన బాల్యం



డాక్టర్ మహ్మద్ హసన్
99080 59234

ఈ మధ్య వచ్చిన రెండు పాన్ ఇండియా సినిమాలను (యానిమల్, సలార్) కూడా బాల్యం నేపథ్యంలోనే చిత్రీకరించారు. తండ్రిని అమితంగా ఇష్టపడే కుర్రాడిని.. వ్యాపార పనుల్లో పడి ఆ తండ్రి అశ్రద్ధ చేస్తాడు. కాలక్రమంలో తండ్రి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మిస్తాడు, బాలుడూ (హీరో) పెద్దవాడవుతాడు. తండ్రి ఎదుగుదలను తట్టుకోలేని వారి బంధువులు అతడిని చంపాలని చూస్తారు. ఈ విషయాలన్నీ హీరోకి తెలుస్తాయి. తండ్రిని కాపాడేందుకు శత్రువులను ఒక్కొక్కరినీ చంపుతూ చివరికి హీరో ఉన్మాదిలా మారతాడు. కుమారుడు తన కోసమే జంతువు (యానిమల్)లా మారాడని ఆ తండ్రి గ్రహిస్తాడు. ఇక మరో సినిమా సలార్ కూడా ఈ కోవకు చెందినదే.

ప్రపంచవ్యాప్తంగా చిన్నపిల్లలపై ప్రస్తుతం జరుగుతున్న కొన్ని దారుణాలు చూద్దాం. 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసింది. ఫలితంగా ఇరుదేశాల మధ్య యుద్ధం మొదలైంది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ ఆ దేశానికి అండగా ఉంటున్నట్టు అగ్రరాజ్యం అమెరికా కపట నాటకం ప్రదర్శిస్తూ వస్తున్నది. ఒకవైపు శాంతిమంత్రం జపిస్తూనే మరోవైపు యుద్ధాన్ని ప్రోత్సహించడంతో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వేలాదిమంది మరణించిన విషయం మనకు తెలిసిందే. ఇక ఉక్రెయిన్‌లోని ప్రధాన నగరాలు ధ్వంసమైపోయాయి. లక్షల మంది చిన్నారులు పొరుగు దేశాల్లో వలసపక్షుల్లా జీవించాల్సిన దుస్థితి. ఈ క్రమంలో యుద్ధం చేస్తున్న రెండు దేశాలు, యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తున్న అమెరికా, యూరోపియన్ దేశాలు చిన్నారుల భవిష్యత్తు గురించి ఆలోచించకపోవటం బాధాకరం. మరోపక్క ఇజ్రాయెల్-గాజా మధ్య జరుగుతున్న యుద్ధం చిలికి చిలికి గాలివానలా మారింది. అక్కడ జరుగుతున్న నరమేధం అంతాఇంతా కాదు. పది నెలల్లోనే 40 వేలమందికి పైగా మరణించారు. వారిలో మూడొంతులకు పైగా చిన్నారులే ఉండటం గమనార్హం. యుద్ధాల వల్ల ఎక్కువగా నష్టపోయేది ఎవరనేది దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఆహారం దొరక్క గాజాలోని పిల్లలు గడ్డి, మన్ను తింటుండటం మానవజాతికే సిగ్గుచేటు. ఈ నరమేధాన్ని ప్రపంచ దేశాలు ఆపకపోవడం, ఐరాస కూడా చేష్టలుడిగి చేతులెత్తేయడంతో గాజా మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

కక్షతో సాధించలేనిదాన్ని క్షమాభిక్షతో సాధించాలని, కత్తితో ఛేదించలేనిదాన్ని కరుణతో ఛేదించాలని పెద్దలు అంటారు. రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, నైజీరియా, జర్మనీ, లిబియా.. ఇలా ఏ దేశమైనా సరే పిల్లలే ఉంటారు. పిల్లలు లేని ప్రపంచాన్ని ఊహించగలమా?

పిల్లల రంగురంగుల ప్రపంచాన్ని, స్వేచ్ఛగా ఎగరాల్సిన వారి బాల్యాన్ని మనమే చిదిమేస్తున్నాం. రెక్కలు తెంచేస్తే వారు ఎలా ఎగరగలుగుతారు? యుద్ధాలు, హింసాత్మక ఘటనల ద్వారా బాల్యాన్ని అణచివేస్తే, చిదిమివేస్తే వారి బాల్యం తాలూకు జ్ఞాపకాలు వారిని ఎటువైపు నడిపిస్తాయి? పెరిగి పెద్దయ్యాక వారు ప్రతీకారం కోరుకోరా? ఒకవేళ అదే కనుక జరిగితే ప్రపంచంలో శాంతి, సామరస్యాలు ఎలా వెల్లివిరుస్తాయి? భవిష్యత్తులో శాంతియుత సమాజాన్ని ఎలా ఆశించగలం? నేటి పిల్లలే రేపటి పౌరులు. మనం ప్రస్తుతం తప్పులు చేసి, వారికి బాల్యంలో శాంతియుత సమాజాన్ని అందించకుండా.. భవిష్యత్తులో వారి నుంచి శాంతియుత సమాజాన్ని ఆశించగలమా? ఓ హిట్లర్ సృష్టించిన నరమేధం చరిత్ర గతినే మార్చేసింది. మరో హిట్లర్‌లా ప్రవర్తిస్తున్న ప్రస్తుత పాలకుల ఏలుబడిలో యుద్ధ వాతావరణంలో పెరుగుతున్న పిల్లలు భవిష్యత్తులో మరో హిట్లర్‌లా మారితే ఈ ప్రపంచం మనుగడ సాగిస్తుందా? నిత్యం బాంబు పేలుళ్ల మధ్య గడిపిన బాల్యం హింస వైపు మళ్లదని ఎవరైనా హామీ ఇవ్వగలరా?

ఎవరు ఎటుపోతేనేం మనం సురక్షితంగా ఉన్నామని అనుకోవడం సరికాదు. యుద్ధాల్లో చనిపోయిన, గాయపడిన పిల్లల్ని తల్చుకుంటూ వారి తల్లిదండ్రులు పడే ఆవేదనను అర్థం చేసుకోకపోతే సాటి మనుషులుగా మనం ఎందుకున్నట్టు? ఒంటికి తగిలిన గాయం మానుతుంది కానీ, మనసుకు తగిలిన గాయం అంత త్వరగా మానదు. నేడు మనసు విరిగిన బాలల వల్ల భవిష్యత్తులో మరిన్ని యుద్ధాలు జరిగితే అందుకు బాధ్యత వహించాల్సింది మనమే. మనం వారికి ఎలాంటి భవిష్యత్తును ఇస్తున్నామనేది ఇప్పటికైనా ఆలోచించాలి.

**'చిన్నారులు సామూహికంగా
కలుసుకుంటారు
అనంత విశ్వసాగర తీరంలో
పైన గగనం దిగువ
అలల అలజడిలో కడలి
పిల్లలెప్పుడూ ఆడుతూ, పాడుతూ
నవ్వుతూ, నర్తిస్తూ పోగవుతారు
తీరంలోని ఇసుకతో గూళ్లుకట్టి
ఆటలాడుతారు గవ్వలతో
సాగరంలో ఎండుటాకులనే
పడవలుగా వదిలి నవ్వుతుంటారు
చిన్నారులు ఆడుకుంటారు
అనంత విశ్వసాగర తీరంలో'**

అంటూ రంగుల బాల్యాన్ని వర్ణించాడు విశ్వకవి రవీంద్రుడు. పిల్లల ముఖంలో ఎప్పుడూ ఆనందాన్నే కోరుకుందాం. ఎలాంటి అలజడి లేని సమాజాన్ని వారికి కానుకగా ఇవ్వడానికి మనవంతుగా ప్రయత్నం చేద్దాం. ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ జ్ఞానం స్వేచ్ఛాయుతంగా ఉంటుందో అలాంటి సమాజాన్ని నిర్మించి పిల్లలకు అందిద్దాం.

కండ్లెదుటే కన్నతండ్రిపై దాడి.. బాలిక హఠాన్మరణం

సూర్యాపేట జిల్లా నాగారం కొత్తపల్లిలో విషాదం



పావని(ఫైల్)

తిరుమలగిరి (నాగారం), ఆగస్టు 16: తండ్రిపై ముగ్గురు ప్రత్యర్థుల దాడితో ఆ పసి హృదయం తల్లడిల్లింది. 'నాన్నా నాన్నా' అంటూ భోరున విలపించింది. అల్లారుముద్దుగా పెంచిన తండ్రిపై జరుగుతున్న దాడితో గుండెలవిసేలా ఏడ్చింది. తండ్రిని వదలకుండా కొడుతుంటే ఏడ్చీ ఏడ్చీ కుప్పకూలింది. కన్నతండ్రిపై జరుగుతున్న దురాగతాన్ని తట్టుకోలేని ఆ పసిహృదయం అక్కడే తనువు చాలించింది. సూర్యాపేట జిల్లా నాగారం మండలం డీకొత్తపల్లిలో జరిగిన ఈ ఘటనతో దౌర్జన్యాలకు పాల్పడే దుండగులకు కనువిప్పు కలగాలని సభ్య సమాజం కోరుకుంటున్నది. కొత్తపల్లికి చెందిన బైక్ మెకానిక్ కాసం సోమయ్యకు అదే గ్రామానికి చెందిన కడారి సైదులు, కడారి సోమయ్య, కాసం కళింగంతో భూతగాదాలున్నాయి. గ్రామంలో గురువారం బోనాల పండుగ జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో సోమయ్య ఇంటి ముందుకొచ్చిన కడారి సైదులు, కడారి సోమయ్య, కాసం కళింగం కర్రలు, ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడిచేయగా సోమయ్య కాలు విరిగడంతోపాటు తల పగిలింది. అడ్డుకోబోయిన భార్య తలకూ గాయాలయ్యాయి. దాడి జరుగుతుంటే అక్కడే ఉన్న ఆయన కూతురు పావని (14) భయాందోళనకు గురైంది. 'నాన్నా నాన్నా' అంటూ అరవసాగింది. అయినా ఆ కఠినాత్ములు వదలడంలేదు. తన తండ్రిని చంపుతున్నారని భావించి తట్టుకోలేని బాలిక స్పృహతప్పి కుప్పకూలింది. కుటుంబసభ్యులు వెళ్లిచూడగా అప్పటికే తనువు చాలించింది. సోమయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా, పావని చిన్నది. సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నాగారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ రవి, సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ ఐలయ్య పరిశీలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

అన్నావదినను చెట్టుకు కట్టేసి..!

20 వేల వడ్డీ కోసం.. సిద్దిపేటలో అమానుషం



అన్నావదినను ఆలయ ప్రాంగణంలోని చెట్టుకు కట్టివేసిన దృశ్యం

సిద్దిపేట టౌన్, ఆగస్టు 16 : డబ్బుల కోసం మనుషులు ఎంతకైనా తెగిస్తున్నారు. కేవలం రూ.20 వేల వడ్డీ డబ్బుల కోసం ఓ వ్యక్తి తన సొంత అన్నావదినను చెట్టుకు కట్టేసి దాడి చేశాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పురాలో శుక్రవారం కన్నీరు పెట్టించింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన దొంతర బోయిన పరశురాములు తన అవసరాల నిమిత్తం సొంత తమ్ముడు కనకయ్య వద్ద లక్ష రూపాయల అప్పుగా తీసుకున్నాడు. నాలుగు నెలల క్రితం సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించాడు. మిగిలిన రూ.20 వేల వడ్డీ కోసం తమ్ముడు కనకయ్య అన్న పరశురాములను వేధించాడు. ఈ క్రమంలో కౌన్సిలర్ జంగిటి కనకరాజు వద్దకు వీరి పంచాయితీ వెళ్లింది. ఆయన వీరిద్దరిని పిలిచి మాట్లాడుతుండగానే ఇద్దరు గొడవకు దిగారు. వారిని కౌన్సిలర్ అక్కడి నుంచి పంపించేశారు. అన్న పరశురాములు వెళ్లి పోతుంటే.. 'నాకు ఇవ్వాల్సి వడ్డీ డబ్బులు ఇవ్వకుండా ఎలా పోతావో? చూస్తా' అంటూ.. అన్నను లాక్కొచ్చి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని చెట్టుకు కట్టేశాడు. అతంటితో ఆగకుండా అడ్డువచ్చిన వదినను సైతం కట్టేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదుతో కనకయ్యపై కేసు నమోదు చేశారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.9°c	23.4°c
మెదక్	38.0°c	22.6°c
రంగారెడ్డి	37.3°c	22.6°c
హైదరాబాద్	33.4°c	21.2°c
నల్లగొండ	33.0°c	24.4°c
నిజామాబాద్	32.8°c	25.4°c
మహబూబ్‌నగర్	32.5°c	23.1°c
ఖమ్మం	32.0°c	25.0°c
కరీంనగర్	28.0°c	25.0°c
వరంగల్	28.0°c	26.0°c

రాష్ట్రంలో 22 వరకు వర్షాలు!

- హైదరాబాద్, రంగారెడ్డిలో నేడు, రేపు వానలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఇప్పటి వరకు 13 శాతం అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 22 వరకు మోస్తరు వర్షాలు కురువనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అంచనా వేసింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉండగా ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

పెరిగిన ఉక్కపోత

వారం రోజులుగా తెలంగాణతోపాటు ఏపీలోనూ ఎండలు, ఉక్కపోత పెరిగాయి. సాధారణంకన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు (36 డిగ్రీలకు పైగానే) నమోదవుతున్నాయి. మరి కొద్ది రోజులు ఇలాగే ఉంటుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నైరుతి రుతుపవనాల ప్రభావం బలహీనపడుతుండటంతో ఎండలు పెరుగుతున్నట్టు అంచనా వేసింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల రాక నుంచి ఇప్పటి వరకు 13 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో సాధారణ వర్షపాతం కంటే 2 శాతం అధిక వర్షపాతం నమోదైందని వెల్లడించింది. మరోవైపు గడిచిన 24 గంటల్లో సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా చౌటకూర్‌లో అత్యధికంగా 10.59 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాష్ట్రంలో దంచికొట్టిన వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్‌లో తాడు సహాయంతో వాగుదాటుతున్న గ్రామస్థులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 16: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షం దంచికొట్టింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రం సమీపంలోని మధురానగర్ వద్ద కరీంనగర్-జగిత్యాల రహదారిపై చెట్టు విరిగిపడటంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ వెళ్లే దారిలో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో దాటలేని పరిస్థితి నెలకొన్నది. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తా రోడ్లలో సుమారు అరగంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరికి చెందిన దరి రమేశ్ (30) అనే కూలీ పిడుగు పడటంతో మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. గంటసేపు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతంలోని పలు ఇండ్లు, దుకాణాల్లోకి వరద చేరింది. పట్టణంలోని పైభాగం నుంచి వచ్చిన వరద నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిని ముంచెత్తింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోయింది.

అమెరికాలో ఓరుగల్లు యువకుడి మృతి



రాజేశ్ (ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 16: అమెరికాలో ఓరుగల్లు యువకుడు మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం యూఎస్ వెళ్లిన ఆయన చనిపోయినట్టు శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ రాజేశ్ (33) 2015లో ఎమ్మెస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. తొమ్మిది సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం బీపీ, షుగర్ పెరగడంతోపాటు ఒక్కసారిగా గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్నేహితులు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు తెలిపారు. దిక్కు తోచని స్థితిలో వారు ఇంటి వద్ద రోదిస్తున్నారు. రాజేశ్ తండ్రి సాంబయ్య 11 నెలల క్రితమే మృతి చెందాడు. తల్లికి ఏం చేయాలో తెలియక కన్నీరు మున్నీరవుతున్నది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రాజేశ్ తల్లి, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

లోవోల్టేజీ సమస్యపై రైతుల నిరసన

వర్షకొండ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16 : లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండకు చెందిన సుమారు 200 మంది రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం వర్షకొండ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ సతీశ్‌కు వినతిపత్రాన్ని అందించి, లోవోల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ. నాలుగు రోజులుగా వ్యవసాయానికి తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో 150 మోటర్లు కాలిపోయినట్టు తెలిపారు. విద్యుత్తు అధికారులు నష్టపరిహారం చెల్లించడంతోపాటు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

ఈ విద్యుత్తు అధికారులు మాకొద్దు

- కోతలపై విన్నవిస్తే కేసులు పెడుతామని బెదిరిస్తుండ్రు
- సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

తాంసి, ఆగస్టు 16 : కరెంట్ కోతలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతామని బెదిరిస్తున్న అధికారుల తీరును నిరసిస్తూ రైతులు ఆదిలాబాద్ జిల్లా తాంసి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. 'మండల విద్యుత్తు అధికారితోపాటు సీనియర్ లైన్‌మెన్.. మాకొద్దు' అంటూ నినదించారు. నెల రోజులుగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గురువారం రాత్రి విద్యుత్తు సరఫరాలో అంతరాయంపై జామిడి గ్రామస్థులు విన్నవించగా మద్యం తాగి వచ్చి గొడవ చేస్తున్నారని కేసు పెడుతామని సబ్ స్టేషన్ అధికారులు బెదిరించారని వారు వాపోయారు. శుక్రవారం కూడా కరెంట్ లేకపోవడంతో అధికారుల తీరుకు నిరసనగా సబ్ స్టేషన్‌ను ముట్టడించారు.



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కరెంట్ సరఫరాపై రైతులు సంతోషంగా లేరు

- ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేయాలి
- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, ఆగస్టు 16: విద్యుత్తు సరఫరా విషయంలో రైతులు సంతోషంగా లేరని, తరచూ అంతరాయం ఏర్పడుతుందని ఫిర్యాదులు చేస్తున్నారని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలోని రైతు వేదికలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామనే విషయాన్ని అధికారులు గుర్తించుకొని చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రుణ మాఫీ విషయంలోనూ రైతులకు స్పష్టత లేదని, సమస్యలు రాకుండా అధికారులు చూసుకోవాలని చెప్పారు. గ్రామాల్లోని పైప్ లైన్ల లీకేజీ సమస్యలను పరిష్కరించి ప్రజలకు భగీరథ నీటిని అందించాలని ఆదేశించారు. కెనాల్ నీరు ప్రతి చెరువులోకి వచ్చేలా చూడాలన్నారు. వన మహోత్సవం పూర్తి స్థాయిలో జరగడం లేదని, నాటిన ప్రతి మొక్క బతికే విధంగా చూడాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

విద్యుత్తు శాఖ ఇంజినీర్ల సస్పెన్షన్

నమస్తే ఎఫెక్ట్

కాశీబుగ్గ, ఆగస్టు 16: విధి నిర్వహణలో అసభ్యకరంగా వ్యవహరించిన ఇద్దరు ఎన్పీడీసీఎల్ ఇంజినీర్లను సస్పెండ్ చేసినట్టు ఆ సంస్థ సీఈ (హెచ్చార్డీ అండ్ ట్రైనింగ్) టీ మధుసూదన్ ప్రకటించారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కరెంట్ కోతలు.. అడిగితే బూతులు' కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. సంబంధిత అధికారుల తీరుపై విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ సర్కిల్ పరిధిలో ఏఈగా పనిచేస్తున్న ఎం జ్యోతిర్మయినాథ్‌తోపాటు గొర్రెకుంట సబ్ ఇంజినీర్ డీ నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్ఈ పీ మధుసూదన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్తు షాక్‌తో రైతుమృతి



పోచయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట, ఆగస్టు 16: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్తు తీగలను సరిచేస్తుండగా ఓ రైతు షాక్‌గురై మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చితుకుల (కుర్మ) పోచయ్య (38) గ్రామ శివారులోని తనకున్న ఐదెకరాల భూమిలో ఇటీవల వరి వేశాడు. శుక్రవారం ఉదయం వరుసకు అల్లుడైన రమేశ్‌తో కలిసి పంటకు నీరు పారించేందుకు వెళ్లాడు. బోరు మోటర్లు పని చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపోయిన తీగలను గుర్తించాడు. వాటిని సరి చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న రమేశ్ కేకలు వేయడంతో పక్కనే పొలం వద్ద ఉన్న రైతులు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేసి చూడగా అప్పటికే పోచయ్య మృతిచెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

అమెరికా చదువుల్లో స్టెమ్ కోర్సులే టాప్

- సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్‌పై ఆసక్తి
- 40% మంది వీటిలోనే చేరిక
- అక్కడి వారిలో 2.7లక్షల మంది ఇండియన్సే



యూఎస్ కాన్సులేట్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని అత్యధిక భారతీయ విద్యార్థులు ఎంపిక చేసుకుంటున్నవి సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్(స్టెమ్)కోర్సులే. 2.40లక్షల (22.7శాతం) మంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, గణితం కోర్సుల్లో చేరగా, 2.02లక్షల (19.2శాతం) విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. అత్యధికులు స్టెమ్ కోర్సుల్లోనే చేరుతున్నట్టు వర్సిటీల ప్రతినిధులు వెల్లడించారు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల్లో భారతీయ విద్యార్థులు అధికంగా చేరుతున్నట్టు అరిజోనా స్టేట్ వర్సిటీ ప్రతినిధి తోట సాయి కృష్ణ తెలిపారు. డాటా అనలెటిక్స్, డాటా సైన్స్, అకౌంటింగ్ కోర్సులు, కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రాంకు డిమాండ్ ఉంటోందని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధి సల్మాన్ తెలిపారు. అమెరికా చదువులపై అవగాహన కల్పించేందుకు యూఎస్‌ఏ కాన్సులేట్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ఫెయిర్ శుక్రవారం మాదాపూర్‌లో నిర్వహించగా యూఎస్ కాన్సులేట్ పబ్లిక్ ఆఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లీన్ ప్రారంభించారు. 80 వర్సిటీల ప్రతినిధులు కోర్సులు, ఫీజులు, స్కాలర్‌షిప్ సమాచారాన్ని అందించారు.

అమెరికాపైనే ఆశలు..

లే ఆఫ్‌ల భయం.. ఆర్థిక మాంద్యం.. పైగా అనేక ఆంక్షలు. ఉద్యోగాల లేమి పీడిస్తున్నా మన విద్యార్థులు యూఎస్‌పైనే ఆశలు పెట్టుకుంటున్నారు. విదేశీ చదువుల కోసం అత్యధికులు అమెరికానే ఎంచుకుంటున్నారు. ఏటేటా అమెరికా వీసాలు పొందుతున్న ప్రతి నలుగురు విద్యార్థుల్లో ఒక్కరు భారతీయ విద్యార్థే ఉండటం విశేషం. 69శాతం విద్యార్థులు తమ అంతర్జాతీయ చదువులకు అమెరికానే గమ్యస్థానంగా భావిస్తున్నారు. గ్రాడ్యుయేట్ విద్యార్థులు 62 శాతముండగా, 16 మంది అండర్ గ్రాడ్యుయేట్, 1.3శాతం ఓపీటీ విద్యార్థులున్నారు. 2023లో 1.40లక్షల వీసాలను భారతీయ విద్యార్థులే పొందారు. మరే దేశ విద్యార్థులు ఈ స్థాయిలో వీసాలను పొందలేదు. అమెరికాలో ప్రస్తుతం 2.7లక్షల మంది భారతీయ విద్యార్థులున్నారు. వీరిలో 1.35లక్షల మంది తెలుగు రాష్ట్రాలకు చెందినవారే. న్యూయార్క్ వర్సిటీలో24వేల మంది చేరగా, ఆ తర్వాత నార్త్ ఈస్టన్ యూనివర్సిటీలో 20 వేలు, కొలంబియాలో 19వేలు, అరిజోనా వర్సిటీలో 17వేల మందితో టాప్ -4 స్థానాల్లో ఉన్నాయి. ఏటేటా అమెరికా వీసాలు పొందుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. 2017లో కేవలం 51వేల వీసాలను జారీచేయగా, 2023కు వచ్చేసరికి 1.4లక్షలకు చేరింది. అంటే ఈ ఏడు సంవత్సరాల్లో 90వేల వీసాలు అత్యధికంగా జారీ అయ్యాయి.

ఏటా వీసాల జారీతీరు

సంవత్సరం	వీసాలు
2017	51వేలు
2018	55వేలు
2019	55వేలు
2020	కరోనా
2021	96వేలు
2022	1.33లక్షలు
2023	1.40లక్షలు

మెడికల్ అడ్మిషన్లు, సౌకర్యాల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానల్లో వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్‌చోంగ్తు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. టాస్క్‌ఫోర్స్‌లో డీఎంఈ సభ్యకార్యదర్శిగా , డీఎంఈ(అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల అడ్మిషన్ల ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనున్నది. బయోమెట్రిక్ అటెండెన్స్, ఓపీ, ఐపీ, మాతాశిశు సంరక్షణ సేవలు, పోస్టుమార్టం విభాగాల్లో వసతులపై నిశితంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నది.

రిటైర్డ్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొనసాగింపు

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): వర్సిటీల్లో 60 ఏండ్లు పూర్తిచేసుకున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించాలని ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేశ్ అన్ని వర్సిటీల రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. 12 వర్సిటీల్లో 900 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. ఇటీవల 60 ఏండ్లు పూర్తిచేసుకున్న 15 మంది పదవీ విరమణ పొందారు. ఇదే విషయాన్ని ఇటీవల 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకొచ్చింది. 'క్రమబద్ధీకరణ కలేనా' అన్న శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పదవీ విరమణ పొందుతుండటంతో వర్సిటీల్లో బోధన గాడి తప్పుతోందని సర్కారు దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన విద్యాశాఖ 60 ఏండ్లు పూర్తిచేసుకున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కొనసాగించాలని ఉత్తర్వులిచ్చింది.

అక్టోబర్‌లో ఓపెన్ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలను అక్టోబర్ మొదటివారంలో నిర్వహిస్తామని డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు. పరీక్షలకు హాజరయ్యేవారు 30 లోగా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆలస్య రుసుముతో సెప్టెంబర్ 9లోగా ఫీజును చెల్లించవచ్చని తెలిపారు.

నేడు బడుల్లో.. నో బ్యాగ్ డే

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : భార రహిత, ఒత్తిడిలేని చదువులనందించేందుకు అమలుచేస్తున్న 'నో బ్యాగ్‌డే'ను రాష్ట్రంలోని అన్ని బడుల్లో శనివారం జరపనున్నారు. ప్రతి నెల మూడో శనివారం 'నో బ్యాగ్‌డే' అమలుచేయాలని గతంలోనే పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ కరదీపికలను ముద్రించింది.



ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

దరఖాస్తులను ఎలా రిజెక్ట్ చేస్తారు?

- క్షేత్రస్థాయిలో పరిశీలించరా?
- తహసీల్దార్లపై సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఆగ్రహం

నమస్తే ఎఫెక్ట్

కరీంనగర్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే రెవెన్యూ దరఖాస్తులను ఎలా రిజెక్ట్ చేస్తారని సిరిసిల్ల అదనపు కలెక్టర్.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రెవెన్యూ దరఖాస్తులు లక్షకుపైగా రిజెక్ట్?' శీర్షికన 15న 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. పైనుంచి ఒత్తిళ్లు, జరిగిన తప్పులు, తద్వారా రైతులకు జరిగిన అన్యాయం, దరఖాస్తుల తిరస్కరణ వంటి అంశాలను కండ్లముందుంచడం కలకలం రేపింది. దీంతో రాష్ట్ర సర్కారు దరఖాస్తులపై స్పందించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఉన్నతాధికారులను వివరాలు అడిగినట్టుగా తెలుస్తుండగా.. శుక్రవారం సిరిసిల్ల అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ తన చాంబర్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో హడావిడిగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు తహసీల్దార్ల తీరుపై ఆగ్రహించినట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో ఏ మాత్రం పరిశీలన చేయకుండా దరఖాస్తులు ఎలా రిజెక్ట్ చేస్తారని ప్రశ్నించినట్టు సమాచారం. ప్రతి మండలంలో ఎన్ని దరఖాస్తులను తిరస్కరించారన్న వివరాలు తెలుసుకోవడంతోపాటు అందుకు కారణాలను అడిగినట్టు తెలిసింది. మెజార్టీ తహసీల్దార్లు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేసినట్టు రెవెన్యూ అధికార వర్గాల ద్వారా సమాచారం. త్వరితగతిన పనులు చేయించడంలో భాగంగా పైఅధికారుల నుంచి ఒత్తిడి వస్తుందని, అంత మాత్రాన రిజెక్ట్ చేసి పరిష్కరించినట్టు చూపడం ఎంతవరకు కరెక్టని ప్రశ్నించినట్టు తెలిసింది. వీటిపై పూర్తి వివరాలు తీసుకొని, తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు సమాచారం.



శుక్రవారం నాంపల్లిలోని ఇంటర్ విద్యా కమిషనరేట్‌ను ముట్టడించిన లెక్చరర్లు

ఇంటర్ గెస్ట్ లెక్చరర్లను కొనసాగించండి

రూ.42వేల వేతనాన్నివ్వండి • కమిషనరేట్‌ను ముట్టడించిన అధ్యాపకులు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లను ఈ విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ లెక్చరర్లు శుక్రవారం నాంపల్లిలోని ఇంటర్ విద్యా కమిషనరేట్‌ను ముట్టడించారు. రూ. 42వేల వేతనాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో పలు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన లెక్చరర్లు కమిషనరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 దాటినా.. గెస్ట్ లెక్చరర్లను కొనసాగించకపోవడం అత్యంత దారుణమని వాపోయారు. 18 జూనియర్ కాలేజీలు కొత్తవి ఇవ్వగా, వాటిలో లెక్చరర్లు లేక చదువులు ముందుకు సాగడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.42వేల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎండీ భాషా, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

40శాతం కూడా రుణమాఫీ కాలే

• మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 16 : అంకెల గారడీతో రైతులను సీఎం రేవంత్‌రెడ్డి బురిడీ కొట్టిస్తున్నాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 40శాతం కూడా రుణమాఫీ కాలేదన్నారు.

అబద్ధాలకు రేవంత్‌రెడ్డి అంబాసిడర్: మాజీ ఎమ్మెల్యే సుంకె



అబద్ధాలకు రేవంత్‌రెడ్డి అంబాసిడర్‌గా మారారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎద్దేవాచేశారు. పూడూరులో 680 మంది రైతులుంటే, 142 మందికి మాత్రమే మాఫీ అయినట్టు వివరించారు.

దేవుళ్లపై ఒట్టేసి రైతులకు మోసం: మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టేసి మరీ సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మాజీ మంత్రి జోగు రామన్న ఆదిలాబాద్‌లో మండిపడ్డారు.

రుణమాఫీపై చేతులెత్తేసిన సర్కార్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బోథ్, ఆగస్టు 16 : రుణమాఫీ చేయక రేవంత్ సర్కార్ చేతులెత్తేసిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని తన నివాసంలో మాట్లాడారు.

తుపాకీ రాముడి మాటలు బంజెయ్ : పుట్ట మధూకర్



పెద్దపల్లి, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ) : ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి తుపాకీ రాముడి ముచ్చట్లు బంద్ చేయాలని మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, కోరుకంటి చందర్ హితవుపలికారు. శుక్రవారం పెద్దపల్లి బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు.

హరీశ్‌రావు జోలికొస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఇక ముందు హరీశ్‌రావు జోలికొస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హెచ్చరించారు. శుక్రవారం సంగారెడ్డిలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, చంటి క్రాంతికిరణ్‌తో కలిసి మాట్లాడారు.

హరీశ్‌రావు వీడియోను ప్రదర్శించిన చంటి క్రాంతికిరణ్



రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాలు చేసిన వీడియోను విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రదర్శించారు. ఎలాంటి షరతుల్లేకుండా రుణమాఫీ అమలుచేస్తే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ సవాల్ చేశారని కాంత్రికిరణ్ వివరించారు.

రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



నార్కట్‌పల్లి, ఆగస్టు 16 : రుణమాఫీ అమలులో విఫలమైన రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలని మాజీ ఎమ్మెల్యే లింగయ్య డిమాండ్ చేశారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు : ఎమ్మెల్సీ కోటిరెడ్డి



మిర్యాలగూడ, ఆగస్టు 16 : కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి మిర్యాలగూడలో విమర్శించారు.


కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌కు అస్వస్థత అంటూ తప్పుడు కథనాలు వ్యాప్తి
- పార్టీ క్యాడర్‌తో, వ్యవసాయ పనులతో నిత్యం కేసీఆర్ బిజీబిజీ
- 12 రోజులుగా అస్వస్థత అయితే నేతలను ఎలా కలుస్తున్నరు?

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆరోగ్య పరిస్థితిపై కాంగ్రెస్ దుష్ప్రచారానికి పాల్పడుతున్నది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న కేసీఆర్‌పై తీవ్ర అస్వస్థత ముద్రవేసే పన్నాగానికి తెరతీసింది. నిత్యం పార్టీ శ్రేణులతో భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరుపుతూ, వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులతో బిజీబిజీగా గడుపుతున్న నేతకు అనారోగ్యం అంటూ దుష్ప్రచారానికి దిగింది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌కు తీవ్ర అస్వస్థత అంటూ ప్రచారం చేస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా 12 రోజులుగా కేసీఆర్ అస్వస్థతకు గురయ్యారని, యశోద దవాఖాన బృందం గజ్వేల్‌లో ఎమర్జెన్సీ యూనిట్‌ను నెలకొల్పి 24 గంటలు పర్యవేక్షిస్తున్నదని ప్రచారం చేస్తున్నది.

12 రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైతే...

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్ కుటుంబ సమేతంగా బుధవారం కేసీఆర్‌ను కలిసి, తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తన పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కేసీఆర్ 12 రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైతే ఇవి సాధ్యపడ్తాయా? అని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.



మాజీ సీఎం కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

కేసీఆర్ స్ఫూర్తితో ఆమరణ దీక్ష

- కులగణన చేయకుంటే ఊరుకోం
- 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- బీసీ సంఘాల నేతల స్పష్టీకరణ
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాల్సిందే
- ఆర్ కృష్ణయ్య, రాజారాంయాదవ్ డిమాండ్



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, ఆగస్టు 16: బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ స్ఫూర్తితో ఆమరణ దీక్ష చేపడుతామని బీసీ సంఘాల నాయకులు స్పష్టంచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని వారు డిమాండ్ చేశారు. కులగణన చేయకుండా ప్రభుత్వం సాకులు చెబితే ఊరుకునే ప్రసక్తే లేదని ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. తన ఆరోగ్యం బాగాలేకున్నా సామూహిక ఆమరణ దీక్షలో పాల్గొంటానని చెప్పారు. అధికార పార్టీలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు సమగ్ర కులగణనపై ఆయా పార్టీలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉన్నదని హితవు పలికారు. 42 మంది బీసీ నేతలతో సామూహిక ఆమరణ దీక్ష చేపడుతామని చెప్పారు.

రేవంత్‌రెడ్డిది నడుమంత్రపు సిరి

• మాజీ ఎంపీ బాల్క సుమన్ ఫైర్



మాట్లాడుతున్న బాల్క సుమన్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : 'కేసీఆర్, హరీశ్‌రావుతో నీకు పోలికా? ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు మాట్లాడు' అంటూ రేవంత్‌రెడ్డిపై మాజీ ఎంపీ బాల్క సుమన్ ఫైర్ అయ్యారు. హరీశ్‌రావుపై రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియా మాట్లాడారు. రుణమాఫీ మోసాన్ని పక్కదారి పట్టించేందుకే కేసీఆర్, హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని, భరతం పడతామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి దావోస్, అమెరికా పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 4వేల పింఛన్ ఇవ్వనందుకు, స్కూటీలు ఇవ్వనందుకు, రైతులను వంచించినందుకు, ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు రేవంత్‌రెడ్డే నీళ్లలో దూకాలని దుయ్యబట్టారు. అంబేద్కర్‌ను రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నాడని, నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ అతిపెద్ద విగ్రహం వద్ద వసతులు కల్పించకుండా వదిలేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డిది నడుమంత్రపు సిరి అని, జాక్‌పాట్‌లో సీఎం అయ్యారని, ఇదే ఆయనకు చివరి పదవి అని, భవిష్యత్తులో ఇక ఏ పదవీ వచ్చేది లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే పనితీరులో పోటీ పడాలని సూచించారు. బీఆర్‌ఎస్ ఏ పార్టీలో విలీనం కాదని, బలమైన పార్టీ అని, మరో 50 ఏండ్లు బలంగా ఉండేందుకు పార్టీ నాయకత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. త్వరలోనే బలమైన ప్రాంతీయ పార్టీ లున్న రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ అధ్యయనం చేస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో శాట్స్ మాజీ చైర్మన్ అంజనేయగౌడ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు బాలు పాల్గొన్నారు.

అసమానతలు తగ్గించటానికి వర్గీకరణ తోడ్పాటు: పొన్నాల

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎస్సీ వర్గీకరణ దోహదం చేస్తుందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం స్ఫూర్తివంతమైనదని తెలిపారు. ఆయన పోరాటం ఫలించిందని చెప్పారు. హైదరాబాద్‌లోని పొన్నాల లక్ష్మయ్య నివాసానికి శుక్రవారం మందకృష్ణ వెళ్లారు. మర్యాద పూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి చేరిన ఈవోఎస్-08 ఉపగ్రహం

విపత్తు నిర్వహణలో ఈ శాటిలైట్ వినియోగం

> 7



మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ


NAMASTE TELANGANA

శనివారం SATURDAY 17.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 73 ‖ వెల (Price) రూ.6.50 | ద్వాదశి

శనివారం, సూర్యోదయం: 5-59, సూర్యాస్తమయం: 6-40. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: ద్వాదశి ఉదయం 8-06, తదుపరి త్రయోదశి తెల్లవారుజామున 5-51 వరకు. నక్షత్రం: పూర్వాషాఢ ఉదయం 11-49 వరకు, తదుపరి ఉత్తరాషాఢ. వర్జ్యం: రాత్రి 7-18 నుంచి రాత్రి 8-18 వరకు. రాహుకాలం: ఉదయం 9-10 నుంచి ఉదయం 10-45 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-00 నుంచి ఉదయం 7-41 వరకు. అమృతకాలం: ఉదయం 7-11 నుంచి ఉదయం 8-44 వరకు, పునర్ అమృతకాలం తెల్లవారుజామున 4-15 నుంచి తెల్లవారుజామున 5-45 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఎంపాక్స్ కలవరం

ఆఫ్రికా నుంచి వేగంగా ఇతర దేశాలకు వైరస్ వ్యాప్తి

స్వీడన్‌లో కలకలం.. పాక్‌లో మూడు కేసులు నమోదు

గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో

> 7

నేడు వైద్య సేవలు బంద్

> 7

కోల్‌కతా హత్యాచార ఘటనను నిరసిస్తూ 24 గంటల ఆందోళన

అత్యవసరం కాని సేవలు నిలిపివేత

నేడు, రేపు భారీ వర్షాలు

వారం రోజులుగా పెరిగిన వేడి

మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి

22 వరకు రాష్ట్రంలో వానలు

పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

> 6

రేవంత్ చెలగాటం..రైతన్నకు సంకటం

మాఫీ కథ మళ్లీ మొదటికి?

కొత్తగా మార్గదర్శకాల పేరిట మరో దాటవేత.. వ్యతిరేకతను తట్టుకునేందుకు మరో వ్యూహం

ఫిర్యాదులు, సూచనలకు ప్రత్యేక సర్క్యులర్ జారీ.. ఫిర్యాదుల నమోదుకు పోర్టల్‌లో అవకాశం

ఫిర్యాదులకు, పరిష్కారాలకు డెడ్‌లైన్ పెట్టని సర్కార్

బ్యాంకు నుంచి డాటా తీసుకొనే అవకాశం ఉన్నా రైతులను ముప్పతిప్పలు పెడుతున్న ప్రభుత్వం

ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై స్పష్టత కరువు

కరీంనగర్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రుణమాఫీ కథ మళ్లీ మొదటికి వచ్చింది. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని చెప్తూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ పేరిట మరో అంకానికి తెరలేపుతున్నది. మూడు విడతల్లోనూ రుణమాఫీ జరగని రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నదని నిఘా వర్గాలు హెచ్చరించడంతో అప్రమత్తమైన ప్రభుత్వం.. ఫిర్యాదులు, సూచనల పేరిట తాజాగా కొత్త మార్గదర్శకాలు (సర్క్యులర్-24) జారీచేసింది. వీటిలోనూ స్పష్టత కొరవడింది. రైతులు ఎప్పటిలోగా ఫిర్యాదు చేయాలి? వాటిని అధికారులు ఎప్పటిలోగా పరిష్కరించాలి? ఇప్పటివరకు స్వీకరించిన ఫిర్యాదులను ఏమి చేస్తారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో మార్గదర్శకాల పేరిట మరోసారి దాట వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్న విమర్శలొస్తున్నాయి.

మళ్లీ కొత్త కథ

నిజానికి రూ.2 లక్షల వరకు పంట రుణాలను అందరికీ ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ తరువాత వాటిని మూడు దఫాలుగా మాఫీ చేస్తామంటూ మాటమార్చారు. మొదటి విడత రుణ మాఫీ జూలై 18న, రెండో విడత జూలై 30న, మూడో విడత ఆగస్టు 15న చేపట్టారు. మొదటి విడతలోనే రాష్ట్రంలో లక్షలాది రైతుల పేర్లు గల్లంత య్యాయి. దీంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయితే మొదటి జాబితాలో మాఫీ కాని వారికి రెండో విడతలో అవుతుందని, అప్పటివరకు ఓపిక పట్టాలంటూ అధికారులు సర్దిచెప్పడంతో రైతులు కాస్త మెత్తబడ్డారు. రెండో విడతలో కూడా తమ పేర్లు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసే రైతుల సంఖ్య పెరిగింది. దీంతో మూడో విడత వరకు > 2వ పేజీలో



రుణమాఫీ ఎప్పుడు చేస్తరు?

బ్యాంకు ఎదుట రైతుల నిరసన

తమకు రుణమాఫీ కాలేదంటూ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చినా.. ఇప్పటివరకు సగం మందికి కూడా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. వీరికి స్థానిక బీఆర్ఎస్ నాయకుడు భరత్ చౌహాన్, ఉట్నూర్ మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి మద్దతు తెలిపారు.

– ఉట్నూర్, నమస్తే తెలంగాణ

రుణమాఫీ అందరికీ అయిందా?..

నిరూపిస్తే రాజీనామా

- 'కొడంగల్'లో ఒక్కరితో చెప్పించినా అక్కడే లేఖ ఇస్తా
- మాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్
- ఆయన చీఫ్ మినిస్టర్ కాదు.. కటింగ్ మాస్టర్
- 40 వేల కోట్లు మాఫీ అని చివరికి 17 వేల కోట్లు చేశారు
- రైతులను మోసం చేసిన సీఎంపై చీటింగ్ కేసు పెట్టాలి
- మాకు రాజీనామాలు.. రేవంత్‌కు చీటింగ్ కొత్తకాదు
- రేవంత్‌రెడ్డి మానసిక పరిస్థితిపై అనుమానాలు: కేటీఆర్

రేవంత్‌రెడ్డికి అభినవ గోబెల్స్ అవార్డు ఇవ్వాలి: నిరంజన్‌రెడ్డి

రైతు భరోసా నిధులతో అరకొరగా రుణమాఫీ : కొప్పుల ఈశ్వర్

23 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎగనామం: ఎర్రోళ్ల శ్రీనివాస్

నడమంత్రపు సిరితో రేవంత్ హోదా మరిచి మాటలు: బాల్క సుమన్

సీఎం హోదాలో జుగుప్సాకర మాటలా? తీరు మారకుంటే గుణపాఠం: తక్కెళ్లపల్లి

ముఖ్యమంత్రిగా ఉండి తెలంగాణ పరువు తీయొద్దు: తాతా మధు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో అందరికీ రుణమాఫీ అయినట్టు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాలు వదిలేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ చెప్తున్న రుణమాఫీ ఈ శతాబ్దపు అతిపెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. కొడంగల్‌లోని ఏ గ్రామానికైనా వెళ్దామని, వందశాతం రుణమాఫీ అయిందని ఒక్క రైతు చెప్పినా తాను అక్కడే రాజీనామా చేసి స్పీకర్‌కు లేఖ పంపిస్తానని చెప్పారు. సీఎంకు దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో రైతులకు చేసిన అతిపెద్ద ద్రోహం ఇదేనని మండిపడ్డారు. రుణమాఫీకి తొలుత రూ. 40 వేల కోట్లు, ఆ తర్వాత > 2వ పేజీలో



రాజీవ్ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి

సెక్రటేరియట్ ఎదుట తథ్యం

మేము అధికారంలోకి రాగానే చేసి తీరుతాం: కేటీఆర్ స్పష్టీకరణ > 5

వానకాల వధువులు!

- వరదల భయంతో పాక్‌లో బాల్య వివాహాలు!
- 2022 వరదల తర్వాత దయనీయ పరిస్థితులు
- ఆర్థిక భద్రత కరువవ్వడంతో కుటుంబాలు విలవిల
- డబ్బు తీసుకుని ఆడ పిల్లలకు పెండ్లి చేస్తున్న తల్లిదండ్రులు



ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో 2022లో సంభవించిన వరదల ప్రభావం ప్రజలను ఇప్పటికీ వెంటాడుతున్నది. వాతావరణ మార్పుల వల్ల ఏర్పడిన ఆర్థిక అభద్రతా భావం ఆడ పిల్లల జీవితాలను సమస్యల సుడిగుండంలోకి నెడుతున్నది. జూలై-సెప్టెంబరు మధ్య కాలంలో కురిసే భారీ వర్షాలు, సంభవించే వరదలు, కొండచరియలు విరిగి పడటం, పంట నష్టాలు వంటివాటికి రైతులు భయపడిపోతున్నారు. తమ కుటుంబ ఆర్థిక భద్రత కోసం తమ మైనర్ కుమార్తెలకు పెండ్లి చేస్తున్నారు. తమ కుమార్తెల వయసు కన్నా రెట్టింపు వయసుగల పురుషుల నుంచి సుమారు రూ.2 లక్షలు తీసుకుని, వారితో వివాహాలు చేస్తున్నారు.

మాన్‌సూన్ బ్రైడ్స్..


2022లో సంభవించిన వరదల వల్ల పాకిస్థాన్‌లో మూడొంతుల భాగం జలమయమైంది. ఈ ప్రభావం నుంచి సింధ్ ప్రాంతం ఇంకా కోలుకోలేదు. దీంతో 'వానాకాలం వధువు'ల (మాన్‌సూన్ బ్రైడ్స్) ట్రెండ్ ప్రారంభమైందని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఓ సంస్థ వ్యవస్థాపకుడు మషూక్ చెప్పారు. పురుషుల కుటుంబాల నుంచి డబ్బు తీసుకుని, తమ మైనర్ కుమార్తెలకు కొందరు తల్లిదండ్రులు పెండ్లి చేస్తున్నారన్నారు. గత వర్షాకాలం నుంచి తమ గ్రామంలో 45 మంది మైనర్ బాలికలకు వివాహాలు జరిగినట్టు ఖాన్ మహమ్మద్ మల్లాహ్ గ్రామ పెద్ద చెప్పారు.

తిరిగి పుట్టింటికి..

తమ పిల్లలను పేదరికం నుంచి కాపాడటం కోసమే వారికి వివాహం చేస్తున్నామని తల్లిదండ్రులు చెప్తున్నారు. మరోవైపు, బాల్యంలో వివాహం చేసుకున్న మైనర్ బాలికల్లో చాలా మందికి జీవనోపాధి కరువవుతున్నది. భర్తకు ఉపాధి లేకపోవడం, తమ ఆలనాపాలనా చూసుకోకపోవడంతో విసుగుచెంది భర్త, పిల్లలతో సహా తిరిగి తమ పుట్టింటికి వస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల కష్టాలు రెట్టింపు అవుతున్నాయి.

జంక్ జీనియస్ 'అనుష్క'

- వ్యర్థాలతో అద్భు త హ్యూమనాయిడ్ రోబో సృష్టి
- కేఈఐటీ విద్యార్థులు, ప్రొఫెసర్ల వినూత్న ఆవిష్కరణ
- ప్రపంచంలో కొట్టుకునే గుండె ఉన్న తొలి రోబో ఇదే



న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఉత్తరప్రదేశ్‌లోని కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (కేఈఐటీ) విద్యార్థులు అద్భుతాన్ని సృష్టించారు. డంపింగ్ యార్డు (చెత్తకుప్ప) నుంచి స్వీకరించిన పలు రకాల తుక్కు సామాన్లను ఉపయోగించి చాలా తక్కువ ఖర్చుతో ఏకంగా హ్యూమనాయిడ్ రోబో (మరమనిషి)ని రూపొందించారు. ఆ రోబోకు 'అనుష్క' అని నామకరణం చేశారు. వేద సూత్రాల ప్రేరణతో దీని ఇంటెలిజెన్స్ వ్యవస్థను, త్రీడీ ప్రింటెడ్ భాగాలతో ఫేసియల్ ఫీచర్స్‌ను తీర్చిదిద్దారు. భారత్‌లోని మేడమ్ టుస్సాడ్స్ బృందం రూపొందించిన ఫ్లెక్సిబుల్ సిలికాన్ స్కిన్‌ను తొడిగారు. ప్రపంచంలో కొట్టుకునే గుండెను కలిగి ఉన్న తొలి రోబో ఇదే కావడం విశేషం. కేవలం రూ.2 లక్షల ఖర్చుతో దీన్ని తయారు చేయడం గమనార్హం. ఇతర మాడళ్ల హ్యూమనాయిడ్ రోబోల తయారీ ఖర్చు కంటే ఇది చాలా తక్కువ. ఓపెన్ ఏఐ డాటాబేస్ నుంచి సంగ్రహించిన సమాచారాన్ని ఉపయోగించుకుని ప్రస్తుతానికి అనుష్క 61 భాషలు, 50 రకాల చేతి సంజ్ఞల (హ్యాండ్ గెశ్చర్స్) ద్వారా వినియోగదారులతో కమ్యూనికేట్ చేయగలుగుతున్నది.

జమ్ముకశ్మీర్ ఎన్నికల నగారా



- సెప్టెంబర్ 18 నుంచి మూడు దశల్లో ఎన్నికలు
- హర్యానా అసెంబ్లీకి అక్టోబరు 1న పోలింగ్
- అక్టోబరు 4న రెండు అసెంబ్లీల ఫలితాలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- పెండింగ్‌లో మహా, ఢిల్లీ, జార్ఖండ్ ఎన్నికలు



రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 16: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. దాదాపు దశాబ్దకాలం తర్వాత ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2019లో ఆర్టికల్ 370 తొలగించి, జమ్ము కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసిన తర్వాత మొదటిసారి ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు.. జమ్ము కశ్మీర్‌తో పాటు హర్యానా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి చివరగా 2014 నవంబరు-డిసెంబరులో ఐదో దశల్లో ఎన్నికలు జరిగాయి. జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబరు 30 లోపు ఎన్నికలు జరపాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

తర్వాతి దఫాలో మూడు రాష్ట్రాలకు.

2019లో హర్యానాతో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగినా ఈసారి మాత్రం ఆ రాష్ట్ర ఎన్నికలకు ఈసీ షెడ్యూల్ ప్రకటించలేదు. జమ్ము కశ్మీర్ ఎన్నికల కోసం భద్రతా ఏర్పాట్లను దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్ర ఎన్నికలకు ఇప్పుడు షెడ్యూల్ విడుదల చేయలేదని సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. జమ్ము కశ్మీర్, హర్యానా ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేయనుంది.

జమ్ముకశ్మీర్ (మొత్తం సీట్లు-90)

దశ	పోలింగ్ తేదీ	సీట్లు
మొదటి దశ	సెప్టెంబర్ 18	24
రెండో దశ	సెప్టెంబర్ 25	26
మూడో దశ	అక్టోబర్1	40
ఫలితాలు	అక్టోబర్ 4	

హర్యానా (మొత్తం సీట్లు-90)

పోలింగ్ తేదీ	అక్టోబర్ 1
ఫలితాలు	అక్టోబర్ 4

హర్యానాలో ఈసారి
టగ్ ఆఫ్ వార్

- మూడోసారి అధికారంపై కన్నేసిన కమలం పార్టీ
- హామీలు, ప్రజావ్యతిరేకతపై కాంగ్రెస్ ఆశలు
- లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలకూ ఐదేసి సీట్లు
- అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇరు పార్టీల హోరాహోరీ!



చండీగఢ్, ఆగస్టు 16: హర్యానా ఎన్నికల నగారా మోగింది. 90 స్థానాలు ఉన్న ఈ అసెంబ్లీకి అక్టోబరు 1న ఎన్నికలు జరగనున్నాయి. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ హ్యాట్రిక్ సాధించి మరోసారి అధికారం చేపట్టాలని భావిస్తున్నది. ప్రభుత్వంపై వ్యతిరేకతను, హామీల వర్షాన్ని కురిపించి గద్దెనెక్కాలని కాంగ్రెస్ ఆశిస్తున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ, జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ), ఐఎన్‌ఎల్‌డీ సైతం పట్టు సాధించే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ బీజేపీ, కాంగ్రెస్ మధ్య కనిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని పది స్థానాల్లో ఈ రెండు పార్టీలు చెరో ఐదు స్థానాలను గెలుచుకోవడం బట్టి ఈ విషయం స్పష్టమవుతున్నది.

వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నాల్లో బీజేపీ

2014లో హర్యానాలో సొంత బలంతో అధికారంలోకి వచ్చిన బీజేపీ 2019 నాటికి మ్యాజిక్ ఫిగర్ సాధించకపోవడంతో జేజేపీతో పొత్తు పెట్టుకొని అధికారం చేపట్టింది. ఈ పొత్తు ఇప్పుడు విచ్ఛిన్నమైంది. రైతుల ఆందోళన, అగ్నివీర్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతో పాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బీజేపీకి మైనస్‌గా మారాయి. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నర ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్‌ను తప్పించి నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. అగ్నివీరులకు పలు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం కల్పించింది. కొత్తగా 10 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి రైతుల ఆగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం చేసింది.

వరాలజల్లునే నమ్ముకున్న కాంగ్రెస్

ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.6,000 పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత కలిసొస్తుందని ఆశిస్తున్నది. ఇక, ఆమ్ ఆద్మీ కూడా ఉచిత విద్య, వైద్యం, విద్యుత్తు వంటి జనాకర్షక హామీలు భారీగానే ఇచ్చింది. ఆప్, జేజేపీ, ఐఎన్‌ఎల్‌డీ కాంగ్రెస్ ఓట్లకు గండి కొట్టే సూచనలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

పదేండ్లకు ఎన్నికలు..
ప్రజాతీర్పు ఎటో?



- ఎట్టకేలకు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు మోక్షం
- తొలిసారి అధికారం చేపట్టేందుకు బీజేపీ యత్నాలు
- కమలం పార్టీ ఆశలన్నీ జమ్ము ప్రాంతం పైనే
- కశ్మీర్ లోయలో లోకల్ పార్టీల మధ్యే పోరు

శ్రీనగర్, ఆగస్టు 16: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ఎట్టకేలకు నగారా మోగింది. ఆరేండ్ల పాటు ముఖ్యమంత్రి లేకుండా కొనసాగిన ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఇక ప్రభుత్వం కొలువుదీరనుంది. 90 స్థానాల ఈ అసెంబ్లీలో పాగా వేసేందుకు జాతీయ, ప్రాంతీయ పార్టీలు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. మొదటిసారి జమ్ము కశ్మీర్‌లో సొంతంగా అధికారం చేపట్టాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు 2014లో అధికారం కోల్పోయిన జమ్ము కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఈసారి మళ్లీ అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉంది. గత ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచి నాలుగేండ్లు అధికారంలో ఉన్న మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని జమ్ము కశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) సైతం పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తున్నది.

జమ్ముపైనే బీజేపీ ఆశలు

జమ్ము ప్రాంతంపైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఇక్కడ 43 సీట్లు ఉన్నాయి. హిందువుల జనాభా ఎక్కువగా ఉండే జమ్ము ప్రాంతంలో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ ప్రభావం తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇదే రుజువైంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన 25 స్థానాలూ జమ్ము ప్రాంతంలోనివే. తాజా లోక్‌సభ ఎన్నికల్లో జమ్ములోని రెండు స్థానాలనూ బీజేపీ గెలుచుకుంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జమ్ములో ఆరు స్థానాలు పెరగడం బీజేపీకి కలిసొస్తుందనే అంచనాలు ఉన్నాయి. మొత్తం 50 స్థానాలపై బీజేపీ దృష్టి సారించింది. వీటిల్లోనే మేజిక్ ఫిగర్‌ను చేరుకునేన్ని సీట్లు గెలుస్తుందా అనేది చూడాల్సి ఉంది.

కశ్మీర్‌లో స్థానిక పార్టీలదే ఆధిపత్యం

కశ్మీర్ ప్రాంతంలో 47 నియోజకవర్గాలు ఉన్నాయి. ముస్లింల జనాభా ఎక్కువగా ఉండే కశ్మీర్‌లో బీజేపీ ప్రభావం నామమాత్రంగానే ఉంది. ఇక్కడ నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ ప్రాంతంలోని మూడు స్థానాల్లో రెండింటిలో నేషనల్ కాన్ఫరెన్స్, ఒకదాంట్లో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య పొత్తు ఉంది. ఇప్పుడు ఒంటరిగా వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు కూడా కశ్మీర్ ప్రాంతంపై నేషనల్ కాన్ఫరెన్స్ గంపెడాశలు పెట్టుకుంది.

గోడ ఎక్కి పార్లమెంట్‌లోకి యువకుడు

- అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు
- బయటపడ్డ భద్రతా లోపం

న్యూఢిల్లీ, ఆగస్టు 16: పార్లమెంట్ భవనంలో భద్రతా లోపం మరోసారి బయటపడింది. 20 ఏండ్ల వయసున్న యువకుడొకరు గోడ ఎక్కి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఆ యువకుడు గోడ ఎక్కి పార్లమెంట్ అనెక్స్ భవన ప్రాంగణంలోకి దూకాడు. పార్లమెంట్ భద్రతను పర్యవేక్షిస్తున్న సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది అప్రమత్తమై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అరెస్ట్ చేసి ఢిల్లీలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడి వద్ద అనుమానాస్పద వస్తువులేవీ లేవు. అతడిని యూపీలోని అలీగఢ్‌కు చెందిన మనీశ్‌గా గుర్తించారు. అతను మతిస్థిమితం లేనివాడిలా కన్పిస్తున్నాడని, అతని పేరును కూడా సరిగ్గా చెప్పలేకపోయాడని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కేంద్ర బలగాలు కూడా అతడిని ప్రశ్నిస్తున్నాయని ఆ అధికారి చెప్పారు.

పూజా ఖేద్కర్‌లానే మరో 22 మంది?

ఆర్టీఐ కార్యకర్త ఆరోపణ

ముంబై, ఆగస్టు 16, (నమస్తే తెలంగాణ): నకిలీ సర్టిఫికెట్లతో ఐఏఎస్ ఉద్యోగం పొందిన పూజా ఖేద్కర్ లానే దేశంలో మరో 22 మంది అధికారులు ఉన్నారని మహారాష్ట్రకు చెందిన ఆర్టీఐ కార్యకర్త విజయ్ కుంభార్ ఆరోపించారు. వీరు కుల, జన్మ ధ్రువీకరణ, వైకల్యం వంటి వాటికి నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాలు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఇలా నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారు ఇప్పుడు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్, ఐఎఫ్‌ఎస్‌గా పని చేస్తున్నారని చెప్పారు. ఈ అధికారులపై విచారణ జరిపించాలని ఆయన కోరారు.

లేఆఫ్ ప్రకటించారని.. సీఈవో పాస్‌పోర్ట్ చోరీ

బెంగళూరు: లేఆఫ్ ప్రకటించారన్న కోపంతో మాజీ ఉద్యోగి ఒకరు తన పాస్‌పోర్టు, అమెరికా వీసాను దొంగిలించినట్టు బెంగళూరుకు చెందిన స్టార్టప్ 'సార్థి ఏఐ' సీఈవో విశ్వనాథ్ ఝా ఆరోపించారు. సంస్థను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు అమెరికా వెళ్లి నిధులు సేకరించాలని భావించానని, అయితే, మాజీ ఉద్యోగి ఒకరు తన పాస్‌పోర్ట్, వీసాను దొంగిలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్వెస్టర్ల నుంచి ఒత్తిడి కారణంగానే ఉద్యోగులను తొలగించాల్సి వచ్చిందని చెప్పారు. సార్థి ఏఐ గతేడాది పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించింది. వారిలో దాదాపు 50 మందికిపైగా ఉద్యోగులకు ఏడాదికి పైగా వేతనాలు చెల్లించలేదని, కోర్టు నోటీసులకు కూడా స్పందించడం లేదని ఉద్యోగి ఒకరు ఆరోపించారు.

రాహుల్ పౌరసత్వాన్ని రద్దు చేయండి

ఢిల్లీ హైకోర్టులో సుబ్రమణ్యస్వామి పిల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పౌరసత్వాన్ని రద్దుచేయాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. రాహుల్‌గాంధీ తనకు తానుగా బ్రిటిష్ జాతీయుడినని ప్రకటించుకున్నారని, కాబట్టి ఆయన భారత పౌరసత్వాన్ని రద్దు చేసేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించినట్టు ఎక్స్‌లో తెలిపారు. రాహుల్‌పై చర్యలు తీసుకోవద్దని ప్రధాని మోదీని సోనియాగాంధీ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా? అని ప్రశ్నించారు. యూకేలో గతేడాది రిజిస్టర్ అయిన కంపెనీ డైరెక్టర్లలో రాహుల్ ఒకరని పేర్కొన్నారు. 2005లో ఆ కంపెనీ ఫైల్ చేసిన వార్షిక రిటర్నులో రాహుల్‌గాంధీని బ్రిటిష్ పౌరుడిగా పేర్కొన్నారని చెప్పారు.

నగరాల్లో 50 కూరగాయల క్లస్టర్లు

రైతుల నుంచి నేరుగా వినియోగదారులకు సరఫరా

ఆమోదానికి త్వరలో కేంద్ర క్యాబినెట్ ముందుకు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: దేశంలోని పలు నగరాల్లో దాదాపు 50 కూరగాయల క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ శాఖ రూపొందిస్తున్న ఈ పథకం త్వరలో కేంద్ర క్యాబినెట్ ముందుకు రానున్నట్టు సమాచారం. 20 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల సమీప ప్రాంతాల్లో ఈ వెజిటెబుల్ హబ్‌లను ఏర్పాటు చేస్తారు. ఈ స్కీమ్ ద్వారా మధ్యవర్తుల వ్యవస్థ ఉండదని, కస్టర్లకు నేరుగా కూరగాయల సరఫరా ద్వారా రైతుల సాధికారిత సాధ్యమవుతుందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. కూరగాయల ఉత్పత్తి పెరుగుతుందని, సప్లై చైన్‌లు మెరుగవుతాయని పేర్కొన్నాయి. రైతులు, వినియోగదారులకు ధరలను స్థిరీకరించడంతో పాటు ఉత్పత్తిని పెంచడం ఈ స్కీమ్ ప్రధాన లక్ష్యమని వెల్లడించాయి. ఈ కొత్త విధానం ద్వారా పెద్ద నగరాల సమీపంలో ఉండే 2 లక్షలకు పైగా రైతులు లబ్ధి పొందుతారని పేర్కొన్నాయి. రైతుల నుంచి వినియోగదారులకు డైరెక్ట్ సప్లై చైన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా మధ్యవర్తుల పాత్రను తగ్గించొచ్చని ఓ అధికారి అన్నారు.

ఎస్‌ఎస్‌ఎల్వీ-డీ3
ప్రయోగం సక్సెస్

- కక్ష్యలోకి చేరిన ఈవోఎస్-08 ఉపగ్రహం
- విపత్తు నిర్వహణలో ఈ శాటిలైట్ వినియోగం
- తేలికపాటి వాహకనౌక శ్రేణిలో ఇస్రో ముందడుగు
- వాణిజ్య ప్రయోగాలకు న్యూస్పేస్ ఇండియా సిద్ధం



ఇస్రో శాస్త్రవేత్తలకు కేటీఆర్ శుభాకాంక్షలు

ఎస్‌ఎస్‌ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతంగా జరిపిన ఇస్రో బృందానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చేపట్టిన స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(ఎస్‌ఎస్‌ఎల్వీ) మూడో, చివరి డెవెలప్‌మెంటల్ ఫ్లైట్(డీ3) ప్రయోగం విజయవంతమైంది. శుక్రవారం ఉదయం 9.17 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఈ వాహక నౌక నింగికి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే భూపరిశీలన ఉపగ్రహాన్ని(ఈవోఎస్-08) వేరు చేసి నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రోకు చెందిన యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. నిఘా, విపత్తులు, మంటలను గుర్తించడం, అగ్నిపర్వతాలను పర్యవేక్షించడం, పర్యావరణ పర్యవేక్షణకు దీనిని వినియోగిస్తారు. స్పేస్ కిడ్జ్ ఇండియా అభివృద్ధి చేసిన ఎస్‌ఆర్-ఓ డెమొశాట్ అనే మరో చిన్న ఉపగ్రహాన్ని సైతం కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ రెండు ఉపగ్రహాలు కలిపి దాదాపు 175.5 కిలోల బరువు ఉన్నాయి.

500 కిలోలు.. 500 కిలోమీటర్లు

ఇస్రో తేలికపాటి వాహకనౌక శ్రేణిలో మొదటి ప్రయోగాన్ని(డీ1) 2022 ఆగస్టులో జరపగా ఆశించిన విజయం దక్కలేదు. దీంతో 2023 ఫిబ్రవరిలో డీ2ను ప్రయోగించగా ఇది విజయవంతమైంది. చివరగా డీ3ని శుక్రవారం విజయవంతంగా ప్రయోగించింది. ఇది ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూస్పేస్ ఇండియాకు బలాన్ని ఇచ్చింది. ఇక న్యూస్పేస్ ఇండియా వివిధ దేశాలు, ప్రైవేటు సంస్థలకు చెందిన 500 కేజీల వరకు బరువున్న ఉపగ్రహాలను తేలికపాటి వాహక నౌక(ఎల్వీ) ద్వారా ప్రయోగించగలదు.

నేడు వైద్య సేవలు బంద్

- కోల్‌కతా హత్యాచార ఘటనను నిరసిస్తూ 24 గంటల ఆందోళనకు ఐఎంఏ పిలుపు
- అత్యవసరం కాని సేవలు నిలిపివేత
- అర్ధరాత్రి దవాఖానపై దుండగుల దాడి ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యమే
- మమతాబెనర్జీ సర్కారుపై హైకోర్టు ఆగ్రహం

వైద్య సిబ్బందిపై దాడి జరిగిన 6 గంటల్లో ఎఫ్ఐఆర్

వైద్య సంస్థలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనతో వైద్యసంస్థలకు కేంద్ర ఆరోగ్యశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. విధుల్లో ఉన్న వైద్యసిబ్బందిపై దాడి జరిగిన ఆరు గంటల్లోగా ఇన్‌స్టిట్యూషనల్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేస్తూ దేశంలోని అన్ని కేంద్ర ప్రభుత్వ దవాఖానలు, ఎయిమ్స్ డైరెక్టర్లకు, అన్ని మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయెల్ ఆదేశాలిచ్చారు. 'విధుల్లో ఉండగా ఏ ఆరోగ్య కార్యకర్తపైనైనా దాడి జరిగితే.. 6 గంటల్లోగా ఇన్‌స్టిట్యూషనల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే బాధ్యత వైద్య సంస్థ అధిపతిదే' అని పేర్కొన్నారు.



కోల్‌కతా/న్యూఢిల్లీ, ఆగస్టు 16: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు దేశవ్యాప్తంగా అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేయనున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. ఈ సందర్భంగా ఐఎంఏ కేంద్ర ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లు ఉంచింది. ఎయిర్‌పోర్టుల మాదిరిగా దేశవ్యాప్తంగా ఉన్న దవాఖానలను కూడా 'సేఫ్ జోన్ల'గా ప్రకటించాలని ఐఎంఏ చీఫ్ డాక్టర్ ఆర్‌వీ అశోకన్ డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బందిపై దాడుల కట్టడికి కఠిన చట్టం తీసుకురావాలన్నారు. బాధితురాలి కుటుంబానికి గౌరవప్రదమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యుల పని గంటలు, పని పరిస్థితులపై ఐఎంఏ మరో డిమాండ్ చేసింది. హత్యాచారానికి గురైన బాధితురాలు వరుసగా 36 గంటల పాటు డ్యూటీలో ఉన్నారని, ఇది సరైనదేనా? అని ప్రశ్నించారు.

ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యమే

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానపై దుండగులు సృష్టించిన విధ్వంసం కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యమేనని కలకత్తా హైకోర్టు శుక్రవారం పేర్కొన్నది. దవాఖానలో పరిస్థితిపై ఈనెల 21లోగా వేర్వేరుగా అఫిడవిట్లు సమర్పించాలని పోలీసులు, హాస్పిటల్ యాజమాన్యాన్ని చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. దవాఖాన వద్ద దాదాపు 7 వేల మంది గుమిగూడుతారన్న నిఘా వర్గాల సమాచారం పోలీసుల వద్ద లేదనడం నమ్మడం కష్టమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. 'ఇది పూర్తిగా రాష్ట్ర యంత్రాంగం వైఫల్యమే. తమ సొంత వ్యక్తులను కూడా పోలీసు బలగాలు రక్షించుకోలేకపోవడం విచారకరం' అని పేర్కొన్నది. హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యులకు తగిన రక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నది. మూకను అదుపు చేయలేక పోలీసులు గాయపడ్డారంటే, శాంతి భద్రతలు విఫలమైనట్టేనని కోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను కోర్టు ఈనెల 21కు వాయిదా వేసింది.

బీజేపీ, సీపీఎంలే చేశాయి: మమత

ఆర్‌జీ కార్ దవాఖానలో బీజేపీ, సీపీఎం పార్టీలే విధ్వంసానికి పాల్పడ్డాయని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఆధారాలను నాశనం చేసేందుకు ఆ పార్టీలు ఇలా చేశాయని అన్నారు. కోల్‌కతాలో శుక్రవారం నిర్వహించిన నిరసన ర్యాలీలో మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై వాస్తవాలు బయటకు రావాలని, అయితే కొంత మంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తి చేయిస్తున్నారని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనపై బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు, దీక్షలు చేపట్టింది.

ఎంపాక్స్ కలవరం

- ఆఫ్రికా నుంచి వేగంగా ఇతర దేశాలకు వైరస్ వ్యాప్తి
- స్వీడన్‌లో కలకలం.. పాక్‌లో మూడు కేసులు నమోదు
- గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో
- వ్యాధిసోకిన 4 రోజుల్లో టీకా వేసుకోవాలి: వైద్యులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): కరోనా విలయాన్ని చవిచూసిన ప్రపంచానికి మంకీపాక్స్ (ఎంపాక్స్) రూపంలో మరో ప్రమాదం పొంచి ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తాజాగా జారీ చేసిన గ్లోబల్ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆదేశాలను బట్టి అర్థమవుతున్నది. ఆఫ్రికా దేశాల్లో సాధారణంగా కనిపించే ఈ వైరస్.. స్వీడన్‌కూ వ్యాపించింది. తాజాగా పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో మూడు కేసులు నమోదవ్వడం ఆందోళన కలిగిస్తున్నది.

ఏమిటీ వైరస్?

మంకీపాక్స్ (ఎంపాక్స్) వ్యాధి మంకీపాక్స్ (ఆర్థోపాక్స్ వైరస్‌లో ఒక రకం) అనే వైరస్ ద్వారా వస్తుంది. డెన్మార్క్‌లో 1958లో తొలిసారిగా దీన్ని గుర్తించారు. 1970లో మొదటిసారిగా ఓ మనిషికి ఇది సోకింది. ఆఫ్రికాలోని మారుమూల ప్రాంతాల్లో మాత్రమే ఎక్కువగా కనిపించేది. దీంతో ప్రపంచ దేశాలు ఈ వైరస్‌ను నిర్లక్ష్యం చేశాయి. అయితే, 2022లో 116 దేశాలకు వ్యాపించిన ఈ వైరస్ కారణంగా 99 వేల మంది వ్యాధిబారిన పడ్డారు. దీంతో ప్రపంచ దేశాలు అలర్ట్ అయ్యాయి.

ఎందుకంత భయం?

మంకీపాక్స్ వైరస్ రెండు వేరియంట్లలో వ్యాప్తి చెందుతున్నది. క్లాడ్-1 (కాంగోబేసిన్ క్లాడ్) తొలి వేరియంట్ ప్రమాదకరమైనది. నిమోనియా, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ సమస్యలకు కారణమవుతుంది. మరణాల రేటు 10 శాతం వరకూ ఉండొచ్చు. ఇక, క్లాడ్-2 (పశ్చిమ ఆఫ్రికా క్లాడ్) వేరియంట్ తొలి వేరియంట్‌తో పోలిస్తే, కొంత తీవ్రత తక్కువగా ఉంటుంది. ఈ వేరియంట్ సోకిన వారిలో శరీరంపై పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మరణాల రేటు 1 శాతం కంటే తక్కువే. కాగా, ఇప్పుడు విజృంభిస్తున్న వైరస్.. క్లాడ్-1 వేరియంట్ రకానికి చెందినది కావడంతో డబ్ల్యూహెచ్‌వో సహా ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాగా 2022లో ప్రబలంగా విస్తరించిన వైరస్ క్లాడ్-2 వేరియంట్ రకానిది కావడంతో మరణాల రేటు తక్కువగా నమోదైంది.

ఏయే దేశాల్లో వైరస్ వ్యాప్తి

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకూ మొత్తం 14 వేల వరకూ మంకీపాక్స్ కేసులు నమోదైతే, 524 మంది మరణించారు. మొత్తం కేసుల్లో క్లాడ్-1 రకానికి చెందిన కేసులు 100కు పైగా ఉన్నాయి. తొలుత బురుండి, కెన్యా, రువాండా, ఉగాండా దేశాలకు పరిమితమైన ఈ వైరస్ కేసులు.. స్వీడన్, పాకిస్థాన్‌లోనూ నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు.

వ్యాక్సిన్‌లు ఉన్నాయా?

ప్రస్తుతం మంకీపాక్స్ నివారణకు రెండు ఎంపాక్స్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి సోకిన నాలుగు రోజుల్లోపు టీకా తీసుకొంటే మంచిదని వైద్య నిపుణులు చెప్తున్నారు. వ్యాధి సోకినప్పటికీ లక్షణాలు బయటపడని వారు 14 రోజుల్లోపు తీసుకోవాలని పేర్కొన్నారు. మంకీపాక్స్ గతంలో ఆఫ్రికా దేశాలకే పరిమితమవ్వడంతో ఈ టీకాలకు పలు దేశాలు అనుమతులు ఇవ్వలేదు. అయితే, పరిస్థితులు మారడంతో ఇప్పుడు అనుమతులనిచ్చే అవకాశం ఉన్నది.

వైరస్ వ్యాప్తి ఇలా..

నేరుగా తాకడం, శృంగారం వల్ల మంకీపాక్స్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతుంది. నోరు, ఇతర అవయవాల నుంచి వచ్చే స్రవాల వల్ల కూడా సోకే ప్రమాదం ఉంది. రోగులు వాడిన దుస్తులు, ఇతర వస్తువుల వినియోగం, పచ్చబొట్ల ద్వారా, వ్యాధి సోకిన జంతువులను తాకడం వల్ల కూడా వైరస్ వ్యాప్తి జరుగుతుంది.

లక్షణాలు ఏంటి?

వ్యాధిగ్రస్తుల చర్మంపై పొక్కులు, జ్వరం, గొంతు తడారిపోవడం, తల తిరగడం, కండరాల నొప్పులు, వెన్ను నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించవచ్చు. సాధారణంగా మనిషి శరీరంలోకి వైరస్ ప్రవేశించిన 21 రోజుల లోపు ఎప్పుడైనా లక్షణాలు బయటపడొచ్చు. మరికొందరిలో రెండు వారాల నుంచి నెలలోపు బయటపడొచ్చు.

పాదాలకు రక్ష

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇంటా, బయటా ఎక్కడ చూసినా తడిగానే ఉంటుంది. నిరంతరం నీళ్లలో, తేమతో కూడిన నేలపై నడవడం వల్ల పాదాలకు ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య అధికం. ఫ్లోర్ క్లీనర్లు, సబ్బు, డిటర్జంట్ వంటి వాటి తయారీలో వాడే రసాయనాల వల్ల పాదాల ఆరోగ్యం మరింత దెబ్బతింటుంది. ఈ టిప్స్ ఫాలో అయితే.. మీ పాదాలకు రక్షణ లభిస్తుంది.



గోరు వెచ్చని నీటిలో ఎప్సమ్ సాల్ట్, వెనిగర్ వేసి పాదాలను పదిహేను నిమిషాలు ఉంచాలి. రోజూ రాత్రి పడుకునే ముందు ఈ విధంగా చేస్తే కాలి పగుళ్లు తగ్గుతాయి. అంతేకాదు ఇలా చేయడం వల్ల పాదాల చర్మం మృదువుగా అవుతుంది.

పచ్చిపాలలో రెండు స్పూన్ల చక్కెర కలిపి పాదాలు, అరికాళ్లకు బాగా మర్దనా చేయాలి. పది నిమిషాల తర్వాత కడిగేసుకుని పెట్రోలియం జెల్లీ రాసుకోవాలి. తరచూ ఇలా చేయడం వల్ల పొడిబారిన పాదాలకు తేమ అంది మృదువుగా మారతాయి.

నిమ్మరసంలో ఒక స్పూన్ ఉప్పు కలిపి పది నిమిషాలపాటు పాదాలకు మర్దనా చేయాలి. పావుగంట తర్వాత చల్లటి నీళ్లతో కడిగేసుకుని మాయిశ్చరైజర్ రాసుకోవాలి. నిమ్మరసంలోని విటమిన్ సి.. యాంటీఫంగల్ లక్షణాలను కలిగి ఉంటుంది. దానివల్ల మీ పాదాలను ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకోవచ్చు.

రెండు చెంచాల తేనెలో చెంచా పసుపు కలిపి పాదాలకు పట్టించాలి. అరగంట య్యాక చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకో వాలి. పాదాలకు తేనె తేమనిచ్చి మృదువుగా మారుస్తుంది. ఇన్ఫెక్షన్లను దూరం చేస్తుంది కూడా!

హైదరాబాద్ | శనివారం 17 ఆగస్టు 2024 www.ntnews.com

నటిగా నిలిచాను.. నిర్మాతగా గెలుస్తాను!

అక్కకోసం ప్రయత్నిస్తే అవకాశం చెల్లిని వరించింది. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని తొమ్మిదో తరగతిలోనే నట ప్రయాణం ప్రారంభించింది. అది మొదలు రెండు దశాబ్దాలుగా వరుస సినిమాలు, సీరియల్స్‌లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న నటి **శ్వేతా షైన్**. 'చక్రవాకం', 'సిరిమల్లె పువ్వు' లాంటి సీరియల్స్‌తో మంచి పేరు తెచ్చుకున్న శ్వేత.. యమదొంగ లాంటి సూపర్ హిట్ సినిమాలోనూ నటించి మెప్పించింది. జీ తెలుగు 'పడమటి సంధ్యారాగం'లో నటిగా ప్రేక్షకులను అలరిస్తూనే 'మేఘసందేశం' సీరియల్‌కు ప్రొడ్యూసర్‌గానూ వ్యవహరిస్తున్నది. నటిగా రాణించిన చోటే నిర్మాతగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్న శ్వేత 'జిందగీ'తో పంచుకున్న కబుర్లు..

మా అమ్మది వైజాగ్, నాన్నది ఒడిశా. వైజాగ్‌లో మూడో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత ఒడిశాకు షిఫ్ట్ అయ్యాం. నాకు ఇద్దరు అక్కలు, ఒక అన్నయ్య. అక్కకు నటనంటే ఇష్టం. హీరోయిన్ అవ్వాలని అనుకుంది. నేను తొమ్మిదో తరగతిలో ఉండగా హైదరాబాద్‌కు వచ్చి అక్కకు సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించాం. అక్కకోసం ఫొటోషూట్ చేసినప్పుడు, మేమిద్దరం ఒక ఫొటో దిగాం. దాన్ని చూసిన డైరెక్టర్ నాకు సీరియల్లో అవకాశం ఇచ్చారు. అలా అనుకోకుండా పరిశ్రమలో అడుగుపెట్టా. నా మొదటి సీరియల్ 'చక్రవాకం'. నిజానికి మొదటి ప్రాజెక్ట్ ఒప్పుకొన్నప్పుడు పరిశ్రమలో స్థిరపడాలనే ఆలోచన లేదు. పదిరోజులే షూటింగ్.. ఆ తర్వాత వెళ్లిపోవచ్చు అనుకున్నా. కానీ నా పాత్రకు వచ్చిన ఆదరణ వల్ల దాదాపు లీడ్ రోల్‌గా మార్చేశారు. దాంతో నటనే నా కెరీర్‌గా మారిపోయింది.

నటన తెలియకుండానే..

ఇండస్ట్రీకి 2004లో వచ్చాను. అప్పటినుంచి కనీసం ఒక నెలరోజులు కూడా ఖాళీగా లేను! ఒకదాని తర్వాత ఒకటి వరుసగా అవకాశాలు పలకరిస్తూనే ఉన్నాయి. నాన్న నన్ను లా చదివిద్దామనుకున్నారు. నాకు ఆటలంటే ఇష్టం ఉండేది. కబడ్డీ, ఖోఖో, హై జంప్, రన్నింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. నటనంటే ఏంటో తెలియకుండానే తెరకు పరిచయమయ్యాను. ఇక్కడే అన్నీ నేర్చుకున్నాను. నేను ఆర్టిస్ట్‌గా ఎదగడం వల్లే నా కుటుంబం స్థిరపడింది. అందుకే నాకు పరిశ్రమ అంటే ఎప్పుడూ గౌరవమే. ప్రొడ్యూసర్‌గా మారి నాలాంటి మరికొందరికి పని కల్పించాలని అనుకున్నాను.

అన్ని పాత్రల్లో..

ఇప్పటివరకు దాదాపు 15 సినిమాల్లో చేశాను. చాలా చిత్రాలకు ఆఫర్లు వచ్చాయి. ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. కానీ, సీరియల్స్‌లో ఉన్నంత కంఫర్ట్ సినిమాల్లో లేదనిపించింది. అందుకే ఒప్పుకోవడం లేదు. సీరియల్స్‌లో లాంగ్ జర్నీ ఉంటుంది. సినిమా అలా కాదు.. మనకు ఒక పదిరోజులో, ఐదురోజులో కాల్ షీట్ ఉంటుంది. అది అయ్యిందంటే సినిమాతో, యూనిట్‌తో సంబంధం ఉండదు. కానీ, సీరియల్లో అలా కాదు. షూటింగ్ మొదలైనప్పుడు అందరం కొత్తకొత్తగా ఉన్నా కొన్నాళ్లు పోయేసరికి ఓ కుటుంబంలా మారిపోతాం. పాజిటివ్, నెగెటివ్ అనే తేడా లేకుండా దాదాపు అన్ని రకాల పాత్రలూ పోషించా. పదహారేండ్ల వయసులోనే పాతికేండ్ల కుర్రాడికి అమ్మగా నటించా. 2016లో దూరదర్శన్‌లో ప్రొడ్యూసర్‌గా ఓ ప్రాజెక్ట్ చేశా. మళ్లీ ఇప్పుడు 'మేఘసందేశం' సీరియల్‌కు నిర్మాతగా వ్యవహరిస్తున్నా. ఇది కాస్త లైన్లో పడ్డాక ఇంకో ప్రాజెక్ట్ మొదలుపెట్టే ఆలోచనలోఉన్నా. ఆర్టిస్ట్‌గా ఉన్నప్పుడు డబ్బులు తీసుకునేదాన్ని. ఇప్పుడు నేనే ఆర్టిస్టులకు డబ్బులు ఇస్తున్నా అంతే తేడా!

శ్రావణం ప్రత్యేకం

శ్రావణ మాసం వచ్చిందంటే ఇల్లంతా పండగ వాతావరణం ఉంటుంది. పొద్దున్న 4 గంటలకే లేచి పూజచేసి పాపకు అన్నీ సర్దిపెట్టాకే షూటింగ్‌కు వెళ్తాను. శ్రావణ మాసం పూజలు, వ్రతాలతోపాటు వినాయక చవితి, దసరా బాగా సెలెబ్రేట్ చేసుకుంటాం. నా అభిమానులే నా కుటుంబం. వాళ్ల ఆదరణతోనే పరిశ్రమలో నిలదొక్కుకున్నా. నా ప్రతి విజయం వెనుక వాళ్లే ఉన్నారు. సీరియళ్లలో నేను పోషించిన పాత్రల గురించి నా యూట్యూబ్ ఛానెల్ వీడియోస్ కింద కామెంట్లు పెడుతుంటారు. బయటికి వెళ్లినప్పుడు కూడా చాలామంది గుర్తుపట్టి ప్రేమగా పలకరిస్తారు. అభిమానుల ఆదరణ, దేవుడి దయ వల్ల ప్రొడ్యూసర్‌గానూ ఉన్నతస్థాయికి ఎదగాలని కోరుకుంటున్నా.



చిన్నతెర

ఒక ప్రాజెక్టు జయాపజయాలు డైరెక్టర్, రైటర్ మీద ఆధారపడి ఉంటాయి. నా వరకు.. ఏ పాత్ర ఇచ్చినా దానికి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాను. కమిట్‌మెంట్‌తో పనిచేస్తే అవకాశాలు తప్పకుండా వస్తాయి. పరిశ్రమలో చాలామంది శ్రేయోభిలాషులు ఉన్నారు. ఖాళీ సమయం దొరికితే కుటుంబానికే కేటాయిస్తాను. పాపతో ఎక్కువ సమయం గడుపుతా. ఏడాదికోసారైనా కుటుంబంతో విహారానికి వెళ్తాను. ప్రపంచం మొత్తం చుట్టేయాలని ఉంది కానీ కుదరట్లేదు. కనీసం మన దేశంలోని దేవాలయాలన్నీ దర్శించుకోవాలని అనుకుంటున్నా.

.. హరిణి

ఫిట్‌నెస్ కోసం వర్కవుట్లు చేయడం మామూలే! అయితే ఎక్సర్‌సైజ్ చేసిన తర్వాత శరీరానికి అవసరమైన పోషకాలు అందించాలి. ప్రొటీన్లు ఎక్కువగా లభించే ఆహారం తీసుకోవాలి. గుడ్లు, చికెన్, పప్పుధాన్యాల్లో మాంసకృత్తులు అధికంగా లభిస్తాయి. వర్కవుట్ల తర్వాత ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోకపోతే ఫలితం అంతంతమాత్రమే అంటున్నారు నిపుణులు. అందుకే, వ్యాయామం ముగిసిన గంటలోపు ప్రొటీన్ ఫుడ్ తీసుకోవడం వల్ల కండరాలు గట్టిపడటంతో పాటు సత్వర శక్తి వస్తుందని చెబుతున్నారు.

వర్కవుట్ల తర్వాత ఇలా..

వర్కవుట్ సెషన్ తర్వాత స్వల్ప కాల వ్యవధిని అనబాలిక్ విండోగా పిలుస్తారు. ఈ సమయంలో వ్యాయామం చేసిన వ్యక్తి కండరాల ఎదుగుదలకు, రికవరీకి ప్రొటీన్ ఫుడ్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్కవుట్స్ సమయంలో కండరాలు సున్నితంగా మారతాయి. కొన్నిసార్లు అవి నొప్పి కూడా కలిగిస్తాయి. ప్రొటీన్లు కలిగిన ఆహారం తింటే కండరాలు శక్తిని పుంజుకుంటాయి. అనబాలిక్ విండో ప్రభావం 24 గంటలపాటు ఉంటుందని మరికొందరి మాట. అందుకే రోజులో ఏ సమయంలోనైనా ప్రొటీన్ ఫుడ్ తీసుకోవచ్చనీ చెబుతున్నారు. రోజులో కావాల్సిన ప్రొటీన్ ఒకేసారిగా కాకుండా, మూడు-నాలుగు దఫాలుగా తీసుకుంటే మంచిదని అంటున్నారు. అల్పాహారం, భోజనం, స్నాక్స్‌లో ప్రొటీన్ కంటెంట్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. వర్కవుట్ల తర్వాత ఈ పదార్థాలు తీసుకుంటే శరీరానికి తగినన్ని ప్రొటీన్లు లభిస్తాయి.



గుడ్డు మంచి ప్రొటీన్‌ను అందిస్తుంది. ఒకటి, రెండు ఉడకబెట్టిన గుడ్లు తిని, గ్లాసెడు పాలు తాగితే ఎనర్జిటిక్‌గా ఉంటారు.

కొబ్బరినీళ్లు, మునగాకు పొడి కలుపుకొని తాగినా శరీరానికి ప్రొటీన్లు అందుతాయి.

గుప్పెడు నానబెట్టిన బాదం పప్పు, కప్పు పెరుగు తీసుకోవచ్చు.

బీట్‌రూట్‌లో పోషక విలువలు అధికంగా ఉంటాయి. కండరాల పటుత్వానికి ఇవి దోహదం చేస్తాయి. బీట్‌రూట్ ముక్కలు గానీ, జ్యూస్ గానీ తీసుకుంటే మంచిది.

ఉడికించిన శనగలు అంటే శరీరానికి ప్రొటీన్లు సమృద్ధిగా అందుతాయి.

సత్తుపిండి సత్వర శక్తిని ఇస్తుంది. కండరాలు బలోపేతం కావడానికి దోహదం చేస్తుంది.



అన్ని రంగాల్లో ఆధునిక సాంకేతికత విస్తరిస్తున్నా.. అన్నం పెట్టే రైతన్నకు అది అందని ద్రాక్షగానే ఉంటున్నది. అందుకే ఆమె.. టెక్నాలజీకి వాణిజ్య ప్రయోజనాలు జోడించి.. అన్నదాతకు అండగా నిలుస్తున్నారు. 'న్యాస్తా గ్రామోజ్వల' పేరిట స్టార్టప్ ప్రారంభించి బీడువారిన పొలాల్లో డిజిటల్ జల్లు కురిపిస్తున్నారు. నీటి నిర్వహణను సులభతరం చేస్తూ రైతుకు ఊతమిచ్చేందుకు నలుగురితో కలిసి ఈ సంస్థను నెలకొల్పారు. స్మార్ట్ ఫార్మింగ్‌కు బాటలు పరుస్తున్న 'న్యాస్తా గ్రామోజ్వల' వ్యవస్థాపకుల్లో ఒకరైన **బాల భార్గవి** స్టార్టప్ జర్నీ ఆమె మాటల్లోనే..



రైతన్నకు స్మార్ట్ దన్ను

స్టార్టప్ స్టోరీస్

సంప్రదాయ వ్యవసాయంలో ఫలసాయం తక్కువ! అన్నం పెట్టే రైతన్న ఆకలి తీరాలంటే.. సేద్యంలో సాంకేతికత జోక్యం అవసరం అనిపించింది. అందుకే డిజిటల్ ప్రోత్సాహం అందించేలా అగ్రిటెక్ ఆధారిత స్టార్టప్‌తో ఆంత్రప్రెన్యూర్ అవతారమెత్తాను. ఎంటెక్ చేసే రోజుల్లోనే రైతులకు స్వదేశీ పరిజ్ఞానంతో పనిచేసే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పం ఉండేది. ఆ ఆలోచన నుంచి పుట్టిందే.. న్యాస్తా గ్రామోజ్వల (https://nyasta.in/). దేశీయ వ్యవసాయరంగాన్ని టెక్నాలజీ బాట పట్టించడమే మా ఉద్దేశం. మిథిలేశ్ బోయిన, ప్రశాంత్ రెడ్డి, నరోత్తం రెడ్డి, రాజ్ వీకేతో కలిసి ఈ సంస్థను ప్రారంభించాం.

సాగుకు నీరే మూలం..

సాగు దిగుబడి పెరగాలంటే నీటి నిర్వహణ చాలా ముఖ్యం. నీటి వసతి ఎంత ఉందన్నది కాదు.. ఉన్న వనరులను ఎంత సమర్థంగా నిర్వహించామన్నది చాలా ప్రధానం. నీటి వృథాను నియంత్రించడం వల్ల పెట్టుబడి వ్యయం చాలావరకు తగ్గుతుంది. అలాగే సహజ వనరుల దుర్వినియోగాన్ని అడ్డుకున్నట్టూ అవుతుంది. రైతులకు డిజిటల్ పరిజ్ఞానం లేకపోయినా, చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ఆధారంగా పనిచేసే సాంకేతికతను అభివృద్ధి చేశాం. పంపుసెట్లు, బావుల వద్దకు రైతులు వెళ్లకుండానే టెక్నాలజీ సాయంతో నీటి నిర్వహణ చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ తరహా టెక్నాలజీ ఉన్నా.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారంగా పనిచేసే అధునాతన సాంకేతికతతో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. క్లౌడ్ కంప్యూటింగ్ సాయంతో ఆధునిక డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను మార్కెట్‌లోకి తీసుకొచ్చాం. రైతులు ఫోన్ కాల్, ఎస్ఎంఎస్, ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా పంపు సెట్లను నిర్వహించుకోవచ్చు. ప్రతి కరెంట్ మోటర్ ప్రత్యేకమైన ఐవీఆర్ఎస్ విధానం ద్వారా పనిచేస్తుంది.

వ్యవసాయానికి ఐఓటీ



ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సాంకేతికతను ఇప్పుడు అన్ని రంగాల్లోనూ విస్తృతంగా వినియోగిస్తున్నారు. వ్యవసాయంలోనూ దీన్ని ఉపయోగిస్తే మెరుగైన ఫలితాలు పొందొచ్చు. ఐఓటీతో అనుసంధానం చేయడం ద్వారా.. పంటల నిర్వహణ మరింత సులభతరం అవుతుంది. స్మార్ట్ ఫార్మింగ్ ద్వారా రైతులకు పనిభారం తగ్గుతుంది. స్మార్ట్ మోటర్ మేనేజ్‌మెంట్, స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, స్మార్ట్ ఆక్వాకల్చర్, స్మార్ట్ క్రాప్ మేనేజ్‌మెంట్ వంటి టెక్నాలజీలతో పాటు, డ్రిప్ ఇరిగేషన్‌కూ సాంకేతికతను జోడించాం. ఇది ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న సాంకేతికత కన్నా చౌక! పైగా మరింత సమర్థంగా పనిచేస్తుంది. మార్కెట్‌లో దొరికే నీటి నిర్వహణ వ్యవస్థలను సాధారణ, సన్నకారు రైతులు ఏర్పాటు చేసుకోవడం అధిక వ్యయంతో కూడుకున్న పని. కానీ, 'న్యాస్తా' అభివృద్ధి చేసిన స్మార్ట్ ఫార్మింగ్, వాటర్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ.. ఈ ఖర్చుల భారాన్ని 70 నుంచి 80 శాతం వరకు తగ్గిస్తుంది. ఫలితంగా రైతు వ్యవసాయంలో చక్కటి ఫలసాయం పొందుతాడని విశ్వసిస్తున్నాం.

... కడార్ల కిరణ్

యూట్యూబ్ ఇలా చూశారా?

రోజంతా టీవీ చూడకుండా అయినా ఉంటామేమో గానీ, యూట్యూబ్ చూడకుండా పూట గడవడం కష్టంగా మారింది! ఎప్పుడూ చూసేదే అయినా.. కాస్త కొత్తగా ఎందుకు ట్రై చేయొద్దు చెప్పండి! ఇకపై యూట్యూబ్‌ను ఇలా కొత్తగా చూడండి. అందుకు ఒక ప్రత్యేక 'ఎక్స్‌టెన్షన్'ని క్రోమ్ వెబ్‌స్టోర్ నుంచి బ్రౌజర్‌కి జత చేయవచ్చు. Enhancer for YouTube.. దీన్ని యాడ్ చేసుకున్నాక యూట్యూబ్ ప్లేయర్‌లో కొత్త ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిని వాడుకుని డెస్క్‌టాప్‌పై మీ పనికి తగినట్టుగా ప్లేయర్‌ని సెట్ చేసుకుని హ్యాపీగా వీడియోలు చూడొచ్చు. ఇంకా వివరంగా చెప్పాలంటే..



ఎక్స్‌టెన్షన్‌ని బ్రౌజర్‌కి జత చేయగానే వరుసగా కంట్రోల్ బటన్స్ కనిపిస్తాయి. డీఫాల్ట్‌గా ప్లేయర్‌లో ఉండే వాటికి భిన్నంగా ఈ కంట్రోల్స్ పనిచేస్తాయి. ఎలాగంటే.. ప్లే అవుతున్న వీడియో మాత్రమే కనిపించాలి. మిగతావన్నీ కనిపించకుండా తెర మొత్తం చీకటైపోవాలంటే.. అందుకు 'సినిమా మోడ్' ఎంచుకోవచ్చు. తెరమొత్తం వీడియో ప్లే చేయాలంటే 'ఎక్స్‌పాండ్' చేసుకునే కంట్రోల్ ఉంది. తక్కువ సౌండ్‌తో ప్లే అవుతున్న వీడియోల వాల్యూమ్‌ని పెంచుకునే వెసులుబాటు కూడా ఉంది. అంతే కాదు.. వీడియోలో ఏదైనా ఫ్రేమ్‌ని ఫొటో తీయాలనుకుంటే 'క్లిక్'మనిపించొచ్చు. ఇక చివరిగా.. 'పాప్ అప్ ప్లేయర్'. ఇది చాలా ప్రత్యేకం. ఇప్పటివరకూ మీరు వీడియోలను యూట్యూబ్ ట్యాబ్‌లోనే ప్లే చేసి ఉంటారు. అలాకాకుండా.. ప్లే అవుతున్న వీడియోని బయటికి లాగేసి.. తెరపై మీకు కావాల్సిన చోట పెట్టుకుని ప్లే చేసుకుంటే? చాలా సుఖంగా అనిపిస్తుంది కదా..! డెస్క్‌టాప్‌పై పని ఓ పక్కా.. ప్లేయర్ మరో పక్కా.. సెట్ అయిపోతుంది. ప్లేబ్యాక్ వీడియో క్వాలిటీని కూడా డిఫాల్ట్‌గా సెట్ చేయొచ్చు. మరిన్ని భిన్నమైన ఆప్షన్లు ఉన్నాయి. ఏక్ బార్ ట్రై కరో!! https://rb.gy/ciqf4u లింక్‌లోకి వెళ్లి Enhancer for YouTube మీ బ్రౌజర్‌కి జత చేయండి.

ట్రై కరో!



జంటగా సాధించాలి

శ్రావణ మాసంలో కొత్తగా జట్టుకట్టిన జంటలు ఎన్నో! కొంగుముడి వేసుకొని కొత్త జీవితంలోకి అడుగు పెడుతున్న నూతన దంపతులకు జీవితంపై బోలెడన్ని అంచనాలు ఉంటాయి. తమ జీవన యానం ఆనందంగా సాగాలనీ, ఒకరికొకరు తోడుగా ఉండాలనీ భావిస్తూ ఉంటారు. ఆ ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరాలంటే మాత్రం ఈ సూత్రాలు గుర్తుంచుకోండి..



కొత్తజంట మొదటి లక్ష్యం బంధాన్ని బలపరుచుకోవడమే కావాలి. అందుకు కొన్నాళ్ల సమయం పడుతుంది. మూడు నెలలు పట్టొచ్చు, ఆరు మసాలు కావొచ్చు, కొన్నిసార్లు ఏడాది దాటొచ్చు. ఒకరినొకరు త్వరగా అర్థం చేసుకోవాలంటే మీ మధ్య అపార్థాలకు ఏమాత్రం తావివ్వకూడదు. మీ భాగస్వామి ఉద్దేశాన్ని ముందుగానే ఊహించుకోవద్దు. సందేహాలు ఉంటే అడగడం తప్పు కాదు. అది సందేహ నివృత్తి కోసం అడిగినట్టు ఉండాలి కానీ, శల్యపరీక్ష కాకూడదు.

ప్రతిరోజూ ప్రశాంతంగా గడవాలని కోరుకోవాలి. అందుకోసం మీ భాగస్వామి నుంచి ఏం ఆశిస్తున్నారో.. వాళ్లకూ మీరు అదే అందించాలి. సంతోషాలనే కాదు, బాధ్యతలనూ గుర్తించడం అవసరం. అలకల వరకు ఓకే కానీ, గొడవలకు దారి తీయొద్దు. కోపతాపాలు పొడచూపినా.. మాటలకు కళ్లెం వేయద్దు. మౌనం పరిష్కారం కాకపోగా, మరో సమస్యకు దారితీయొచ్చు. అందుకే మనసారా మాట్లాడుకుంటూ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయండి.

భాగస్వామికి సరైన ప్రాధాన్యం ఇవ్వడం తప్పనిసరి. మీ ఆలోచనలు, ఆశయాలు వారితో పంచుకోండి. వారి సహకారం ఆశించండి. అదే సమయంలో వారి లక్ష్యాలేమిటో తెలుసుకోండి. ఆ లక్ష్యసాధనలో తన వెంట ఉంటానని నమ్మకంగా చెప్పండి. అప్పుడు ఇద్దరి మాట, బాట ఒకటవుతాయి. ఒంటరిగా డీల్ చేస్తే తేలికైన పని కూడా జటిలం అవుతుంది. జంటగా కష్టపడితే.. కష్టతరమైన పనికూడా తేలిక అవుతుందని మర్చిపోకండి.



తుర్కియే పార్లమెంటులో ఎంపీల బాహాబాహీ

ఇస్తాంబుల్ : తుర్కియే పార్లమెంటులో శుక్రవారం అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం దాడులు చేసుకున్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వర్కర్స్ పార్టీ నేత క్యాన్ అటలే పార్లమెంటు డిప్యూటీగా ఎన్నికయ్యారు. అయితే ఆయన 2013లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు సంబంధించిన కేసులో జైలు శిక్షను అనుభవిస్తున్నారు. పార్లమెంటుకు హాజరయ్యేందుకు తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. రాజ్యాంగ కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై శుక్రవారం పార్లమెంటులో జరిగిన చర్చ భౌతిక దాడులకు దారి తీసింది. వర్కర్స్ పార్టీ సభ్యుడిని అధికార పార్టీ సభ్యుడు కొట్టినట్లు వీడియోలో కనిపించింది. చివరికి ఓ మహిళా సభ్యురాలిని కూడా రక్తం కారేలా కొట్టారు. ఈ వీడియోలు వైరల్‌గా మారాయి.

25 కిలోల బంగారంతో బ్యాంక్ మేనేజర్ పరారీ

అసలు బంగారం స్థానంలో నకిలీ నగలు

కోజీకోడ్, ఆగస్టు 16: తాకట్టు పెట్టిన 25 కిలోల బంగారంతో బ్యాంక్ మేనేజర్ పరారైన ఘటన కేరళలో జరిగింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వడకర బ్రాంచిలో సుమారు 17 కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని బ్యాంక్ మేనేజర్ మధు జయకుమార్ అపహరించాడు. ప్రస్తుత మేనేజర్ ఇర్షాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వడకర పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. మధు జయకర్ 2023 జూన్ నుంచి 2024 జూన్ వరకు మేనేజర్‌గా పనిచేసి కొచ్చి బ్రాంచికి బదిలీ అయ్యారు. అయితే అతను ఆ బ్రాంచిలో జాయిన్ కాలేదు. తాకట్టులో ఉన్న బంగారం స్థానంలో నకిలీ నగలు ఉన్నట్టు కొత్తగా వచ్చిన మేనేజర్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోల్డెన్ వీసాపై సంపన్నుల చూపు

- భారతీయ ధనికులను ఆకర్షిస్తున్న గోల్డెన్ వీసా
- టాలెంట్, డబ్బులు ఉంటే పిలిచి ఇస్తున్న యూఏఈ
- దక్కిందంటే దుబాయి బాట పట్టేందుకు సిద్ధం
- ఆర్థిక, వృత్తిపరంగా ఎదిగేందుకు అవకాశాలు

దుబాయి, ఆగస్టు 16: అంతర్జాతీయ పెట్టుబడులు, నిపుణులను ఆకర్షించేందుకు యూఏఈ ప్రభుత్వం ఇస్తున్న గోల్డెన్ వీసాలకు భారత్‌లో క్రేజ్ పెరుగుతున్నది. ఆర్థికంగా, వృత్తిపరంగా ఎదిగేందుకు కొత్త అవకాశాలను వెతుక్కుంటూ యూఏఈ గోల్డెన్ వీసా కోసం ప్రయత్నిస్తున్న భారతీయుల సంఖ్య ఎక్కువవుతున్నది. వివిధ రంగాల్లో నిపుణులు, పెట్టుబడులు పెట్టగలిగిన వారికి యూఏఈ రెడ్ కార్పెట్ పరిచి మరీ స్వాగతిస్తున్నది. స్వయంగా వచ్చి గోల్డెన్ వీసాలను అందిస్తున్నది. దీంతో భారత్ నుంచి వెళ్లి విదేశాల్లో స్థిరపడేందుకు సిద్ధమవుతున్న సంపన్నుల్లో చాలామందికి గమ్యస్థానంగా యూఏఈ మారుతున్నది. అంతర్జాతీయ పెట్టుబడి వలసల కన్సల్టెన్సీ సంస్థ హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ జూన్ నివేదిక ప్రకారం 2024లో 4,300 మంది భారతీయ సంపన్నులు దేశం వీడనున్నారు. వీరిలో చాలామంది గోల్డెన్ వీసా తీసుకొని యూఏఈలో స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు.



గోల్డెన్ వీసా ఎవరికి ఇస్తారు ?

- యూఏఈ వైద్య శాఖ, వివిధ శాస్త్రవేత్తల కమిటీల అనుమతితో వైద్యులు, శాస్త్రవేత్తలకు ఈ వీసా ఇస్తారు.
- సాంస్కృతిక, కళల విభాగం అనుమతితో కళాకారులకు, కళా రంగాల నిపుణులు గోల్డెన్ వీసా పొందొచ్చు. ఎక్కువగా మలయాళీ నటులు ఈ వీసా తీసుకుంటున్నారు.
- డిగ్రీ పట్టా, ఐదేండ్ల పని అనుభవం, కనీసం 50 వేల అరబ్ ఎమిరేట్స్ దిర్హమ్‌ల(ఏఈడీ)(రూ.11,42,808) నెలవారీ జీతం ఉన్న ఉద్యోగులు గోల్డెన్ వీసాకు అర్హులు.
- 20 లక్షల దిర్హమ్‌లు ప్రభుత్వానికి డిపాజిట్ చేసి, 2.50 లక్షల దిర్హమ్‌లు పన్ను రూపంలో కట్టి యూఏఈలో వ్యాపారాన్ని స్థాపించాలనుకునే పెట్టుబడిదారులకు ఈ వీసా ఇస్తారు.
- ఐదు లక్షల దిర్హమ్‌ల విలువైన వ్యాపారం ఉన్న వ్యాపారవేత్తలు కూడా గోల్డెన్ వీసాలు పొందొచ్చు.

గోల్డెన్ వీసాతో ప్రయోజనాలు ఏంటి ?

యూఏఈ ప్రభుత్వం 2019 నుంచి గోల్డెన్ వీసాలు ఇవ్వడం ప్రారంభించింది. అధికారిక వెబ్‌సైట్ ప్రకారం గోల్డెన్ వీసా పొందిన వారికి అనేక సదుపాయాలు కలుగుతాయి.

- వీరికి స్థానిక స్పాన్సర్ లేనప్పటికీ దీర్ఘకాలం యూఏఈలో నివసించేందుకు అనుమతి లభిస్తుంది.
- యూఏఈలోని ఏడు ఎమిరేట్లు అబుదాబీ, అజ్మన్, దుబాయి, ఫుజైరాహ్, రాస్ అల్ ఖైమా, షార్జా, ఉమ్ అల్ కువైన్‌లో ఉద్యోగం, వ్యాపారం చేసుకుంటూ జీవించవచ్చు.
- గోల్డెన్ వీసా ఉంటే ఎప్పుడైనా యూఏఈకి సులువుగా వెళ్లిరావచ్చు.
- వ్యాపారవేత్తలకు అనువైన అనేక సౌలభ్యాలు కలుగుతాయి. స్థాపించే వ్యాపారాలపై పూర్తి యాజమాన్య హక్కు ఉంటుంది.
- గోల్డెన్ వీసా ఉన్న వారు కుటుంబసభ్యులు, కార్మికులు యూఏఈకి వచ్చేందుకు స్పాన్సర్ చేయవచ్చు.



థాయ్‌లాండ్ ప్రధానిగా పెటోంగ్టార్న్ షినవత్ర

బ్యాంకాక్: థాయ్‌లాండ్ నూతన ప్రధానిగా పెటోంగ్టార్న్ షినవత్ర (37)ను పార్లమెంటు శుక్రవారం ఎన్నుకుంది. ఆమె మాజీ ప్రధాని తక్సిన్ షినవత్ర కుమార్తె. షినవత్ర కుటుంబంలో ఈ పదవిని చేపట్టినవారిలో పెటోంగ్టార్న్ మూడో వ్యక్తి. ప్రధాని పదవిని చేపట్టడానికి దిగువ సభలో కనీసం 247 మంది సభ్యుల మద్దతు అవసరం. ఫ్యూ థాయ్ పార్టీ నేతృత్వంలోని 11 పార్టీల కూటమికి 314 మంది సభ్యుల మద్దతు ఉంది. వీరు పెటోంగ్టార్న్‌కు మద్దతు తెలిపారు. ఆమె నేతృత్వంలో ఈ కూటమి మరింత బలపడుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రధాని పదవి నుంచి స్రేట్ట తవిసిన్‌ను బుధవారం కోర్టు తొలగించడంతో ఈ ఎన్నిక అవసరమైంది. ఆయన నైతిక నియమాల ఉల్లంఘనకు పాల్పడినట్లు కోర్టు తీర్పు చెప్పింది.

హెల్మెట్ ధరించలేదంటూ బీమా పరిహారం తగ్గించరాదు

- కర్ణాటక హైకోర్టు తీర్పు

బెంగళూరు: మోటార్‌సైకిల్ రోడ్డు ప్రమాదానికి గురైనపుడు, ఆ ప్రమాదంలో ఆ బైక్‌ను నడిపిన వ్యక్తి తప్పు లేనపుడు, ఆ వ్యక్తి హెల్మెట్ ధరించలేదనే కారణాన్ని చూపుతూ, బీమా కంపెనీలు బీమా క్లెయిము సొమ్మును తగ్గించరాదని కర్ణాటక హైకోర్టు తీర్పు చెప్పింది. హెల్మెట్ ధరించిన వ్యక్తి సురక్షితంగా ఉంటారనే విషయం నిజమే అయినప్పటికీ, బాధితుడి నిర్లక్ష్యం ఆ ప్రమాదం జరగడానికి కారణమైనప్పుడు మాత్రమే ఆ వ్యక్తి తెలివిగా, జాగ్రత్తగా వ్యవహరించడంలో విఫలమయ్యారనే వాదన వర్తిస్తుందని స్పష్టం చేసింది. ప్రమాదం జరిగిన సమయంలో హెల్మెట్ ధరించనందున బాధితునికి చెల్లించవలసిన నష్టపరిహారాన్ని తగ్గించడానికి ఈ వాదన ఉపయోగపడుతుందని తెలిపింది. 2016లో వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో గాయపడిన ఖాన్ అనే వ్యక్తి కేసులో ఈ తీర్పు చెప్పింది. ఖాన్ హెల్మెట్ ధరించలేదనే కారణాన్ని చూపి ఆయనకు పరిహారం తగ్గిస్తూ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ 2020లో ఆదేశించింది. దీనిని ఆయన హైకోర్టులో సవాల్ చేశారు.

ఉదయ్‌పూర్‌లో ఉద్రిక్తత

జైపూర్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలను రాజేసింది. కత్తిపోట్లకు గురవడంతో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే ఎంబీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ వార్త బయటకు పొక్కడంతో ఈ దవాఖాన ఎదుట హిందూ సంస్థలు ధర్నా చేశాయి.

బాలలకు బెయిల్ నిరాకరించరాదు: సుప్రీం

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసులో ఆరోపణలు ఎదుర్కొనే బాలలకు బెయిలును నిరాకరించరాదని సుప్రీంకోర్టు చెప్పింది. అయితే ఆ బాల నిందితుడు బెయిలుపై విడుదలైతే, ఓ నేరస్థుడితో జతకట్టే అవకాశం ఉందని కానీ, నైతిక, శారీరక లేదా మానసిక అపాయానికి గురికావచ్చునని కానీ, అతనిని విడుదల చేయడం వల్ల న్యాయ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని కానీ కోర్టు రికార్డు చేసినపుడు మినహా ఇతర సందర్భాల్లో జువెనైల్‌కు బెయిలును తిరస్కరించకూడదని వివరించింది. ఓ మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడైన జువెనైల్‌కు బెయిలును నిరాకరిస్తూ జువెనైల్ జస్టిస్ బోర్డు, రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఏడాదిగా జైలులో ఉన్న జువెనైల్‌ను జామీను లేకుండా విడుదల చేయాలని ఆదేశించింది.

మోదీకి బంగ్లా చీఫ్ యూనస్ ఫోన్

హిందువులు, మైనారిటీల భద్రతకు కట్టుబడి ఉన్నామని హామీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనార్టీల రక్షణ, భద్రతకు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ అధ్యక్షుడు మహమ్మద్ యూనస్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి శుక్రవారం ఆయన ఫోన్ చేశారు. బంగ్లాదేశ్ ప్రధానిగా హసీనా దిగిపోయి తాత్కాలిక చీఫ్‌గా యూనస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇద్దరూ మాట్లాడుకోవడం ఇదే తొలిసారి. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీల ప్రభుత్వానికి భారత ప్రభుత్వ సహకారం ఉంటుందని ఎక్స్‌లో చేసిన పోస్టులో నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మహమ్మద్ యూనస్ నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిందని, ఇరువురం ప్రస్తుత పరిస్థితులపై భావాలు పంచుకున్నామని ఆయన చెప్పారు. బంగ్లాలో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలుపగా, ఆ దేశంలో హిందువులు, ఇతర మైనారిటీల రక్షణ, భద్రతకు యూనస్ హామీ ఇచ్చారన్నారు.

బంగ్లాదేశ్‌లో విద్యార్థుల కొత్త పార్టీ?

ఆందోళనల ద్వారా దశాబ్దాల కాలంగా దేశాన్ని పాలిస్తున్న షేక్ హసీనా ప్రభుత్వాన్ని దింపేసిన బంగ్లాదేశ్‌లోని విద్యార్థులు కొత్త పార్టీని స్థాపించాలని అనుకుంటున్నారు. బంగ్లాలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని దేశంలోని రెండు ప్రధాన పార్టీల డిమాండ్‌ను వారు వ్యతిరేకించడమే కాక, తమ ప్రగతిశీల భావాలకు అనుకూలంగా పాలన జరగాలంటే తామే అధికారంలోకి రావాలని భావిస్తున్నారు. కాగా, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనాపై విధిస్తున్న అధిక ఒత్తిడిని నిలిపివేయాలని భారత ప్రభుత్వం అమెరికాకు విజ్ఞప్తి చేసింది. అయితే ఇదంతా విద్యార్థుల ఆందోళనకు తలొగ్గి హసీనా దేశం విడిచి పారిపోవడానికి ఏడాది ముందు జరిగిందని భారత్, అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ కథనాన్ని ప్రచురించింది.

వార్తాపత్రికల్లా ముద్రించే సోలార్ ప్యానెళ్లు!

- చైనా శాస్త్రవేత్తల ఆవిష్కరణ

హాంగ్‌కాంగ్: సౌర విద్యుత్తు రంగంలో చైనా శాస్త్రవేత్తలు కొత్త ఆవిష్కరణ చేశారు. సులభంగా తయారుచేయగల కొత్త సోలార్ సెల్స్‌ను అభివృద్ధి చేశారు. సిటీ యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం అభివృద్ధి చేసిన ఈ సోలార్ సెల్స్‌తో సోలార్ ప్యానళ్లను వార్తాపత్రికల్లా ముద్రించవచ్చు. ఇవి ఇతర సోలార్ ప్యానళ్ల కంటే సమర్థంగా విద్యుత్తును ఉత్పత్తి చేయగలవని శాస్త్రవేత్త అలెక్స్ జెన్ క్వాన్‌యూ తెలిపారు. న్యూస్ పేపర్‌లా ఉండే ఈ సింథటిక్ సోలార్ ప్యానళ్లను గాజు కిటికీలకు సైతం అమర్చవచ్చని, తద్వారా ఎత్తైన భవనాలు ఉండే నగరాలకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. త్వరలోనే పైలట్ ప్రాజెక్టుగా ఉత్పత్తిని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు.



డ్రగ్స్ ముఠా వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్, ఎస్వోటీ డీసీపీ శ్రీనివాస్

డ్రగ్స్ ముఠా అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు విక్రేతలు, ఐదుగురు కొనుగోలుదారులు
- రూ.4.65 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

శేరిలింగంపల్లి, ఆగస్టు 16: హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు జరుపుతున్న ఓ ముఠాను ఎస్వోటీ మాదాపూర్, రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డవారిలో డ్రగ్ పెడ్లర్లు దినేశ్ చౌదరి (సైనిక్‌పురి), గణేశ్ చౌదరి (ఘట్‌కేసర్), మంగళరామ్ (రాజస్థాన్)తోపాటు డ్రగ్స్ కొనుగోలుదారులు నితిన్ గుర్జార్ (గచ్చిబౌలి టెలికం నగర్), ప్రకాశ్ చౌదరి (సైదాబాద్), జైవట్రం వస్నరామ్ దేవసి (అమీన్‌పూర్), దినేశ్ చౌదరి (సైనిక్‌పురి), బనారామ్ చౌదరి (భువనగిరి) ఉన్నట్టు మాదాపూర్ డీసీపీ జీ వినీత్, ఎస్వోటీ డీసీపీ శ్రీనివాస్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నిందితుల నుంచి 620 గ్రాముల హెరాయిన్ పేస్ట్, మహీంద్రా ఎక్స్‌యూవీ కారు, 7 సెల్‌ఫోన్లు సహా మొత్తం రూ.4.65 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుల్లో ఐదుగురికి డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చినట్టు చెప్పారు. గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని గణేశ్ చౌదరికి చెందిన లైట్‌హౌజ్ ఎలక్ట్రికల్ షాపులో డ్రగ్స్ క్రయవిక్రయాలు జరుపుతుండగా వీరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడు సావర్‌జాట్ పరారీలో ఉన్నాడని వివరించారు.

డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరిని ఎస్టీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్‌శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. మరో కేసులో 1,200 కిలోల బెల్లం, 50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన పీవీ రాహుల్, మహేశ్.. కూకట్‌పల్లికి చెందిన పలువురికి 29.6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను తీసుకొస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టీఎఫ్ డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినట్టు తెలిపారు. ఈ కేసులో నితిన్‌రెడ్డి, నైజీరియాకు చెందిన జాక్సన్ ప్రమేయం ఉందని, వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డ్రగ్స్ విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దకొత్తపల్లికి కర్ణాటక నుంచి బొలెరోలో తరలిస్తున్న లక్షన్నర విలువైన బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

'గ్రూప్-1' పరీక్ష షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. పరీక్షలను అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. అయితే పరీక్ష సమయంలో మార్పులు చేస్తూ శుక్రవారం టీజీపీఎస్సీ అధికారులు మరోసారి షెడ్యూల్‌ను విడుదల చేశారు. నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు పరీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ సమయాన్ని అరగంట ముందుకు జరుపుతూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించేలా మార్పులు చేశారు. మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన శాంపిల్ ఆన్సర్ బుక్‌లెట్‌ను వెబ్‌సైట్‌లో పెట్టినట్టు టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ ప్రకటన విడుదల చేశారు. హాల్‌టికెట్లకు సంబంధించిన సూచనలు కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. హాల్‌టికెట్‌లో సూచించిన అంశాలను అభ్యర్థులు తప్పనిసరిగా అనుసరించాలని వెల్లడించారు. వివరాలకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ఫాలో కావాలని పేర్కొన్నారు.

పాపన్న స్ఫూర్తితో బహుజనులు ఏకంకావాలి

- రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం కావాలి
- పాపన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం
- సర్దార్ పాపన్న జయంతి వేడుకల్లో వక్తలు
- హైదరాబాద్‌లో మంత్రి పొన్నం, ఎంపీ ఈటల హాజరు



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కమిటీ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు..

హైదరాబాద్, ఆగస్టు16 (నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి: సర్దార్ సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకుని బహుజనులంతా ఏకం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాధికారమే అంతిమలక్ష్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలను శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. కల్లుగీత కార్మిక, గౌడ, బీసీ సంఘాల ఆధ్వర్యంలోనూ పాపన్న జయంతి ఉత్సవాలు జరిగాయి. ఆయాచోట్ల పాపన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన రాజ్యం కోసం పాపన్న చేసిన పోరాటాన్ని నేతలు స్మరించుకున్నారు. హైదరాబాద్ చిక్కడపల్లిలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పాపన్న జయంతి సభను ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ కే స్వామిగౌడ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాంచారు. ఈ సందర్భంగా సభలో మంత్రి పొన్నం మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పాపన్న విగ్రహం చూడగానే కర్తవ్యం గుర్తుకురావాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. పాపన్నగౌడ్ సాహసానికి మారు పేరు అని కొనియాడారు. బీసీలంతా ఏకం కావాలని కోరారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, గణేశ్‌చారి, అంబాల నారాయణగౌడ్, ఎంపీ రమణ, అంబాల నారాయణగౌడ్, గాయకులు రామలింగం, ఎపూరు సోమన్న తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వేడుకల్లో నేతలు జకే వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ స్థానంలో తెలంగాణ తల్లి

- సెక్రటేరియట్ ఎదుట ఏర్పాటు తథ్యం
- మేము అధికారంలోకి రాగానే చేసి తీరుతాం: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని, తాము అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'ఒకవైపు అమరవీరుల స్థూపం, మరోవైపు సచివాలయం ఉన్నాయి. ఈ రెండింటి మధ్య రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. అసలు అమరవీరుల స్థూపంతోగానీ, సచివాలయంతోగానీ రాజీవ్‌గాంధీకి ఎలాంటి సంబంధం లేదు. అలాంటప్పుడు అక్కడే ఎందుకు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కరెక్ట్' అని పేర్కొన్నారు. శంషాబాద్ విమానాశ్రయం పేరును తొలగించి తెలంగాణ మహనీయుల పేరు పెడుతామని కేటీఆర్ వెల్లడించారు.

కానిస్టేబుల్ యాదయ్య తెగువ స్ఫూర్తిదాయకం

రాష్ట్రపతి మెడల్ రావడం గర్వకారణం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో విశేష ధైర్య సాహసాలు ప్రదర్శించి రాష్ట్రపతి మెడల్ సాధించిన తెలంగాణ బిడ్డ కానిస్టేబుల్ యాదయ్యకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. శుక్రవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ ఏడు కత్తి పోట్లు పడి... రక్తం ధారలా కారుతున్నా చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకునేందుకు యాదయ్య చూపించిన తెగువ అసామాన్యమని పేర్కొన్నారు. 2022లో జరిగిన ఈ ఘటనలో యాదయ్య చూపిన సాహసానికి గుర్తింపుగా గౌరవం దక్కడం సంతోషకరమన్నారు. సమర్థ నాయకత్వంలో తెలంగాణ పోలీసులు శక్తివంచన లేకుండా ఎలా పని చేశారో తెలపడానికి ఈ ఉదంతం గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. యాదయ్య చూపించిన చిత్తశుద్ధి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు.

అక్కాచెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం లేదు

- ఏదో యథాలాపంగా చేసిన వ్యాఖ్యలవి: కేటీఆర్
- కేటీఆర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): పార్టీ సమావేశంలో తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల సోదరీమణులకు మనస్తాపం కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'నా అక్కాచెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు' అని పేర్కొన్నారు. కాగా, మహిళల ఉచిత బస్సు ప్రయాణాలపై కేటీఆర్ యథాలాపంగా చేసిన వ్యాఖ్యలకు కొందరు రాజకీయ రంగు పులుముతున్న విషయం తెలిసిందే. మరోవైపు కేటీఆర్‌కు తెలంగాణ మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది


ప్రజావాణికి 319 దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 319 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 50, మైనారిటీ వెల్ఫేర్ 61, పంచాయత్‌రాజ్ గ్రామీణాభివృద్ధి 27, విద్యుత్‌శాఖ 81, ఆరోగ్యశ్రీ 21 ఇతర శాఖలకు సంబంధించి 79 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు.

'విండ్ సోలార్' ప్లాంట్ల మార్పు

- 19 వేల మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదన
- తొలుత నిజామాబాద్, మెదక్, కరీంనగర్, రంగారెడ్డి ఎంపిక
- తాజాగా ఆ జిల్లాలు అనువుకాదని తేల్చిన రాష్ట్రం
- వాటి స్థానంలో మరో 9 జిల్లాల ప్రతిపాదన





హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గతంలో ప్రతిపాదించిన నాలుగు జిల్లాలు విండ్ సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అనువుకాదని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. ఆ నాలుగు జిల్లాల్లో ప్లాంట్లు పెట్టలేమని, ఆయా ప్రతిపాదనలను విరమించుకోవాలని కేంద్రాన్ని కోరనున్నది. గత ప్రతిపాదనలను మార్చాలని కేంద్ర విద్యుత్తు శాఖకు త్వరలోనే లేఖను రాయనున్నది. వాటి స్థానంలో కొత్త జిల్లాలను రాష్ట్ర ఇంధశాఖ ప్రతిపాదించింది. తొలుత ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 19 వేల మెగావాట్ల విండ్ సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్లను నిర్మించేందుకు కేంద్ర విద్యుత్తుశాఖ గతంలో గుర్తించింది. ఆయా జిలాల్లో కొత్త పాంట్లను నిర్మించాలని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇంధనశాఖ అధికారులు అధ్యయనం చేశారు. ఆయా జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు పలురకాల ప్రతిబంధకాలు ఉన్నట్టు అధికారుల అధ్యయనంలో తేలింది. ప్లాంట్ల నిర్మాణం, గ్రిడ్ కనెక్టివిటీ వంటి సమస్యలు తలెత్తుతాయని, ప్లాంట్ల ఏర్పాటుకు ఆ ప్రాంతాలు అనువుకాదని తేలింది.

భూముల ధరల భయం

తొలుత ఎంపిక చేసిన ఆ నాలుగు జిల్లాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు భూముల లభ్యత తక్కువగా ఉన్నది. ప్లాంట్ల ఏర్పాటుకు వేలాది ఎకరాల భూమి కావాల్సి ఉండటం, అక్కడ సాగుభూములే అధికంగా ఉండటం, భూముల ధరలు చుక్కలనంటుతున్నాయి. భూసేకరణ సమస్యగా మారనున్నది. దీంతో ఆయా జిల్లాల్లో సోలార్‌ప్లాంట్లు నిర్మించడం కష్టమని అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఇంధనశాఖ అధికారులు ఇతర జిల్లాలను ప్రతిపాదించారు. అధికంగా మైదాన ప్రాంతం, బీడు భూములు ఉండటం, ప్రభుత్వ భూముల్లోనూ ప్లాంట్ల ఏర్పాటుకు వీలుంటుందని భావించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కొత్త పాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు.

'బిగ్'బాస్ చానలా.. మజాకా!

అధికారులను టార్గెట్ చేస్తూ 'అధికార' చానల్ హల్‌చల్

ఐపీఎస్‌లు, మెట్రో రైలు అధికారులు బాధితులేనని ఆరోపణలు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలోని ఓ బడా నేతకు చెందిన చానల్.. 'బిగ్'బాస్ మాదిరిగా అటు ప్రభుత్వంలో, ఇటు అధికార పార్టీలో పెత్తనం చెలాయిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆ చానల్‌కు చెందిన ఓ రిపోర్టర్ ఏకంగా ఐపీఎస్ ఆఫీసర్‌ను 'ఈ కుర్చీలో కూర్చునే అర్హత ఉందా?' అంటూ ప్రశ్నించారు. దీంతో ఈ వ్యవహారం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అధికార పార్టీకి చెందినదిగా చెప్పుకొనే ఆ చానల్‌లో అధికారులను కించపరచడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వంలోని ఆ బిగ్‌బాస్ తలుచుకుంటే అధికారులను బదిలీ చేయొచ్చని.. కానీ అలా కాకుండా అధికారులపై ఇలా బురద చల్లి అవమానించడం ఏమిటని చర్చిస్తున్నారు. 'ఆ చానల్ ఎవరిదో అందరికీ తెలుసు. సిన్సియర్ ఆఫీసర్‌గా పేరుతెచ్చుకున్న ఆ అధికారిని ఎందుకు టార్గెట్ చేసినట్టు?' అని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆ సంస్థ యజమాని ఇటీవల 'పెద్ద తలకాయలతో' కలిసి విదేశాలకు వెళ్లడం, పర్యటనలో అన్నీ తానై వ్యవహరించడంతో అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఓ ఐపీఎస్ అధికారిని, మెట్రో రైలుకు చెందిన ఓ ఉన్నతాధికారిని కూడా ఇలాగే అవమానించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు సంస్థ ప్రతినిధులు 'మాది ప్రభుత్వ చానల్' అంటూ అధికారులందరిని ఇలాగే బెదిరిస్తున్నారని, మొదట సమాచారం తమకే ఇవ్వాలని కచ్చితంగా చెప్తున్నారట. దీంతో ఆ చానల్ వ్యవహారంపై ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. బిగ్ బాస్‌కు తెలిసే ఇదంతా జరుగుతున్నదా? లేదా? ఆయన పేరు చెప్పుకొని వీళ్లు రెచ్చిపోతున్నారా? అని అధికార పార్టీలోనూ గుసగుసలాడుకుంటున్నట్టు సమాచారం.

రేవంత్.. 'హైడ్రా'మా ఆపు!

- కట్టినవి కాదు.. అక్రమ నిర్మాణాలను అరికట్టు
- నీ చిట్టా అంతా మా చేతుల్లో..
- 72లక్షల రైతుల్లో 22లక్షల మందికే రుణమాఫీ
- ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న హైడ్రామా ఆపాలని, కట్టినవాటిని కాకుండా చిత్తశుద్ధి ఉంటే అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. 'అక్రమ కట్టడాలపై కఠినంగా ఉన్నా అని చెప్పుకొంటున్న నువ్వు.. ఏం చేస్తున్నావో మా దగ్గర చిట్టా ఉన్నది. పిల్లి కండ్లు మూసుకొని పాలు తాగినట్టు చేస్తున్నవు. డ్రామాలు ఆపితే మంచిది' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ పూర్తిగా జరిగిందన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలన్నీ బోగస్ అని మండిపడ్డారు. బ్యాంకర్ల లెక్కల ప్రకారం 72 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉన్నదని, ఎన్నికల ముందు 64 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. విధివిధానాల పేరుతో 49 లక్షల మందికి కుదించారని, తీరా 22 లక్షల మంది రైతులకు కేవలం రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసి అందరికీ చేశామని గొప్పలు చెప్పుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క ఘట్‌కేసర్ సొసైటీలోనే 1200 మంది రైతులకు రూ.9 కోట్ల రుణాల్లో రూపాయి కూడా మాఫీ కాలేదని చెప్పారు. దమ్మఉంటే పూర్తిగా రుణమాఫీ కాలేదని ఒప్పుకోవాలని సవాల్ చేశారు. ప్రభుత్వ లోపాలను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అంటూ రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో 60 వేల దరఖాస్తులకు ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): లే-అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్) స్కీమ్ కింద ఇప్పటివరకు దాదాపు 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 4,28,832 దరఖాస్తులను ప్రాసెస్ చేసి, 60,213 దరఖాస్తులను ఆమోదించామని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ వెల్లడించారు. వీటి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.96.60 కోట్ల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. మొత్తం దరఖాస్తుదారుల్లో దాదాపు 75% మంది సరైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయకపోవడంతో వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్‌లో షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసే సదుపాయం దరఖాస్తుదారులకు ఉన్నదని పేర్కొన్నారు. సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికేట్, లే-అవుట్ కాపీ లాంటి పూర్తిస్థాయి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఓటీపీని ఉపయోగించుకుని మొబైల్ నంబర్, చిరునామా లేదా ఇతర వివరాలను సవరించుకోవచ్చని వివరించారు. ఇతర వివరాల కోసం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లోని హెల్ప్ డెస్కులను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి జస్టిస్ పీసీ ఘోష్ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ విచారణ నేటి(శనివారం) నుంచి పునఃప్రారంభం కానుంది. జస్టిస్ ఘోష్ శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై ఇప్పటికే విచారణ ప్రారంభించారు. ప్రాజెక్టు ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి వివరాలు సేకరించారు. కమిషన్ ఎదుట దాఖలైన అఫిడవిట్లను సైతం పరిశీలించారు. సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసే అవకాశమున్నది.

అధికార లాంఛనాలతో అగర్వాల్ అంత్యక్రియలు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): అగ్ని మిస్సైల్స్ రూపకర్త, రామ్‌నారాయణ్ అగర్వాల్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. శనివారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరుగనున్నాయి. ఆయన అనారోగ్య సమస్యలతో గురువారం తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే.

'విద్యుత్తు విచారణ'పై ఆచితూచి అడుగులు

డాక్యుమెంట్లను పరిశీలించిన చైర్మన్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్రప్రభుత్వం నియమించిన విచారణ సంఘం ఆచితూచి అడుగులేస్తుంది. ఇప్పటికే విచారణను ప్రారంభించిన విచారణ సంఘం చైర్మన్ జస్టిస్ మదన్ బీ లోకూర్ డాక్యుమెంట్ల పరిశీలనను చేపట్టారు. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయగా, బాధ్యతల నుంచి ఎల్ నర్సింహారెడ్డి తప్పుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఉమ్మడి ఏపీ హైకోర్టు సీజేగా, సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ మదన్ బీ లోకూర్ నేతృత్వంలో విచారణ సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండురోజులపాటు హైదరాబాద్‌కు వచ్చిన జస్టిస్ మదన్ బీ లోకూర్ విచారణ తీరుతెన్నులపై ఆరా తీసినట్టు తెలిసింది. ఇంతకుముందు విచారణ జరిపిన ఎల్ నర్సింహారెడ్డి ఇన్వెస్టిగేషన్‌ను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం తదుపరి విచారణపై ముందుకు వెళ్లనున్నట్టు తెలిసింది.

ఎన్‌సీడబ్ల్యూ పదవికి ఖుష్బూ రాజీనామా

చెన్నై: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలు ఖుష్బూ సుందర్ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను జూన్ 28 నుంచి వర్తించే విధంగా ఆమోదించినట్లు కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. తాను బీజేపీ కోసం పూర్తి కాలం పని చేయడం కోసం ఎన్‌సీడబ్ల్యూ మెంబర్ పదవికి రాజీనామా చేశానని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోపాటు బీజేపీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌సీడబ్ల్యూ పదవికి కొన్ని పరిమితులు ఉంటాయని, ఇప్పుడు బీజేపీ మిషన్ కోసం పూర్తిగా అంకితమవడానికి అవకాశం లభించిందని చెప్పారు.

24న వరంగల్‌లో కాంగ్రెస్ కృతజ్ఞత సభ?

- సోనియాగాంధీ, ఖర్గేకు సీఎం రేవంత్ ఆహ్వానం
- 20న హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు16 (నమస్తే తెలంగాణ): వరంగల్ వేదికగా ఈ నెల 24న రైతు కృతజ్ఞత సభను నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తున్నది. ఆ సభకు రావాల్సిందిగా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను శుక్రవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించినట్టు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మల్లికార్జున ఖర్గేతో ప్రత్యేకంగా భేటీ అయి ఇదే అంశంపై చర్చించినట్టు తెలుస్తున్నది. మరోవైపు, సచివాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రాజీవ్‌గాంధీ జయంతి రోజు 20వ తేదీన ఆవిష్కరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి కూడా పార్టీ పెద్దలను ఆహ్వానించినట్టు తెలిసింది.

పీసీసీ అధ్యక్షుడిపై తేలని నిర్ణయం


సీఎం రేవంత్‌రెడ్డి తాజా పర్యటనతో ఇప్పటికీ 19సార్లు ఢిల్లీకి వెళ్లారు. కాంగ్రెస్ పెద్దలను సైతం కలిశారు. మల్లికార్జున ఖర్గేతో దాదాపు గంటా 20 నిమిషాలపాటు చర్చించారు. క్యాబినెట్ విస్తరణ, పలు కార్పొరేషన్లు, నామినేటెడ్ పోస్టులు, టీపీసీసీ అధ్యక్షుడి నియామకంపై చర్చించినట్టు తెలిసింది. అయితే, వాటిపై అధిష్ఠానానికి, రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలకు మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. దీంతో ఆయా అంశాలపై ఎటువంటి పురోగతి లేకుండానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. ఇటీవల తెలంగాణ నుంచి రాజ్యసభకు పార్టీ అభ్యర్థిగా ఎంపికైన అభిషేక్ మను సింఘ్వీ ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

18న సీఎల్పీ భేటీ

కాంగ్రెస్ శాసనసభ పక్షం (సీఎల్పీ) ఆదివారం ప్రత్యేకంగా భేటీ కానున్నది. ఇందులో రాజ్యసభ ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలు, స్థానిక ఎన్నికలపై చర్చించనున్నారు. రుణమాఫీపై వాడవాడలా ప్రచారం చేయాలని కాంగ్రెస్ పెద్దలు ఇప్పటికే నిర్ణయించారు. ఆయా అంశాలపై సీఎల్పీ భేటీలో పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిసింది.

సీతక్క సిఫారసు.. ఇసుక అధికారిగా పోస్టు

- ములుగు జిల్లా క్వారీ పర్యవేక్షణ అధికారి మార్పు
- గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ నుంచి డిప్యుటేషన్
- జిల్లాలోని అన్ని క్వారీలపై పర్యవేక్షణ ఈయనదే


TELANGANA MINERAL DEVELOPMENT CORPORATION LIMITED
6-2-915, REAR BLOCK, 3RD FLOOR, HMWSSB PREMISES, KHAIRATABAD,HYDERABAD-04

O.O. No.TGMDC/HRD/AS/GWD/2024/ 426 Dt: 12.08.2024

OFFICE ORDER

Sub: TGMDC - HRD - Sri Aluwala Srikanth, Assistant Hydrogeologist - Placed at the disposal of TGMDC Ltd., to work on deputation under Foreign Service Terms and Conditions - Designation and Assignment of duties - ORDERS - ISSUED.

Ref: 1) Application of Sri Aluwala Srikanth, Assistant Hydrogeologist, Dt.04.06.2024.
2) Lr. No.331/Min(PR&RD, RWS, W&CW) MLG/2024, dt. 06-08-2024 received from Dr. Danasari Anasuya Seethakka, Minister for PR & RD, RWS, Women and Child Welfare, Government of Telangana.
3) O.O. No.TGMDC/HRD/PN/2024/417, Dt: 06.08.2024.
4) Lr.No.8406/E.3/2020, Dt.07.08.2024, received from the Director(FAC), Ground Water Dept.
5) Permitted letter to work on deputation in TGMDC, vide Procs. No. 8406/E.3/202, Dt.07.08.2024.
6) Proc.No.01/E/2019, Dt.09.08.2024 received from the District Ground Water Officer, Mulugu.
7) Joining report dated 12.08.2024.

In the reference 1st cited, Sri Aluwala Srikanth, Assistant Hydrogeologist requested to place the services at the disposal of Vice Chairman and Managing Director, Telangana Mineral Development Corporation Limited, to work on deputation for a period of 1 (One) year on foreign service terms and conditions of deputation.

Accordingly, the proceedings vide reference 4th to 6th cited, the Director, Ground Water Department have issued orders for placing the services of Sri Aluwala Srikanth, Assistant Hydrogeologist to TGMDC Ltd., for a period of one year and the District Ground water Officer, Mulugu is relieved on 09.08.2024 AN.

In the references 7th cited, Sri Aluwala Srikanth, Assistant Hydrogeologist after getting relived, reported for duty on 12.08.2024 FN in TGMDC Ltd., Hyderabad.

In view of the above, he is admitted for duty in the cadre of Assistant Manager (F&A) and posted as Project Officer, Mulugu District without any change in his pay or pay scale which he would be drawing in his parent department but for his deputation to this Corporation. His deputation will be for a period of one year from the date of his joining and he will be governed by the foreign terms and conditions of deputation issued in G.O.(P) No.10, Finance and Planning (FW.FR) Department Dated:22.01.1993 and subsequent orders/amendments issued from time to time.

VICE CHAIRMAN & MANAGING DIRECTOR(FAC)

To
Sri Aluwala Srikanth, Asst. Hydrogeologist (On deputation)
Copy to:
1. Collector & District Magistrate, Mulugu.
2. The Director Ground Water Department, Hyderabad.
3. The District Ground Water Department, Mulugu.
4. All Functional Heads, Head Office
5. All Project Officers of Corporation.
6. VC&MD's Peshi, Head Office
7. O/c

DESPATCHED

సీతక్క సిఫారసుతో ములుగు జిల్లా టీజీఎండీసీ పీవోగా శ్రీకాంత్‌కు పోస్టింగ్ ఆర్డర్

వరంగల్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇసుక ఎక్కువగా లభించే ములుగు జిల్లాలో అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే ఇసుక తవ్వకాల పర్యవేక్షణ అధికారిగా పోస్టింగ్ దక్కుతున్నది. పంచాయతీరాజ్ మంత్రి సీతక్క సిఫారసు చేసిన వారికే ఆమె సొంత జిల్లా ములుగు టీజీఎండీసీ ప్రాజెక్టు అధికారిగా పోస్టింగ్ దక్కింది. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, లారీల్లో లోడింగ్ పర్యవేక్షణ అంతా తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ఆధ్వర్యంలోనే జరుగుతుంది. నదులు, నదుల వెంట ఉన్న ప్రైవేటు భూముల్లో ఇసుక తవ్వకాలు, లోడింగ్, రవాణా పర్యవేక్షణ కోసం ఇసుక వనరులు ఉన్న జిల్లాకు ప్రత్యేకంగా ప్రాజెక్టు అధికారులను నియమిస్తున్నది. ములుగు జిల్లాలో మాత్రం మంత్రి సీతక్క చెప్పిన వారికే ఈ పోస్టు దక్కింది. టీజీఎండీసీ ములుగు జిల్లా ప్రాజెక్టు అధికారిగా.. గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌లో హైడ్రోజియోలజిస్టుగా పనిచేస్తున్న అలువాల శ్రీకాంత్ ఇటీవలే పీవోగా విధుల్లో చేరారు. పీవో పోస్టు కావాలని ఆయన జూన్ 4న దరఖాస్తు పెట్టుకున్నారు. రెండు నెలల వరకు దరఖాస్తు కదలలేదు. శ్రీకాంత్‌కు పోస్టింగ్ ఇవ్వాలని సీతక్క ఈనెల 8న టీజీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు స్వయంగా సిఫారసు లేఖ పంపారు. ఈ లేఖ అందగానే అధికార యంత్రాంగం వేగంగా స్పందించింది. ఎండీసీలో పనిచేసేందుకు శ్రీకాంత్‌కు అనుమతి ఇవ్వడంతోపాటు సొంత శాఖ నుంచి రిలీవ్ చేస్తూ గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ డైరెక్టర్ ఈనెల 7న టీజీఎండీసీకి లేఖ ఇచ్చారు. 9న ఆయన విధుల్లో చేరారు. ములుగు జిల్లాలోని 102 ఎకరాల్లో 11 ఇసుక క్వారీలను మైనింగ్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పీసా గ్రామ సభలను నిర్వహించి ఆదివాసీ సంఘాలు, నిబంధనల మేరకు ఇతరులకు ఈ క్వారీలను కేటాయించారు. మంగపేట మండలం మల్లూరు, చుంచుపల్లిలో.. వాజేడు మండలం అయ్యావారిపేట, ధర్మవరం, రాంపూర్‌లో.. వెంకటాపురం(నూగూరు) మండలం మొర్రివానిగూడెం, శ్రీరంగాపురం, కే కొండాపురం, ఒంటి చింతగూడెంలో క్వారీలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఎనిమిది ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన ప్రతి ఇసుక క్వారీ, స్టాకు యార్డు, ఇసుక లోడింగ్ వంటి ప్రక్రియ టీజీఎండీసీ పీవో పర్యవేక్షణలోనే జరుగుతాయి. గోదావరి నది నుంచి రోజూ వందల లారీల్లో ములుగు జిల్లా నుంచి వరంగల్, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా అవుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ నేతల మద్దతు, అధికారుల సహకారంతో కోట్ల రూపాయల ఇసుక వ్యాపారం జరుగుతున్నది.

నాణ్యత లేకుంటే కాంట్రాక్టులు రద్దు

అంగన్‌వాడీ వస్తువుల సప్లయర్స్‌కు సీతక్క వార్నింగ్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన వస్తువులు సరఫరా చేయకుంటే కాంట్రాక్టులు రద్దు చేస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క హెచ్చరించారు. శుక్రవారం నమస్తేతెలంగాణలో 'అంగన్‌వాడీలకు కుళ్లిన గుడ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న ఆహారపదార్థాలు, కోడిగుడ్ల నాణ్యత పెంపు కోసం కాంట్రాక్టర్లతో స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీతో కలిసి మంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పేదపిల్లలు వస్తారని, వారికి పోషకాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. నాణ్యమైన గుడ్లు సరఫరా చేయడం లేదని వస్తున్న వార్తలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికల్లో వార్తలపై ఆమె సప్లయర్లను వివరణ కోరారు. సప్లయర్లు సరఫరా చేసే నాణ్యత లేని వస్తువులను తిరస్కరించాలని మంత్రి అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. సకాలంలో గుడ్లను వినియోగించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

దళిత మహిళకు చిత్రహింసలపై ధర్నా

- నిరసనకు దిగిన దళిత సంఘాలు
- ఎస్సైపై చర్యలకు డిమాండ్

బషీరాబాద్, ఆగస్టు 16: దళిత మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఎస్సై రమేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట దళిత సంఘాలు నిరసనకు దిగాయి. వికారాబాద్ జిల్లా నవల్గా గ్రామానికి చెందిన లోవాడ నరేశ్ కాశీపూర్ గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. మూడు నెలల కిందట ఇద్దరు కలిసి ఎక్కడికో వెళ్లిపోయారు. దీంతో ఎస్సై రమేశ్‌కుమార్ నరేశ్ తల్లిని మూడు నెలలుగా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురిచేసినట్టు ఆరోపణలు వచ్చాయి. విషయం తెలిసిన దళిత సంఘాలు శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగాయి. ఎస్సై రమేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అనంతరం తాండూరు డీఎస్పీకి ఫిర్యాదు చేశాయి.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ ప్రమాణస్వీకారం

హైదరాబాద్, ఆగస్టు16 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రాంరెడ్డి, అమీర్ అలీఖాన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

షాద్‌నగర్ పోలీసులపై అట్రాసిటీ కేసు

షాద్‌నగర్, ఆగస్టు 16: షాద్ నగర్ పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ నెల 10న దొంగతనం నెపంతో తనపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేశారని బాధిత మహిళ సునీత సీఐకి ఫిర్యాదు చేశారు. విచక్షణారహితంగా కొట్టి, బయటకు చెప్పితే పెట్రోల్ పోసి అంటిస్తామని పోలీసులు బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతోపాటు తన భర్త, కుమారుడిని కూడా పోలీసులు కొట్టారని తెలిపారు. దీంతో సస్పెన్షన్‌కు గురైన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డితోపాటు నలుగురు సిబ్బందిపై కేసు నమోదు చేసిన సీఐ దర్యాప్తు జరుపుతున్నారు.


నిజామాబాద్ జిల్లా మోపాల్‌లో ట్రాక్టర్ ర్యాలీకి సిద్ధమైన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఝలక్

- మోపాల్‌లో ట్రాక్టర్ల ర్యాలీకి పోలీసుల నిరాకరణ
- కంగుతిన్న అధికార పార్టీ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 16 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేకు పోలీసులు ఝలక్ ఇచ్చారు. శుక్రవారం మోపాల్ మండల కేంద్రంలో రుణమాఫీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్న వేళ.. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఊహించని ఘటన ఎదురైంది. ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించాలని యోచించిన ఆయనకు అనుమతి లేదంటూ స్థానిక సీఐ అభ్యంతరం తెలుపడంతో అయోమయానికి గురైనట్టు తెలిసింది. 'ఇదంతా ఏమిటి? నేను అధికార పార్టీ ఎమ్మెల్యేను. నా కార్యక్రమానికే అనుమతి నిరాకరిస్తారా?' అంటూ తీవ్ర ఆగ్రహానికి గురైనట్టు సమాచారం. ఎమ్మెల్యే నిరాశగా వెనుదిరిగినట్టు రైతులు చెబుతున్నారు. తనకు అవమానం జరిగిందని ఎమ్మెల్యే ప్రభుత్వంలోని కీలక వ్యక్తులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

పోలీసుల వాదన ఇదీ..

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వాహనాల ప్రదర్శనకు అనుమతి లేదని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యేకు ఎదురైన ఘటనపై స్పందించేందుకు నిరాకరించినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఇది జరిగిందని చెప్పుకొస్తున్నారు.

నా సోదరులు ప్రొటోకాల్ వాడరు

- వాళ్లకు ప్రభుత్వంలో పదవులు లేవు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): తన సోదరుల్లో ఎవరూ ప్రొటోకాల్ వాడటం లేదని, ఎవరికీ ప్రభుత్వంలో పదవులు లేవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనకు ఏడుగురు సోదరులని, వీరికి ప్రభుత్వంలో ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదన్నారు. తాను సీఎం అయ్యానని వారు ఇంట్లో కూర్చోలేరు కదా? అని ప్రశ్నించారు. వారు విదేశీ పర్యటనకు వెళ్లినా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఏ పథకాన్నీ ఆపలేదని చెప్పారు. ఉద్యోగులకు ప్రతినెల 1న వేతనాలు ఇస్తున్నట్టు తెలిపారు. పీసీసీ అధ్యక్ష పదవిపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టం చేశారు. తన అభిప్రాయం ఎప్పుడో చెప్పానన్నారు. రుణమాఫీ పూర్తి చేయడమే తన ప్రాధాన్యత అని, ఈ మేరకు పూర్తి చేశానన్నారు. రాజ్యసభ సభ్యుడిగా సింఘ్వీ రాకను స్వాగతిస్తున్నానని చెప్పారు. వీ హనుమంతరావు కాంగ్రెస్ సీనియర్ నేత అని, ఆయనను మించిన విధేయుడు కాంగ్రెస్‌కు లేడన్నారు.

సామాజిక కథాంశాలకు పెద్దపీట

- 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన
- ఉత్తమ చిత్రంగా మలయాళీ సోషల్‌డ్రామా 'ఆట్టమ్'
- 'కాంతార'కుగాను ఉత్తమ నటుడిగా రిషబ్‌శెట్టి
- 'పొన్నియన్ సెల్వన్'కు నాలుగు అవార్డులు




70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను శనివారం కేంద్రం ప్రకటించింది. 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలు గాను ఈ అవార్డులను ఎంపిక చేశారు. జాతీయ ఉత్తమ చిత్రంగా మలయాళ చిత్రం 'అట్టం' ఎంపికకాగా, జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం కన్నడ 'కాంతార' సినిమాలో అద్భుతమైన నటన కనపరచిన రిషబ్ శెట్టిని వరించింది. ఇక జాతీయ ఉత్తమనటి పురస్కారానికి తమిళ చిత్రం 'తిరుచిట్రంబళం' చిత్రానికి గాను నిత్యామీనన్, గుజరాతీ చిత్రం 'కచ్ ఎక్స్‌ప్రెస్' చిత్రానికి గాను మానసి పరేఖ్‌లను సంయుక్తంగా ఎంపిక చేశారు. తెలుగు సినిమా 'కార్తికేయ 2' ఉత్తమ ప్రాంతీయచిత్రంగా ఎంపిక కావడం విశేషం. ఈసారి మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్' చిత్రానికి సాంకేతిక విభాగాల్లో అవార్డుల పంట పండించింది. ఈ సినిమాకు నాలుగు అవార్డులు వరించాయి. 'ఉంచాయి' చిత్రానికిగాను సీనియర్ దర్శకుడు సూరజ్ భర్జాత్యా ఉత్తమ దర్శకుడిగా పురస్కారానికి ఎంపికయ్యారు.

వ్యక్తిత్వం దర్శనం 'ఆట్టం'

మలయాళ సినిమా రివార్డులు ఏ స్థాయిలో దక్కించుకున్నా.. అవార్డులు మాత్రం తప్పకుండా జాతీయ స్థాయిలో గెలుస్తూనే ఉంది. యేటేటా ప్రకటించే జాతీయ పురస్కారాల్లో మలయాళ చిత్రాలు లేకపోవడం చాలా అరుదైన విషయం. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా మలయాళ సినిమా జాతీయ పురస్కారాల్లో సత్తా చాటింది. ఆ సినిమానే 'ఆట్టం'. నిజానికి ఈ సినిమాలో తెలిసిన నటీనటులెవరూ లేరు. అందరూ కొత్త వాళ్లతో చేసిన ఈ సినిమా ఇంతటి ఘనత సాధించడానికి కారణం కేవలం కాన్సెప్ట్.

ఓ చిన్న ఊరిలో ఎవరికి తోచిన పని వారు చేసుకుంటూ.. తీరిక దొరికినప్పుడల్లా ఓ బృందంగా వివిధ వేదికల్లో నాటకాలు ప్రదర్శిస్తూ ఉండే ఓ 12మంది కళాకారుల కథ ఇది. వారిలో 11మంది మగవారైతే, ఒక్కరే స్త్రీ. ఆమె పేరు అంజలి. వీరిలో హరి అనే నటుడు సినిమాల్లో కూడా నటించి ఉండటంతో అతనికి ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది. దాంతో మిగతా వారు జెలసీగా ఫీలవుతుంటారు. ఓ రోజు వారు ప్రదర్శన తిలకించి ముగ్ధులైన విదేశీ జంట.. ఆ బృందం మొత్తానికి తమ రిసార్ట్‌లో పార్టీ ఏర్పాటు చేస్తుంది. ఆ పార్టీలో అందరూ మద్యం మత్తులో మునిగి తేలుతారు. కొంత సేపటికి ఎవరికి కేటాయించిన గదుల్లో వాళ్లు వెళ్లిపోతారు. అయితే.. అంజలి మాత్రం తన రూమ్‌లో కిటికి దగ్గరకెళ్లి అక్కడే కూర్చుని నిద్రపోతుంది. అర్ధరాత్రి వేళ ఓ వ్యక్తి అంజలి నిద్ర పోతున్న కిటికీ వద్దకు వచ్చి, కిటికీలో చేయి పెట్టి అంజలితో అసభ్యకరంగా ప్రవర్తించి, ముఖం చూపించకుండా పారిపోతాడు. ఆ వ్యక్తి వారి బృందంలోని వ్యక్తే అని తెలుస్తుంది. ఆ 11మందిలో ఆ వ్యక్తి ఎవరు? అతడ్ని ఎలా గుర్తించారు? అనేది మిగతా కథ.







వ్యక్తుల మనస్తత్వాలకు అద్దం పట్టేలా దర్శకుడు ఆనంద్ ఇకర్షి ఈ సినిమాను తెరకెక్కించాడు. ఒకే మనిషిలో ఉండే భిన్న వ్యక్తిత్వాలు ఇందులో ఆయన ఆవిష్కరించారు. మంచిగా కనిపించే మేకవన్నె పులులు, సందర్భాన్ని బట్టి రంగులు మార్చే ఊసరవెల్లులు, తమ మనుగడ కోసం సాటివారిని బలిపశువుల్ని చేసే గుంటనక్కలు.. ఇలా చాలామంది ఈ సినిమాలో కనిపిస్తారు. ఇందులో పాత్రలన్నీ నిత్యం సమాజంలో మనకు తారసపడేవే. సగటు మానవ స్వభావం ఇలా ఉంటుందని ఆనంద్ ఇకర్షి చూపించిన తీరు ఈ సినిమాకు జాతీయ పురస్కారాన్ని కట్టబెట్టింది. కథకు తగ్గట్టుగా పాత్రధారులు కూడా ఇందులో ఇమిడిపోయి నటించారు. అందరూ జీవించారనే చెప్పాలి. 1954లో వచ్చిన '12 యాంగ్రీ మెన్' హాలీవుడ్ టెలివిజన్ కార్యక్రమం ఆధారంగా దర్శకుడు ఆనంద్ ఇకర్షి ఈ సినిమాను తెరకెక్కించారు.

జాతీయ ఉత్తమనటి నిత్యామీనన్

'తిరుచిట్రంబళం' చిత్రానికి గాను జాతీయ ఉత్తమ నటిగా ఎంపికైంది నిత్యామీనన్. ఉత్తమనటిగా ఆమె అందుకున్న తొలి నేషనల్ అవార్డు ఇదే కావడం గమనార్హం. 'తిరుచిట్రంబళం' చిత్రానికి మిథరన్ ఆర్.జవహర్ దర్శకుడు. ధనుష్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా నిత్యామీనన్ 'శోభన' అనే అద్భుతమైన పాత్ర పోషించింది.

తిరు(ధనుష్), శోభన(నిత్య) ఇద్దరు చిన్నప్పట్నుంచి కలిసి పెరుగుతారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు. తిరుకి ఎలాగైనా ప్రేమ వివాహం చేసుకోవాలనే కోరిక. అందు కోసం నచ్చిన ప్రతి అమ్మాయికీ ట్రై చేస్తుంటాడు. దానికి శోభన హెల్ప్ చేస్తుంటుంది. కానీ ప్రతి అమ్మాయి దగ్గరా తిరుకు చేదు అనుభవాలే ఎదురువుతూవుంటాయి. తిరు అవస్త చూసి శోభన కూడా చాలా బాధ పడుతూ ఉంటుంది. మరోవైపు తెలీకుండానే తిరును శోభన ఇష్టపడుతూవుంటుంది. కానీ తనను తిరు అలా చూడటం లేదు కాబట్టి, తన మనసులోనే ఆ ఇష్టాన్ని దాచుకుంటుంది తప్ప వ్యక్తీకరించదు. అయితే.. తిరు తాతయ్య మాత్రం వీరిద్దరి బంధంపై ఓ అభిప్రాయానికి వస్తాడు. 'నువ్వు చంకలో పిల్లాడ్ని పెట్టు కొని ఊరంతా వెతుకుతు న్నావ్.. అసలు శోభనను ఎందుకు ట్రై చేయకూడదు?' అని తిరుకి చిన్న సైజు కౌన్సిలింగ్ ఇస్తాడు తాతయ్య. దాంతో శోభనను ట్రై చేయడం మొదలుపెడతాడు తిరు. ఉన్నట్టుండి మారిన తిరు ప్రవర్తన చూసి శోభన షాక్ అవుతుంది. తనముందే అంతమంది అమ్మాయిలను ట్రై చేసిన తిరు ప్రేమను ఎలా నమ్మాలో ఎలా అర్థం చేసుకోవాలో తెలీక శోభన సతమతమవుతుంది. చివరికి వీరి ప్రేమ ఎలా ఫలించింది? అనేది మిగతా కథ.

ఈ సినిమాలో ధనుష్, నిత్యామీనన్ పోటీపడి నటించారు. అటు స్నేహితురాలిగా, ఇటు ప్రేమికురాలిగా నిత్యా నటన స్కై లెవల్లో ఉంటుంది. ముఖ్యంగా పతాక సన్నివేశంలో నిత్యామీనన్ అభినయం ఈ సినిమాకే హైలైట్. ఓ మధ్య తరగతి అమ్మాయిగా, ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్న విద్యావంతురాలిగా వివిధ కోణాల్లో నిత్యామీనన్ కనిపిస్తుంది. వినోదం, విషాదం, ప్రేమ.. ఇలా ఎన్నో ఉద్వేగాలున్న పాత్ర ఆమెది. స్వతహాగా మంచి నటి కావడంతో అద్భుతంగా నిత్యామీనన్ నటించింది. ఆ నటనకు సరైన పురస్కారం నేడు లభించింది.

కృష్ణతత్వానికి ప్రేక్షకుల జేజేలు

నిఖిల్ కథానాయకుడిగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన 'కార్తికేయ-2' చిత్రం 70వ జాతీయ అవార్డుల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచింది. విజయవంతమైన 'కార్తికేయ' సినిమాకు సీక్వెల్ ఇది. గత ఏడాది ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రతి ప్రశ్నకు ఓ సమాధానం ఉంటుందని, దానిని అన్వేషించడానికి ఎంతదూరమైన వెళ్లాలనే బలమైన సంకల్పం ఉన్న యువకుడు కార్తికేయ చేసిన సాహసభరితమైన ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం. శ్రీకృష్ణుడి చరిత్ర చుట్టూ ద్వారక నేపథ్యంలో అల్లుకున్న ఈ కథ ఆద్యంతం ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల కలబోతగా సాగుతుంది. ద్వారకా నేపథ్యంతో పాటు శ్రీకృష్ణుడి తత్వాన్ని చర్చించడంతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాకు మంచి ఆదరణ దక్కింది.



'**కార్తికేయ 2**' సినిమా విడుదలై అద్భుతమైన విజయం సాధించినప్పుడు ఒక దర్శకుడిగా ఎంత ఆనందపడ్డానో, మళ్లీ ఇప్పుడు అంత ఆనందపడుతున్నా. ఈ అవార్డు నా బాధ్యత మరింత పెంచింది. ఎంపిక చేసిన జ్యూరీ మెంబర్స్‌కి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. 'కార్తికేయ 3' ప్రస్తుతం రైటింగ్‌లో ఉంది. అందరి అంచనాలను మించేలా ఈ సినిమా ఉంటుంది.. జై శ్రీకృష్ణ..**- దర్శకుడు చందూ మొండేటి**





స్నేహితుల అందమైన ప్రయాణం 'ఉంచాయి'

సీనియర్ దర్శకుడు సూరజ్ బర్జాత్య తెరకెక్కించిన 'ఉంచాయి' చిత్రం నలుగురు స్నేహితుల భావోద్వేగభరిత కథగా ఆకట్టుకుంది. ఈ చిత్రానికిగాను సూరజ్ బర్జాత్య ఉత్తమ దర్శకుడిగా పురస్కారానికి ఎంపికయ్యారు. అమితాబ్ బచ్చన్, డానీ డెంజొప్పా, అనుపమ్ ఖేర్, బొమన్ ఇరానీ ప్రధాన పాత్రలను పోషించారు. తన స్నేహితుడి చివరి కోరికను నెరవేర్చడానికి అతడి చితాభస్మంని తీసుకొని హిమాలయాలకు వెళ్లిన స్నేహితుల కథతో ఆద్యంతం హృదయాన్ని స్పృశించింది.



రిషబ్ శెట్టి అసాధారణ సినీ ప్రయాణం

కన్నడనాటి దర్శకుడిగా, నటుడిగా బహుముఖప్రజ్ఞతో రాణిస్తున్నారు రిషబ్ శెట్టి. ఆయన అసలు పేరు ప్రశాంత్‌శెట్టి. దక్షిణ కర్ణాటక మంగళూరు దగ్గరలోని కెరాడి అనే గ్రామంలో 1983లో జన్మించారు. బెంగళూరులో డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయంలో 'రంగసౌరభం' అనే నాటక బృందంలో నాటకాలు వేసేవారు. కుందాపురలో పాఠశాల రోజుల్లోనే నటనపై మక్కువతో యక్షగాన నేపథ్య నాటికల్లో నటించారు రిషబ్‌శెట్టి. కర్ణాటక ప్రభుత్వం ఫిల్మ్ అండ్ టీవీ ఇనిస్టిట్యూట్ నుంచి డైరెక్షన్‌లో డిప్లొమా పూర్తి చేసిన అనంతరం సినీ రంగంలోకి అడుగుపెట్టారు. తొలుత క్లాప్‌బాయ్, లైట్‌బాయ్, టచప్ మ్యాన్‌గా పనిచేసిన అనంతరం సహాయ దర్శకుడిగా మారారు. సినిమాల్లోకి రాకముందు జీవనం కోసం మినరల్ వాటర్, రియల్‌ఎస్టేట్, హోటల్ వ్యాపారాలు చేసి నష్టాలు చవిచూశారు. 'తుగ్లక్' (2012) చిత్రం ప్రతినాయక పాత్ర ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 'రికీ' (2016) చిత్రంతో దర్శకుడిగా మారారు. నటుడిగా బెల్‌బాటమ్, గరుడ గమన వృషభ వాహన, హాస్టల్ హుడుగురు బేకద్దిరే వంటి చిత్రాలు వంటి చిత్రాలు మంచి గుర్తింపునిచ్చాయి. ఇక 'కాంతార'తో దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కింది. కిరిక్‌పార్టీ, సర్కారి హిరియా ప్రాథమిక శాలే కాసరగోడు వంటి చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటారు.

'కాంతార' సంచలనం

స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి నటించిన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా అద్భుత విజయం సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దైవిక అంశాలు, అడవి బిడ్డల అస్తిత్వ పోరాటం కలబోతగా ఈ చిత్రం అందరి మన్ననలు అందుకొంది. దక్షిణ కన్నడ ఆచార వ్యవహారాలు, ధార్మిక విశ్వాసాల నేపథ్యంలో ఈ సినిమా దేశవ్యాప్తంగా విశేష ఆదరణ సొంతం చేసుకుంది. దక్షిణ కన్నడ సంస్కృతిలో అనాదిగా భాగమైన భూత కోల ఆరాధన, పంజుర్లి దేవత నేపథ్యంలో వచ్చిన సన్నివేశాలు ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లాయి. ఈ సినిమాలో శివ పాత్రలో రిషన్‌శెట్టి అద్భుతాభినయాన్ని కనబరిచాడు. ఈ చిత్రం అన్ని భాషల్లో భారీ విజయం సాధించింది. నాలుగు వందల కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించింది.

70వ జాతీయ అవార్డుల విజేతలు..

- ఉత్తమ చిత్రం: ఆట్టమ్ (మలయాళం)
- ఉత్తమ నటుడు: రిషబ్‌శెట్టి (కాంతార)
- ఉత్తమ నటి: నిత్యామీనన్ (తిరుచిట్రంబళం-తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్-గుజరాతీ)
- ఉత్తమ ప్రాంతీయ చిత్రం: కార్తికేయ-2
- ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంచాయి)
- ఉత్తమ జనరంజక చిత్రం: కాంతార
- ఉత్తమ సహాయనటి: నీనా గుప్తా (ఉంచాయి)
- ఉత్తమ సహాయ నటుడు: పవన్‌రాజ్ మల్హోత్రా (ఫౌజా)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ: రవివర్మన్ (పొన్నియన్ సెల్వన్)
- ఉత్తమ సంగీతం: ప్రీతమ్ (బ్రహ్మాస్త్ర)
- ఉత్తమ నేపథ్య సంగీతం: ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియన్ సెల్వన్)
- ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్: అర్జిత్‌సింగ్ (కేసరియా-బ్రహ్మాస్త్ర)
- ఉత్తమ ఫిమేల్ ప్లేబ్యాక్‌సింగర్: బొంబాయి జయశ్రీ (సౌది వెల్లక్క సీసీ 225/2009-మలయాళం)
- ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ : బ్రహ్మాస్త్ర-1
- ఉత్తమ సౌండ్ డిజైన్: ఆనంద్ కృష్ణమూర్తి (పొన్నియన్ సెల్వన్-1)
- ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: నిక్కి జోషి (కచ్ ఎక్స్‌ప్రెస్)

ఎండకొడితే షూటింగ్ ఆపేశాం!

'మలయాళ భాషలో కథలు చాలా సహజంగా ఉంటాయని చెబుతారు. నేటివిటీకి వాళ్లు పెద్ద పీట వేస్తారు. అలాంటి కథలతో మనమెందుకు సినిమాలు చేయకూడదనుకున్నా. అదే సమయంలో 'ఆయ్' కథ నా దగ్గరకు వచ్చింది' అన్నారు నిర్మాత బన్నీ వాస్. జీఏ2 పతాకంపై నార్నే నితిన్ కథానాయకుడిగా ఆయన నిర్మించిన 'ఆయ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం బన్నీ వాస్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..



- ఈ సినిమా కథ విన్నప్పుడు రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా నవ్వుకున్నా. ఇప్పుడు ప్రేక్షకులు కూడా అదేరీతిలో సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. దర్శకుడు అంజి కే మణిపుత్రది అమలాపురం దగ్గరలోని ఓ చిన్నపల్లెటూరు. అందుకే కథను అందులోని పాత్రలను చాలా సహజంగా తీర్చిదిద్దాడు. కోనసీమ అందాలను అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చాడు
- వర్షంలో కోనసీమ మరింత అందంగా కనిపిస్తుంది. సినిమా చూస్తున్న ప్రేక్షకులు వర్షం తాలూకు అనుభూతి చెందాలని షూటింగ్ అంతా వర్షాకాలంలో ప్లాన్ చేశాం. మబ్బుపట్టినప్పుడే షూటింగ్‌కు వెళ్లేవాళ్లం. ఎండకొడితే షూటింగ్‌ను వాయిదే వేశాం. వర్షాన్ని ఈ కథలో ఓ భాగంగా భావించాం. అందుకే షూటింగ్ కాస్త ఆలస్యమైంది.
- కరోనా కంటే ముందే ఈ కథను ఓకే చేశాను. ఈ సినిమా కోసం టీమ్ మొత్తం చాలా ఎఫర్ట్స్ పెట్టాం. ఈ సినిమా యూత్‌తో పాటు ప్రతి ఒక్కరికి కనెక్ట్ కావాలనుకున్నాం. అందుకే ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్స్‌కు కూడా సమప్రాధాన్యత నిచ్చాం. నేను కథ విన్నప్పుడు ఎంతగా ఎంజాయ్ చేశానో ..సినిమా చూస్తున్న ప్రేక్షకులు కూడా అలాగే ఎంజాయ్ చేస్తున్నారు.
- హీరో నితిన్ తన పాత్రలో అద్భుతంగా నటించాడు. తనలోని టాలెంట్ ఏమిటో ఆయనకు బాగా తెలుసు. కథల విషయంలో ఆయన జడ్జిమెంట్ బాగుంటుంది. సినిమా కొస్తున్న ఆదరణ దృష్ట్యా షోస్ పెంచాలనే డిమాండ్స్ వినిపిస్తున్నాయి. మేము కూడా అదే ప్రయత్నాల్లో ఉన్నాం. ఒకటిరెండు రోజుల్లో షోస్ పెంచుతాం.
- నేను జీవితంలో బంధుత్వం కంటే స్నేహానికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తాను. జీవితంలో ఈ స్థాయికి వచ్చానంటే స్నేహితులే కారణం. బన్నీగారితో పాటు చాలా మంది స్నేహితులు ప్రోత్సాహంతో సక్సెస్ అయ్యాను. అందుకే ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలోని 'ఆయ్' కథకు వెంటనే కనెక్ట్ అయ్యాను. చిన్న సినిమా తీసి పెద్ద సక్సెస్ కొట్టినప్పుడు కిక్ వేరుగా ఉంటుంది. ప్రస్తుతం మా బ్యానర్‌లో 'తండేల్' షూటింగ్ జరుగుతున్నది. డిసెంబర్‌లో రిలీజ్ అనుకుంటున్నాం. అదే నెలలో 'పుష్ప-2'కూడా రాబోతున్నది.




తాతామనవళ్లుగా తండ్రీకొడుకులు

బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న చిత్రం 'బ్రహ్మా ఆనందం'. ఆర్వీఎస్ నిఖిల్ దర్శకుడు. రాహుల్ యాదవ్ నక్కా నిర్మాత. ఈ సినిమాలోని బ్రహ్మానందం ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. సంప్రదాయ పంచెకట్టులో, హుందాగా నవ్వుతూ నడుస్తూవస్తున్న బ్రహ్మానందాన్ని ఈ లుక్‌లో చూడొచ్చు. ఈ నెల 19న ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ని కూడా విడుదల చేయనున్నామని మేకర్స్ తెలిపారు. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందిన మళ్లీరావా, ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ, మసూద చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో ఈ సినిమాపై కూడా అంచనాలు భారీగా ఉన్నాయని మేకర్స్ తెలిపారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హులక్కల్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, సంపత్, రాజీవ్ కనకాల కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మితేష్ పర్వతనేని, సంగీతం: శాండిల్య పిసపాటి.

వీరమల్లు పోరాటాలు

పవన్‌కల్యాణ్ 'హరిహరవీరమల్లు'కు చెందిన కీలకమైన అప్‌డేట్ వచ్చేసింది. ఈ నెల 14 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించినట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ షెడ్యూల్‌లో స్టంట్ కొరియోగ్రఫర్ సిల్వ నేతృత్వంలో భారీ యుద్ధ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు వారు తెలిపారు. ఈ చిత్రీకరణలో దాదాపు 500మంది ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారని, మరికొద్దిరోజుల్లో పవన్‌కల్యాణ్ కూడా షూటింగ్‌లో పాల్గొంటారని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పారు. మునెపెన్నడూ చూడని విధంగా ఓ అద్భుతమైన యోధుడిగా పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని, ఆయన కెరీర్‌లోనే తొలి ఫిక్షనల్ మూవీ ఇదని, అన్ని కార్యక్రమాలనూ త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే 'హరిహరవీరమల్లు పార్ట్ 1'ను విడుదల చేస్తామని జ్యోతికృష్ణ తెలిపారు. బాబీడియోల్, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాత: ఎ.దయాకర్‌రావు, సమర్పణ: ఏ.ఎం. రత్నం, నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.





అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను వినిపిస్తున్న వేముల. చిత్రంలో బాజిరెడ్డి

రేవంత్‌పై రైతులు తిరగబడాలి

- దేవుళ్లపై దొంగ ఒట్లు వేసి అబద్ధాలాడుతున్న మూర్ఖుడు
- రుణమాఫీలో అర్హులకు అన్యాయం
- హరీశ్ సవాల్‌తోనే ఆ మాత్రం రుణమాఫీ: వేముల
- ఉచిత బస్సు బకాయిలు 2వేల కోట్లు : బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, ఆగస్టు 16, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంస్కారం, మానవత్వం లేదు. దేవుళ్లపై ఒట్టేసి అబద్ధాలాడుతున్న మూర్ఖుడు ఆయన' అంటూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు.రూ.2లక్షల్లోపు రుణాలు ఒకేసారి మాఫీ చేస్తామని ఎన్నికల్లో కల్లబొల్లి వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక రైతులను రేవంత్‌రెడ్డి నిలువునా ముంచారని, ఆయనపై రైతులు, ప్రజలు తిరగబడాలని, ఎక్కడికక్కడ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి వేముల శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ చేయక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2లక్షల 4వేల మందిని వంచించారని, అర్హులైన రైతుల నోట్లో మట్టికొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ తీరును ఎండగడుతూ నేడు బాల్కొండ నియోజకవర్గ రైతులతో కలిసి వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ధర్నా చేయనున్నట్టు ప్రకటించారు. రేవంత్‌రెడ్డి భాషను చూస్తుంటే అసహ్యం వేస్తున్నదని మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలు అమలు చేయనందున తక్షణం సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైరా సభలో ప్రసంగం చూస్తుంటే మెదడు చితికి మానసిక రుగ్మతలతో రేవంత్ బాధపడుతున్నట్టు తెలుస్తున్నదని ఎద్దేవాచేశారు. రుణమాఫీ చేయకుండా ఉల్టాచోర్ కొత్వాల్‌కే డాంటే అన్నట్టుగా రేవంత్ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం చెప్తున్న అబద్ధాలకు అబద్ధమే ఆత్మహత్య చేసుకుంటుందని ఎద్దేవాచేశారు. హరీశ్ సవాల్‌తోనే ఈ మాత్రం రుణమాఫీ అయినా జరిగిందని, లేదంటే ఇది కూడా అమలుకాకపోయేదని గుర్తుచేశారు.

43వేల మంది కార్మికుల జీవితాలు అగమ్యగోచరం: బాజిరెడ్డి గోవర్ధన్

ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2వేల కోట్ల బకాయిలు పడిందని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ప్రతి నెలా బకాయిలను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పి తీరా నిధులు కేటాయించకపోవడంతో 43వేల మంది కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని చెప్పారు. ఆర్టీసీ కార్మికులకు సమయానికి జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని వివరించారు. మహిళలను కించపరిచారంటూ కేటీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వితంతువులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు రూ.4వేల పింఛన్ అమలు కావడం లేదని, మహిళలకు రూ.2500 ఇవ్వడం లేదని, యువతులకు స్కూటీలు ఇస్తామని చెప్పి 8 నెలలుగా మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డిని ఆడబిడ్డలంతా నిలదీయాలని పిలుపునిచ్చారు. మహిళలకు రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుజిత్ సింగ్ ఠాకూర్, సిర్ప రాజు, రవిచంద్ర, దండు శేఖర్, సత్య ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, కేపీ వివేకానంద

..నిరూపిస్తే రాజీనామా

మొదటిపేజీ తరువాయి...

రూ. 31 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పారని, బడ్జెట్‌లో మాత్రం 26 వేల కోట్లు చూపించి.. 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి అంకెల గారడీ చేశారని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్‌తో కలిసి కేటీఆర్ మాట్లాడారు. సెక్యూరిటీ లేకుండా రేవంత్‌రెడ్డి జనంలోకి వెళ్తే ఫుట్‌బాల్ ఆడుకుంటారని పేర్కొన్నారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసినందుకు ఆయనపై చీటింగ్ కేసు పెట్టాలని పేర్కొన్నారు. అర్హులైన వారిలో సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని తెలిపారు. ఇంత దిగజారుడు ముఖ్యమంత్రిని ఎక్క డా చూడలేదని పేర్కొన్నారు.

నిబంధనల పేరుతో కటింగ్‌లు

ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం కొందరికే చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల పేరుతో రుణమాఫీలో కటింగ్‌లు పెట్టి సీఎం కాస్తా కటింగ్ మాస్టర్‌గా మారిపోయారని ఎద్దేవా చేశారు. 60 శాతం మందికి ఎగ్గొట్టి, 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి మోసం చేశారని దుయ్యబట్టారు. మార్పుమార్పు అంటూ రైతన్నలను మోసం చేశారని దుయ్యబట్టారు. 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ. 2500, జాబ్ క్యాలెండర్, ఆటో అన్నలకు సాయం, వృద్ధులకు రూ. 4వేలు అన్నీ మోసమేనని మండిపడ్డారు.

ఫ్రస్టేషన్‌తో రంకెలు

రైతుల గొంతును రేవంత్‌రెడ్డి తడిగుడ్డతో కోస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వానకాలానికి ఇవ్వాల్సిన రైతు భరోసాను ఎగ్గొట్టారని, ఆగస్ట్ సగం నెల గడిచినా ఇంకా ఇవ్వలేదని మండిపడ్డారు. యాసంగిలోనూ రైతు భరోసా ఇవ్వలేదని పేర్కొన్నారు. తాము రైతులకు లక్షకోట్లు ఇస్తే ఈ ప్రభుత్వం 17 వేల కోట్లే ఇచ్చిందని చెప్పారు. రేవంత్ ఫుల్‌ఫ్రస్టేషన్‌తోనే తమపై రంకెలేశారని పేర్కొన్నారు. తనకంటే కుటుంబసభ్యులు దూసుకెళ్తున్నారని, భట్టి విక్రమార్క ఎక్కువ తిరుగుతున్నాడని, అధిష్ఠానం పట్టించుకోవడం లేదని బాధవల్లే అలా ఫ్రస్టేషన్‌కు గురైనట్టు తెలుస్తున్నదని ఎద్దేవా చేశారు.

రేవంత్ మానసిక స్థితిపై అనుమానం

రేవంత్‌రెడ్డి మానసిక స్థితిపై కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. గౌడన్నలు కల్లులో నీళ్లు ఎన్ని కలుపుతారో అంటాడని, ప్రైవేటు టీచర్లు ఫెయిలయ్యే వాళ్లంటాడని, మహిళలను కించపరుస్తాడని, భాక్రానంగల్, విప్రో, ఇన్ఫోసిస్ అంటూ ఏదేదో మాట్లాడుతున్నాడని, ఆయన కుటుంబసభ్యులు ఈ విషయాన్ని పరిశీలించాలని సూచించారు. తమకు రాజీనామాలు కొత్తకాదని, రేవంత్‌రెడ్డికి మోసం కొత్తకాదని పేర్కొన్నారు.

> **యథాలాపంగానే అన్నా**
>
> **మహిళలపై** యథాలాపంగా చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. రేవంత్‌రెడ్డికి కూడా సంస్కారం ఉంటే మహిళా శాసనసభ్యులను విమర్శించినందుకు విచారం వ్యక్తం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం కాబోతున్నదంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని తాను కూడా అంటానని పేర్కొన్నారు.

19 సార్లు ఢిల్లీకి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 8 నెలల్లో రేవంత్‌రెడ్డి 19 సార్లు ఢిల్లీకి వెళ్లారని, ఇంకెన్నిసార్లు వెళ్తారోనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలు ప్రతి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలను పరిశీలించి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని చెప్పారు. రుణమాఫీ సంపూర్ణంగా చేయకుంటే కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్‌ను సంస్థాగంతా బలోపేతం చేసేందుకు ఇతర పార్టీల పనితీరును అధ్యయనం చేయబోతున్నట్టు కేటీఆర్ తెలిపారు. తమిళనాడులోని డీఎంకే సహా పలు పార్టీలను అధ్యయనం చేసేందుకు సెప్టెంబర్‌లో తనతోపాటు సీనియర్ నేతలు వెళ్లనున్నట్టు చెప్పారు. అనంతరం పార్టీలో అవసరమైన మార్పులు చేస్తామని తెలిపారు. కమ్యూనిస్టులు ధృతరాష్ట్రుడి కౌగిలిలో ఉన్నారని, రైతు సమస్యలపై కలిసి వస్తానంటే వారిని కలుపుకొని వెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్ రెడ్డి, తాతా మధుసూదన్, ఎమ్మెల్యే వివేకానంద, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చల్లా ధర్మారెడ్డి, బీఆర్‌ఎస్ నేత లక్ష్మీనర్సింహారావు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో 342 మందికే రుణమాఫీ

మేడ్చల్, ఆగస్టు16(నమస్తే తెలంగాణ): మూడో విడత రుణమాఫీ జాబితాలోనూ స్థానం దక్కని రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడో విడతలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్నవారిలో 342 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. జిల్లాలో రుణమాఫీకి అర్హులైన రైతులు 30 వేల పైచిలుకు ఉన్నప్పటికీ, మూడు విడతల్లో కలిపి 3,436 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రుణమాఫీ పథకం కింద రూ.22 కోట్లు మాత్రమే ఇచ్చారు. దీంతో 'మేము రైతులం కాదా?' అంటూ ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్రీవెన్స్‌సెల్ దరఖాస్తులకు స్పందన కరువైందని రైతులు అంటున్నారు.

ఐటీ కట్టిన వారు రైతులు కాదా?

ఐటీ కడుతున్న వారికి రుణమాఫీ వర్తింపచేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఐటీ కడుతున్న వారు రైతులు కాదా? అని ప్రశ్నిస్తున్నారు. రేషన్‌కార్డులు లేని వారికి కూడా రుణమాఫీ చేయలేదన్న ఆరోపణలను ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. 3 విడతల్లోనూ రుణమాఫీ పొందని రైతులకు మరో జాబితాలోనైనా రుణమాఫీ చేస్తారో లేదో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

రేవంత్‌రెడ్డి అభినవ గోబెల్స్

- రుణమాఫీ అయితే బ్యాంకుల చుట్టూ రైతులు ఎందుకు తిరుగుతున్నరు?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం



తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : 'రేవంత్‌రెడ్డి అభినవ గోబెల్స్.. గతంలో రేవంత్ మాట్లాడినట్టుగా దిల్‌సుఖ్ నగర్‌లో విమానాలు దొరుకుతాయనేది ఎంత నిజమో.. తెలంగాణలో భాక్రానంగల్ డ్యామ్ ఎంతనిజమో.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ కూడా అంతే నిజం.. అభినవ గోబెల్స్ అవార్డు ఇస్తే అది రేవంత్ సర్కారుకే దక్కుతుంది' అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 31 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పి, 17 వేల కోట్లతోనే రుణ మాఫీ అయినట్టు ప్రకటించడం విడ్డూరంగా ఉందని చెప్పారు. డిసెంబర్ 9న రుణ మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పి మాటతప్పారని, ఆరు గ్యారెంటీలను గడువులోగా అమలుచేస్తే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు చెప్పారని, ఆ విషయాన్ని రుణమాఫీ చుట్టూ తిప్పి అరకొరగా అమలుచేసి రుణమాఫీ అయిపోయిందని దబాయిస్తూ రాజీనామా చేయాలని దుర్భాషలాడడం సరికాదని హితవుపలికారు. రుణమాఫీ పూర్తయితే రాష్ట్రంలో రైతులు ఎందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ప్రశ్నించారు. 70 లక్షల మంది రైతుల్లో 60 లక్షల మంది రుణాలు తీసుకున్నారని, ప్రభుత్వం మాత్రం 44 లక్షల మంది అని లెక్కలు చెబుతున్నదని అసలుకంటే కొసరెక్కువ అన్నట్టు రుణమాఫీపై మీడియా ప్రకటనలకే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.300 కోట్ల దాకా ఖర్చు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రైతుభరోసా ఒక్క విడతకు రూ.15 వేల కోట్లు కావాలని, అది ఎగ్గొట్టి రూ.17వేల కోట్లతో రుణ మాఫీ చేసి రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రైతు భరోసాపై క్యాబినెట్ సబ్ కమిటీ, చర్చలు, శాసనసభలో చర్చలన్నీ పక్కకు పోయాయని, జూలై 15కు నివేదిక అన్నారని, ఆగస్ట్ 15 దాటినా గతి లేదని, కనీసం కృష్ణానదిలో వృథాగా పోతున్న నీటిని ఒడిసిపట్టే తెలివి ఈ ప్రభుత్వానికి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు జిల్లాలో కుంటలు, చెరువులు వెలవెలబోతున్నాయని, కట్టిన రిజర్వాయర్లను నింపుకొనే సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రుణమాఫీపై బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ కు ఇప్పటి వరకు 1,11,027 వాట్సాప్ ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సీఎంకు పంపిస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ పాల్గొన్నారు.



గన్‌పార్క్ వద్ద శుక్రవారం నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

రుణమాఫీలో సీఎం విఫలం: ఎర్రోళ్ల

- గన్‌పార్క్ వద్ద బీఆర్‌ఎస్వీ నిరసన

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : రెండు లక్షల రుణమాఫీ చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని, ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో గన్‌పార్క్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, రెండు లక్షల రుణ మాఫీ చేస్తేనే తన పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు ప్రకటించారని, ఆరు గ్యారెంటీలు ఉసేలేదని, ఇంకా 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరాననని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లె రవి, అంజనేయగౌడ్, వాసుదేవరెడ్డి, భిక్షపతి, మన్నె గోవర్ధన్ రెడ్డి, గోసుల శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు, చటారి దశరథ్ పాల్గొన్నారు.

ఇవి తాజా మార్గదర్శకాలు

- మండలంలోని అన్ని బ్యాంకు శాఖలు, సహకార సంఘాలకు మండల వ్యవసాయ అధికారి బాధ్యత వహిస్తారు.
- ఫిర్యాదులను మండల వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా సీఎల్‌డబ్ల్యూ పోర్టల్ (www.clw.telangana.gov.in)లో రైతు సమాచారపత్రాన్ని యాక్సెస్ చేయాలి. సమాచారపత్రం కాపీని రైతుతో పంచుకోవాలి.
- ఆధార్ తప్పుగా ఉన్న సందర్భాల్లో ఎంఏవో తప్పనిసరిగా రైతు నుంచి ఆధార్ కార్డు కాపీని తీసుకోవాలి. పోర్టల్‌లో సరైన ఆధార్‌ను కీ చేసి కాపీని అప్‌లోడ్ చేయాలి. ఓటరుకార్డు, వాహన లైసెన్స్, రేషన్‌కార్డు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాన్ని సేకరించి అప్‌లోడ్ చేయాలి.
- కుటుంబాలను ఇంకా నిర్ణయించని సందర్భాల్లో, ఎంఏవో తప్పనిసరిగా రైతు ఇంటికి వెళ్లి రైతు వెల్లడించిన ఆధార్ కాపీలు, కుటుంబసభ్యుల సంఖ్యను సేకరించాలి. ఆ వివరాలను పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలి.
- రైతుకు పట్టాదారు పాస్‌బుక్ లేని సందర్భాల్లో, రైతు నుంచి తీసుకున్న తర్వాత దానిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఆధార్‌లో పేరు, లోన్ ఖాతాలో పేరు మధ్య లోపాలు లేదా తేడాలు ఉంటే రుణం తీసుకున్న వ్యక్తికి సంబంధించిన గుర్తింపును ఏర్పాటుచేయాలి. రుణం తీసుకున్న వ్యక్తికి సంబంధించి సరైన ఆధార్ నంబర్‌ను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- అసలు, వడ్డీ మొత్తంలో సరిపోలని పక్షంలో, రైతు నుంచి ఒక దరఖాస్తును తీసుకుని, వివరాలను క్లుప్తంగా పేర్కొంటూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయొచ్చు. నిర్ధారణ, దిద్దుబాటు కోసం అదే సంబంధిత బ్యాంకుకు పంపించాలి.
- పై కార్యకలాపాల్లో పోర్టల్‌లో నవీకరణ ఉంటుంది కాబట్టి, పోర్టల్‌ను త్వరలో నవీకరించిన తర్వాత ప్రస్తుత ప్రాతినిధ్యాలు, పత్రాలను సేకరించి అప్‌లోడ్ చేయొచ్చు.
- జిల్లా వ్యవసాయ అధికారులు, అసిస్టెంట్ డివిజనల్ స్థాయి వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు సర్క్యులర్‌లోని విషయాలను జాగ్రత్తగా గమనించాలి. ఎంఏవోలు వారి సంబంధిత మండలాల్లో ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి డీఏవో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు మండలాలవారీగా ఫిర్యాదుల సంఖ్యపై రోజువారీగా నివేదికలను పంపాలి.
- వ్యవసాయ శాఖాధికారులు సమావేశాలను ఏర్పాటుచేసుకొని.. తక్షణమే ఈ మార్గదర్శకాలు అమల్లోకి వచ్చేలా, ఈ సూచనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.



రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో బీఆర్‌ఎస్ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మాఫీ కథ మళ్లీ మొదటికి?

మొదటిపేజీ తరువాయి...

ఓపిక పట్టాలని అధికారులు సూచించడంతో రైతులందరూ ఇప్పటివరకు ఎదురు చూశారు. మొదటి రెండు విడతల్లో రుణమాఫీ జరగలేదని స్పష్టంగా రైతులకు తెలిసినా.. చాలామంది ఆ విషయాన్ని మీడియాలో కానీ, సోషల్ మీడియాలో కాని పంచుకోవడానికి ముందుకు రాలేదు. ఈరోజు కాకపోతే రేపైనా మాఫీ అవుతుందన్న కోణంలో ఆలోచించి కోపాన్ని దిగమింగుకున్నారు. మూడో విడతలోనూ తమ పేర్లు లేకపోవడంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబికుతున్నది. ఇన్నాళ్లు వేచిచూసిన రైతులు ఇక ఓపిక పట్టే పరిస్థితుల్లో లేరన్న విషయాన్ని నిఘా వర్గాలు ప్రభుత్వానికి చేరవేశాయి.


మసిపూసేందుకు మరో డ్రామా..?

రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎక్కువ శాతం మందికి రుణమాఫీ జరగలేదన్న వార్తలే వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో 40-45% మందికి, మరికొన్ని గ్రామాల్లో 50% వరకు రుణమాఫీ అయింది. దీంతో ఇన్నాళ్లు ఆశగా వేచిచూసిన రైతులు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా పది మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం.. అందులోనూ అనేక కొర్రీలు పెట్టింది. ఉదాహరణకు అంశం నంబర్ 7ను పరిశీలిస్తే.. అసలు, వడ్డీ మొత్తం లో సరిపోలని పక్షంలో, రైతు నుంచి దరఖాస్తు తీసుకుని, వివరాలను క్లుప్తంగా పేర్కొంటూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఆయా దరఖాస్తులను నిర్ధారణ, దిద్దుబాటు కోసం అదే బ్యాంకుకు పంపుతామని పేర్కొన్నది. ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ ఒక్క అంశంతో తేల్చవచ్చంటున్నారు నిపుణులు. లోన్ ఎంత ఉన్నదో రైతు చెప్పగలడు కానీ, వడ్డీ ఎంత ఉన్నదన్న విషయాన్ని రైతు ఎలా చెప్పగలడు? అలాగే రైతు నుంచి తీసుకున్న దరఖాస్తును తిరిగి సంబంధిత బ్యాంకుకు పంపిస్తామని పేర్కొన్నది. రైతు నుంచి దరఖాస్తును తీసుకునే బదులు.. నేరుగా బ్యాంకు నుంచి వివరాలు తెప్పించుకోవచ్చు. అయితే సాగదీసే వ్యూహంతోనే మళ్లీ దరఖాస్తుల అంకానికి తెర లేపుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం ముున్ముందు ఇంకా మరికొొందరికి రుణమాఫీ చేస్తదన్న నమ్మకాన్ని రైతుల్లో కల్పించేందుకే ఈ మార్గదర్శకాలు జారీ చేశారనే చర్చ జరుగుతున్నది.

ఎందుకీ ఈ తతంగం?

రుణమాఫీ ప్రక్రియను గతంలో రెండుసార్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహించింది. ఏనాడూ ఇటువంటి ఫిర్యాదులు రాలేదు. ముందుగానే అర్హులను గుర్తించి, అమలు చేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అర్హుల జాబితాలో కోతలు పెట్టడమే లక్ష్యంగా వ్యవహరించింది. అసలు రుణమాఫీ అర్హుల జాబితాలను ఎక్కడి నుంచి తీసుకున్నారన్న విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఇప్పుడు కూడా రుణమాఫీ కాని రైతులను అధికారుల చుట్టూ తిప్పకుండా గ్రామస్థాయిలో రుణమాఫీ కానివారితో ఒక మీటింగ్ పెట్టి... కారణాలు తెలుసుకొని అక్కడికక్కడే వివరాలను అప్‌లోడ్ చేస్తే సరిపోతుందన్న సూచనలు వస్తున్నాయి. ఆయా బ్యాంకులు, సహకార సంఘాలు రుణమాఫీ కాని రైతుల జాబితాలను తయారు చేసి పెట్టాయి. వాటి నుంచి నేరుగా డాటా తీసుకొని.. ప్రభుత్వం సదరు రైతులకు నేరుగా సమాచారం ఇచ్చి అవసరమైన పత్రాలను తెప్పించి, రుణమాఫీ చేయొచ్చు. కానీ, ఇటువంటి మార్గాలను ప్రభుత్వం అనుసరించకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

లోకం పోకడ





అసెంబ్లీ మీడియా హాలులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు

రుణమాఫీపై శ్వేతపత్రం ఇస్తరా?

రేవంత్‌రెడ్డీ.. జుగుప్సాకర మాటలేంది?

ప్రజలు ఉరికించి కొట్టే రోజులు దగ్గర్లోనే..

ఎమ్మెల్సీ రవీందర్‌రావు మండిపాటు

దేన్నీ అమలుచేయకుండా హరీశ్‌ను రాజీనామా అడిగే హక్కు ఎక్కడిది? : ఎమ్మెల్సీ తాతా మధు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): మహిళలకు ఇస్తామన్న రూ.2,500, రైతు భరోసా ఎకరాకు రూ.15,000, రైతు కూలీలకు ఇస్తామన్న డబ్బులు, వడ్లకు బోనస్, కల్యాణలక్ష్మి కింద ఇస్తానన్న తులం బంగారం ఏమయ్యాయని, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఇండ్ల స్థలాలు ఏవని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు నిలదీశారు. 'ముఖ్యమంత్రి హోదాలో జుగుప్సాకరంగా మాట్లాడుడేంది? రేవంత్ రెడ్డీ.. నాలుక జాగ్రత్త' అంటూ హెచ్చరించారు. వైరాలో సీఎం మాట్లాడిన మాటలు ప్రజలు సిగ్గుపడేలా ఉన్నాయని, సీఎం పదవిని దిగజార్చుతున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు చెప్పుతో ఉరికించి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మండిపడ్డారు. ముసలోళ్లను కూడా మోసగించిన రేవంత్‌ను ప్రజలు ఎలా క్షమిస్తారని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వెళ్లి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై రేవంత్ మాట్లాడిన తీరు, భాష సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టు ప్రారంభానికి వెళ్తే రైతులనుద్దేశించి మాట్లాడాలి గాని, సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం తగదని హితవుపలికారు. 50 ఏండ్లు ప్రజాజీవితం, 14 ఏండ్లు రాష్ట్ర సాధనోద్యమం, పదేండ్లు సీఎం, 60 లక్షల సభ్యత్వం ఉన్న పార్టీని నడుపుతున్న కేసీఆర్, రాష్ట్ర ఉద్యమం నుంచి వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావును ఉద్దేశించి రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడటం ఏమిటని నిలదీశారు. 'రుణమాఫీ ఎక్కడా సరిగా అమలుకాలేదు. వడ్డీలు మాత్రం కట్టించుకుంటున్నరు. 'ఎంతమంది రైతులకు రుణమాఫీ చేశారో గ్రామాలకు వెళ్లి చూద్దామా' అని సవాల్ విసిరారు. రైతుల ఖాతాల్లో ఎన్నివేల కోట్లు వేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలు తిరగబడుతరు : తాతా మధు

సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వమని, తామే చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం ఎవరో కన్న బిడ్డను తన బిడ్డ అని చెప్పుకొన్నట్టుగా ఉన్నదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ఎద్దేవాచేశారు. వైరాలో అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలు ఇప్పుడు భరించినా తర్వాత తిరగబడతారని హెచ్చరించారు. ప్రజాపాలన అని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి ముందస్తు అరెస్టులు ఎందుకు చేయిస్తున్నారని, బీఆర్‌ఎస్‌తోపాటు ఇతర విపక్ష నేతలను ఎందుకు గృహ నిర్బంధం చేశారని ప్రశ్నించారు. 2 లక్షల రుణమాఫీ, ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలను ఆగస్టు 15లోగా పూర్తిచేస్తేనే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని, రాజీనామా లేఖను గతంలో గన్‌పార్కు వద్ద మీడియాకు ఇచ్చారని గుర్తుచేశారు. ఆ లేఖలో పేర్కొన్న ఏ ఒక్క అంశాన్నీ అమలుచేయకుండా హరీశ్‌రావును రాజీనామా అడిగే హక్కు రేవంత్‌రెడ్డికి ఎక్కడిదని ప్రశ్నించారు. 'మీ రుణమాఫీ చారిత్రక ఘట్టమైతే కాంగ్రెస్ నేతలు గన్‌మెన్లను పక్కన బెట్టి గ్రామాలకు వెళ్లాలి. సదస్సులు పెట్టి రుణమాఫీపై చర్చించాలి. అపుడు తెలుస్తుంది రైతుల్లో ఉన్న ఆగ్రహం. వాళ్లు ఉరికించి కొడుతరు' అని హెచ్చరించారు. 'పీసీసీ హోదాలో నీకు నచ్చినట్టు ఉండు. కానీ సీఎం హోదాలో ఎలా మాట్లాడాలో తెలియదా?. చిల్లరగా మాట్లాడితే తెలంగాణ పరువుపోతున్నది. రేవంత్ ప్రవర్తన సీఎం పదవి స్థాయిని దిగజార్చేలా ఉన్నది' అని తాతా మధు విమర్శించారు.

రేవంత్ రాజీనామా చేయాలి

బొమ్మెర రామ్మూర్తి డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ముందు ఓట్ల కోసం 41 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తానని కనబడిన దేవుళ్లపై ఒట్టేసి చెప్పి రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బొమ్మెర రామూర్తి డిమాండ్ చేశారు. రూ.18 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసి, రైతుల నోట్లో మట్టికొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి భేషరుతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాట ఇచ్చింది, మోసం చేసింది, మాట తప్పింది, పచ్చి అబద్ధాలు ఆడుతున్నది రేవంత్ రెడ్డి అని, హరీశ్‌రావును రాజీనామా చేయాలని అడిగే హక్కు, అర్హత రేవంత్‌కు లేదని స్పష్టంచేశారు. ఇప్పటి వరకు అమలు చేసిన ఒకటో రెండో గ్యారెంటీలనైనా సక్రమంగా అమలు చేశారా? అని ప్రశ్నించారు.